# శ్రీ గిడుగు వేంకట రామమూర్తి జీవితం–రచనలు

# Sri Gidugu Venkata Ramamurti's Life and His Works

**(On the occasion of Sri Gidugu Venkata Ramamurti's 150th Birth Anneversary)**

## Collection of National Seminar Papers

---


**Honorary Editor**

**Prof. S. SARATJYOTSNA RANI**

**Chief Editor**

**Dr. PAMMI PAVAN KUMAR**

**Co-Editor**

**Dr. BANALA BHUJANGA REDDY**



**Department of Telugu**

**University of Hyderabad**

**HYDERABAD – 500 046**

**Andhra Pradesh, India**

**November, 2013**

## Sri Gidugu Venkata Ramamurti's Life and His Works
**(On the occasion of Sri Gidugu Venkata Ramamurti's 150th Birth Anneversary)**
Collection of National Seminar Papers

Seminar held on - 04 October, 2013.
This Seminar has been Conducted in colloboration with:
*Chitkalaavaahini Saahitya Saamskritika Samstha*, Hyderabad.

---


### Chief Patron
**Prof. RAMAKRISHNA RAMASWAMY**
**FNA., FASc., FTWAS.**
**Vice-chancellor, University of Hyderabad.**

### Honorary Editor
**Prof. S. SARATJYOTSNA RANI**

### Chief Editor
**Dr. PAMMI PAVAN KUMAR**

### Co-Editor
**Dr. BANALA BHUJANGA REDDY**



**© Department of Telugu, University of Hyderabad.**



**First Impression: November, 2013.**
**ISBN 978-81-908332-6-4 (Print)**

**Online Version of the Collection can be viewed at:**
**www.languageinindia.com**
**ISSN 1930-2940**

**Print Copies can be had from:**
**The Department of Telugu, University of Hyderabad,**
**HYDERABAD – 500 046, Andhra Pradesh, India.**

# విషయసూచిక

(i) వైస్‌చాన్సలర్‌గారి సందేశం

(ii) శాఖాధ్యక్షుల సందేశం

(iii) సంపాదకీయం

(iv) సదస్సు వివరాల పత్రిక

(v) కీలకోపన్యాసపాఠం

(vi) ముఖ్య అతిథి ప్రసంగపాఠం

(vii) విశిష్ట అతిథి ప్రసంగపాఠం

(viii) మొదటి సమావేశ అధ్యక్షుల తొలిపలుకులు

(ix) రెండో సమావేశ అధ్యక్షుల తొలిపలుకులు

(x) ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథి చేసిన ప్రసంగపాఠం

## పత్రాలు:

1. గిడుగు వ్యవహారిక భాషోద్యమం–'తెలుగు' పత్రిక పాత్ర – ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి

2. వ్యావహారిక తెలుగు ప్రాధాన్యం గుర్తించిన లాక్షణికులు – ఆచార్య ఆర్. వి. ఆర్. కె. శాస్త్రి

3. వాడుక భాషగా తెలుగు : గిడుగు ఆలోచనాసరళి – ఆచార్య జి. ఉమామహేశ్వర రావు

4. వాడుక భాష గురించి కొన్ని వివాదాలు – ఆచార్య బి. ఆర్. బాపూజి

5. గిడుగు రామమూర్తిపంతులుగారి 'నేటితెలుగు-నివేదిక' – డాక్టర్ పిల్లలమర్రి రాములు

6. గిడుగు భాషాదృక్పథం – డాక్టర్ ఎమ్. సంపత్‌కుమార్

7. గిడుగు రామమూర్తి భాష,సాహిత్యం , సామాజిక దృక్పథం – డాక్టర్ దార్ల వేంకటేశ్వర రావు

8. ఆధునిక భాషగా తెలుగు – గిడుగు ఆలోచనలు – డాక్టర్ డి. విజయలక్ష్మి

9. భాషాశాస్త్రవేత్తగా 'గిడుగు' – డాక్టర్ బి. భుజంగరెడ్డి

10. 'గిడుగు' భాషాప్రస్థానం – డాక్టర్ కె. కృష్ణమూర్తి

11. గిడుగు భాషాసేవ: మన కర్తవ్యం – డాక్టర్ పమ్మి పవన్‌కుమార్

# University of Hyderabad

**Prof. Ramakrishna Ramaswamy,**
**FNA., FASc., FTWAS.**
**Vice-chancellor.**

Dated: 28 October, 2013

# సందేశం

మీ అందరికీ నమస్కారం.

శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారి జీవితం–రచనలు అన్న అంశంమీద వారి 150వ జయంతిని పురస్కరించుకొని మా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ జాతీయ సదస్సును నిర్వహించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. స్వయంగా అనేక భాషలలో పండితులు, ముఖ్యంగా సవర, తెలుగు భాషలకు విశేషమైన సేవలను అందించినవారు శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారు. ఈ సదస్సువిశేషాలను నిర్వాహకులనుండి తెలుసుకొని చాలా సంతోషించాను. సదస్సులో సమర్పించిన పత్రాల సంకలనాన్ని, తొలిసారిగా ఇంటర్నెట్‌ద్వారా అందరికీ అందుబాటులోకి తెస్తున్నందుకు సదస్సు నిర్వాహకులను మనసారా అభినందిస్తున్నాను. ఈ సంకలనం విద్యార్థులకు, పరిశోధకులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులకు ఉపకరిస్తుందని నమ్ముతున్నాను.

కేవలం సదస్సును నిర్వహించడంతో సరిపెట్టకుండా, పత్రాలకు ఇలా సంకలన రూపం ఇస్తున్న తెలుగుశాఖ అధ్యక్షులను, సంపాదకులను, పత్ర సమర్పకులను, శాఖలోని ఆచార్యులను, విద్యార్థులను, పరిశోధక విద్యార్థులను, మనసారా అభినందిస్తున్నాను.

శుభాకాంక్షలతో,

(ఆచార్య రామకృష్ణ రామస్వామి)

**Prof. C. R. Rao Road, (po) Central University, Gachibowli, HYDERABAD – 500046., A. P.**
**Ph: +91-40-2301 0121 Fax: +91-40-2301 1090, e-mail: vcuohyd@gmail.com, www.uohyd.ac.in**

University of Hyderabad

*Sanghamitra Awardee*

**Prof. S. Saratjyotsna Rani,**

**Professor & Head, Department of Telugu,**

**Coordinator, Centre for the Study of Classical Telugu.**


Dated: 22 October, 2013

# నా మాట

ఇది శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారి 150వ జయంతి సంవత్సరం. తెలుగు భాషాభిమానులకు, సాహిత్యానుశీలురకు ఇది గుండెనిండుగా సంతోషాన్నిచ్చే సందర్భం. వాడుక భాషకు మహత్తరమైన దశను కల్పించి, శతాబ్దాల దిశను మార్చిన మహామనీషి అయిన గిడుగువారిపై ఒక జాతీయ సదస్సును నిర్వహించాలని మా శాఖ ఈ సందర్భంలో సంకల్పించింది. చిత్కళావాహిని సాహిత్య సాంస్కృతిక సంస్థ, సదస్సు నిర్వహణ బాధ్యతలను పంచుకొనేందుకు ముందుకొచ్చింది. మా శాఖలోని సహవ్రతుల బృందం బాసటనిచ్చింది. ఫలితంగా, 04 అక్టోబరు 2013న ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించగలిగాం.

పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం కులపతులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు, తెలుగు అకాడమి పూర్వ డైరెక్టరు ఆచార్య జె. ప్రతాపరెడ్డిగారు, ప్రస్తుత డైరెక్టరు ఆచార్య కె. యాదగిరిగారు... వంటి పండితులు ఈ సభలో పాల్గొని ప్రసంగించారు. మా శాఖలోని ఆచార్యులు ఈ సదస్సులో పత్రాలు సమర్పించారు. మేం ఆహ్వానించిన ప్రతిఒక్కరు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సంకలనానికి మా వైస్‌చాన్సలర్‌గారు చక్కటి సందేశాన్ని తెలుగులో ఇచ్చారు. ఇవన్నీ ఎంతో సంతోషాన్నిచ్చే అంశాలు.

మా శాఖలో ఏ పని తలపెట్టినా, అది తమదిగా భావించి పాల్గొనే విద్యార్థులను, పరిశోధక విద్యార్థులను ఈ సందర్భంలో అభినందిస్తున్నాను. ఇటువంటి ఉత్సాహభరిత వాతావరణం ఉందికాబట్టే, మా శాఖ ఇప్పటివరకు 30కిపైగా జాతీయ సదస్సులను వివిధ అంశాలపై నిర్వహించగలిగింది. చదువులోనేకాకుండా, ఉన్నత పరిశోధనలు చేయడానికి సాధించే ఫెలోషిప్‌ల సాధనలో మా శాఖ విద్యార్థులు సాధించింది ఇప్పటికే ఒక రికార్డు. ఆ విజయ పరంపరను ఎప్పటికీ అలా కొనసాగించమని వారికి సూచిస్తున్నాను. ఫలవంతమైన ఇటువంటి సందర్భాలలో ఎంతో చెప్పాలనిపిస్తుంది. ... ఈ నాలుగు మాటలతో ఇక్కడికి ఆపుతూ, సదస్సు ద్విగ్విజయం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మా శాఖ తలపెట్టే భవిష్యత్ కార్యక్రమాలలోకూడా ఈ స్ఫూర్తిని, సహకారాన్ని కొనసాగించమని కోరుతున్నాను.

మీ,

(ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నరాణి)


**Prof. C. R. Rao Road, (po) Central University, Gachibowli, HYDERABAD – 500046., A. P.**
**Ph: +91-40-2313 3550, +91-40-2313 3558, www.uohyd.ac.in**

# సంపాదకీయం

మనమంతా ప్రస్తుతం శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారి 151 జయంతి వత్సరంలో ఉన్నాం. తెలుగు భాషాసాహిత్యాల అధ్యయన, అధ్యాపన రంగాలలో ఉన్నవారికి, భాషాభిమానులకు 'గిడుగు'ను ప్రత్యేకంగా పరిచయం చేయనక్కరలేదు. అదే వారి ప్రత్యేకత! – ఈ సందర్భంలో 'గిడుగు'పై ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించాలని మా శాఖ సంకల్పించింది. శాఖాధ్యక్షుల చొరవకు చిత్కళావాహిని సాహిత్య, సాంస్కృతిక సంస్థ సౌజన్యం తోడైంది. ఫలితంగా– నిర్వహణ బాధ్యతలు నాకూ, సహ అధ్యాపకుడు డాక్టర్ భుజంగరెడ్డిగారికీ అప్పగించారు. ఒకరోజు సదస్సును నిర్వహించడం ఎంత సులువో, అంత కష్టంకూడా! నిర్వహణకు ఉన్న స్వల్ప సమయంతోపాటు పరిగెడుతూ, కార్యక్రమాలకు రూపునివ్వవలసి వచ్చింది.

'గిడుగు' అనే 'పిడుగు'ను బహుకోణాలనుంచి పట్టి చూప ప్రయత్నించిన పత్రాలన్నీ ఈ సంకలనంలో ఉన్నాయి. ఈ సంపాదకీయం వాటిపై సమీక్షకాదు. పైగా, పత్ర సమర్పకులంతా విద్వత్సంపన్నులు, అధ్యయన, అధ్యాపనాలలో తలబంటి లోతున ఉన్నవారు. నిరంతరం పరిశోధన చేస్తున్నవారు, చేయిస్తున్నవారు. కాబట్టి, శ్రీ గిడుగు వేంకటరామమూర్తిగారి భాషా సాహిత్య వరివస్యను ఆ పత్రాలనుండే నేరుగా గ్రహించమని పాఠక మహాశయులను కోరుతున్నాను. సదస్సుకు ముందు, పత్రాలను సమర్పించడానికి కేవలం 24రోజుల సమయాన్ని మాత్రమే ఇవ్వగలిగాం. సదస్సులో చర్చించిన, చర్చకు వచ్చిన అంశాలను దృష్టిలో ఉంచుకొని, పత్రసమర్పకులు తమ తమ పత్రాలను పునస్సమీక్ష చేసుకొనేందుకు, సదస్సు ముగిసిన తర్వాత మరో మూడు వారాల సమయం తీసికొన్నారు. సదస్సులో వివిధ సందర్భాలలో మా శాఖాధ్యక్షులు 'గిడుగు'ను గూర్చి చేసిన సంక్షిప్త ప్రసంగాలను ఒక పత్రంగా కూర్చమని అడిగాం. చాలా తక్కువ వ్యవధిలో శాఖాధ్యక్షులు కూర్చి ఇచ్చిన ఆ పత్రాన్ని ఈ సంకలనంలో మొదటి పత్రంగా మీకు అందిస్తున్నాం.

పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం కులపతులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు, తెలుగు అకాడమి పూర్వ డైరెక్టరు ఆచార్య జె. ప్రతాపరెడ్డిగారు, ప్రస్తుత డైరెక్టరు ఆచార్య కె. యాదగిరిగారు... వంటి పండితులు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. వీరి ప్రసంగ పాఠాలతోపాటు, రెండు సమావేశాలకు అధ్యక్షత వహించిన ఆచార్యుల తొలిపలుకులనుకూడా ప్రసంగ పాఠాలుగా కూర్చి ఈ సంకలనంలో చేరుస్తున్నాం.

మౌఖిక వాగ్వ్యవహారంలో విషయప్లుతికి అవకాశం ఉంటుంది. ఉపన్యాసాలను రాతలోకి కుదించేటప్పుడు, ప్లుతి లేని అంశాలకు పరిమితం అయితే, పాఠకులకు ప్రధాన విషయం నేరుగా అందుతుంది. పై ప్రముఖుల ప్రసంగ పాఠాలను రాతలోకి 'కుదించడం'లో ఈ పద్ధతి పాటించాం. ప్రసంగ పాఠాలకు ఆద్యంతాలలో ఉంచిన ఒంటి ఉల్లేఖనాలను దృష్టిలో ఉంచుకొని, వీటినుంచి విషయాన్ని గ్రహించమని పాఠకులకులను కోరుతున్నాం. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య జె. ప్రతాపరెడ్డిగార్ల ప్రసంగపాఠాల ప్రాథమిక ప్రతులను తయారుచేసిన పరిశోధక విద్యార్థి మిత్రులు, శ్రీ ఎస్. చంద్రయ్య, శ్రీ. జె. చిరంజీవిలకు ఈ సందర్భంలో కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సదస్సులు, కార్యశాలలు, వాటిలోని చర్చలు, పరిశోధన ఫలితాలు... మొదలైనవన్నీ ఈ జాతి సంపద. ఆ ఫలాలను పొందడానికి కావల్సినవి ఆయా అంశాల పట్ల అభిరుచి, ఆసక్తి. అందువల్ల ఈ సంకలనాన్ని కేవలం ముద్రణరూపంలో మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషాభిమానులందరికీ అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. ముద్రణ కాపీలను పరిమిత సంఖ్యలో శాఖలో అందుబాటులో ఉంచాం. అభిరుచి కలవారు, విద్యార్థులు, పరిశోధక మిత్రులు అందరూ ఈ సంకలనాన్ని www.languageinindia.com అనే వెబ్‌చిరునామానుంచి పొందవచ్చు. హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ చరిత్రలో తొలిసారిగా చేస్తున్న ఈ ప్రయత్నం మీ అందరిలో ఆనందాన్ని కలిగిస్తుందన్న సంగతి మాకు తెలుసు!

అడిగినదే తడవుగా తమ సందేశాన్నిఇచ్చి ఆశీర్వదించిన మా విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య రామకృష్ణ రామస్వామిగారికి మా శాఖ పక్షాన, పత్ర సమర్పకుల పక్షాన, సంపాదక బృందం తరపున నిండు మనసుతో కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాం. సదస్సు నిర్వహణకు అనుమతిని ఇస్తూ ముందుకు నడిపించిన మానవీయ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య అమితాభ దాస్‌గుప్తాగారికి సాంజలిపూర్వక ప్రణామాలను తెలుపుతున్నాం. సదస్సు నిర్వహణభారాన్ని మాకిచ్చి, తక్కిన సంభార భారాన్ని మోసిన మా శాఖాధ్యక్షురాలు, ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణిగారికి గౌరవ పురస్సరంగా కృతజ్ఞతలు, నమస్సులు తెలియజేస్తున్నాం. సదస్సులో పత్రాలను సమర్పించిన సహవ్రతులకు, నిర్వహణలో పాలు పంచుకొన్న ఆచార్యులకూ వినమ్రపూర్వక నమస్సులు.

సదస్సు నిర్వహణలో తమసేవలనందిస్తూ, విజయవంతంకావడంలో కీలకభూమిక పోషించిన ఎం.ఏ. విద్యార్థులకు, ఎం.ఫిల్., పిహెచ్. డి. పరిశోధక మిత్రులకు ప్రియ శుభాకాంక్షలను తెలియజేస్తూ, వీరందరి పురోభివృద్ధిని కోరుకొంటున్నాం. ఈ సంకలనంలోని కొన్ని పత్రాలను సంగణీకరించడంలో సహకరించిన పరిశోధక విద్యార్థి చి. జె. చిరంజీవికి ప్రత్యేకంగా ఆశీఃపూర్వక కృతజ్ఞతలు.

సదస్సు నిర్వహణలో మాతోపాటు శ్రమిస్తూ, సహకరించిన తెలుగు శాఖ కార్యాలయ సిబ్బంది శ్రీ కె. భవానీ శంకర్‌గారికీ, శ్రీ రాంబాబుగారికీ, శ్రీ గణేశ్‌గారికీ, మానవీయ శాస్త్రాల విభాగం కార్యాలయ సిబ్బంది శ్రీ నాగరాజన్‌గారికీ, శ్రీ ఆనంద్‌గారికీ, శ్రీ వాసుగారికీ మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

28-10-2013

– డాక్టర్ పమ్మి పవన్‌కుమార్
ప్రధాన సంపాదకుడు

# తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం,
# చిత్కళ సాహితీ సాంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో
# శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారి 150వ జయంతి సదస్సు.
## 04 అక్టోబరు, 2013.

---

తేది: 10-09-2013

## పత్ర సమర్పణకు ఆహ్వానం

ఒక వ్యవస్థ చేయవలసిన పనులను, ఒక్కడై చేసి చూపిన తెలుగువారిలో ప్రముఖంగా పేర్కొనదగిన వ్యక్తి, శక్తి గిడుగు వేంకట రామమూర్తిగారు. వ్యవస్థలా పనిచేయడమేకాదు, అనేక వ్యవస్థలు కలిసి నిర్వహించగల పనులెన్నో ఆయన చేశారు. 'ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురజాడకు, గిడుగు బాల్యం నుండీ స్నేహితుడు కావడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించే అంశమైనా, 'పూని యేదైనా మేలును కూర్చి జనులకు చూపవోయ్'అన్న హితుడి మాటను సార్థకం చేసిన మహనీయుడు గిడుగు. తనకోసం కాదు, తానందరికోసం అని ప్రకటించినవాడూ, తర-తమ భేదాలను విడిచి నడిచినవాడూ, అప్పటి భాషావ్యవస్థనూ నడిపించినవాడూ గిడుగు వేంకట రామమూర్తి. వారి 150వ జయంతిని పురస్కరించుకొని, హైదరాబాదు విశ్వవిద్యాలయ తెలుగుశాఖ, చిత్కళ సాహితీ సాంస్కృతిక సంస్థలు 04 అక్టోబరు, 2013న ఒకరోజు సదస్సును నిర్వహించాలని తలపెట్టాయి. ఈ సదస్సుకు మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తూ, కింద సూచించిన ఏదైనా అంశంపై సదస్సులో పత్ర సమర్పణ చేయవలసిందిగా కోరుతున్నాం.

**పత్ర సమర్పణకు అంశాలు:**

1. తెలుగు భాషకు 'గిడుగు' చేసిన సేవ.
2. వాడుక భాషగా తెలుగు-'గిడుగు'-వ్యావహారిక భాషావాదం
3. తెలుగు- 'గిడుగు'కుముందూ, ఆ తరువాతా...
4. గ్రాంధిక, వ్యావహారిక భాషా వాదాలు: 'గిడుగు'
5. 'గిడుగు' వారి బాలకవి శరణ్యం
6. మాన్యువల్ ఆఫ్ సౌర లాంగ్వేజ్
7. 'గిడుగు'- నిఘంటు నిర్మాణం
8. 'గిడుగు'- చరిత్ర పరిశోధన
9. సవర జానపద కథల సేకరణ- 'గిడుగు'
10. 'గిడుగు' పై పాశ్చాత్యుల కృషి

ఈ అంశాలకు మాత్రమే పరిమితం కాకుండా, సదస్సు లక్ష్యాన్ని ఆవిష్కరించగలిగే అంశాలతో పత్రాలను సమర్పించవచ్చు.

**ముఖ్యమైన తేదీలు:**

1. సంక్షిప్తి (abstract) పంపడానికి చివరి తేది: 20-09-2013
2. పూర్తి పత్రం పంపడానికి చివరి తేది: 30-09-2013
3. సదస్సు తేదీ: 04 అక్టోబరు, 2013.

**సంక్షిప్తులు/పూర్తి పత్రాలు పంపడానికి సూచనలు, చిరునామా:**

1. పత్ర శీర్షిక కింద పత్ర సమర్పకుల పూర్తి చిరునామా, ఫోను, ఇ-మెయిల్ చిరునామాలను రాయాలి.
2. పత్రానికి మొదట "సంక్షిప్తి" చివర "సంప్రదించిన గ్రంథాల/ఆకరాల" వివరాలు చేర్చడం తప్పనిసరి.
3. పత్రం నిడివి- రేఖాచిత్రాలు, పట్టికలు. . . మొ. అన్నిటితో కలిపి ఆరు నుంచి ఎనిమిది A4 సైజు పుటలను మించరాదు.
4. సంక్షిప్తి, పత్రం . . . మొ. అన్నిటిని కంప్యూటరులో టైపుచేయించి సమర్పించాలి, ఫాంటు సైజు చదవడానికి అనుకూలంగా ఉండేట్లు జాగ్రత్త వహించండి.
5. సంక్షిప్తి, పత్రం . . మొ. అన్నిటిని PDF రూపంలో పంపించడానికి ఇ-మెయిల్‌చిరునామాలు: (1) pavankpammi@gmail.com, (2) bbreddy65@gmail.com

**ఇతర వివరాలకు సంప్రదించవలసిన చిరునామాలు:**


Dr. PAMMI PAVAN KUMAR,
Asst. Professor &
Seminar Coordinator,
M: 99493 58500

Dr. BANALA BHUJANGA REDDY
Asst. Professor &
Seminar Co-Coordinator,
M: 94939 76813

Prof. S. SARATJYOTHSNA RANI
Professor & Head,
M: 98665 92115

Department of Telugu, University of Hyderabad, HYDERABAD – 500 046. A.P. India.

Dr. I. VALLI SUBBALAKSHMI,
*Chitkala Sahiti Samskitika Samstha*, Hyderabad.

# Programme:

## Department of Telugu
## University of Hyderabad

In colloboration with

## Chitkalaa Vaahini Saahitya Saamskritika Samstha

**One-day National Seminar on**

## Sri Gidugu Venkata Ramamurti's Life and His Works

(On the occasion of Sri Gidugu Venkata Ramamurti's 150th Birth Anneversary)

## 04 October, 2013.

## Venue: Auditorium, School of Humanities
## University of Hyderabad
## Andhra Pradesh

# Inaugural Session
# 04 October, 2013
# 10:00am

---

**Chair:** **Prof. S. Saratjyotsna Rani,**
**Head, Department of Telugu,**
**Coordinator, Centre for Classical Telugu,**
**University of Hyderabad.**

**Chief Guest:** **Prof. Elluri Sivareddy,**
**Vice Chancellor, P.S. Telugu University.**

**Keynote Address:** **Prof. J. Pratapa Reddy,**
**Professor of Linguistics (Retd.)**
**Former Registrar, S. V. University.**

**Special Guest:** **Dr. I. Vallisubbalakshmi,**
**Sub-registrar,**
**Department of Stamps and Registration,**
**Government of Andhra Pradesh.**

**Theme of the-**
**Seminar:** **Dr. Pammi Pavan Kumar,**
**Asst. Professor, Dept. of Telugu,**
**Coordinator of the Seminar, Univ. of Hyd.**

**Vote of Thanks:** **Dr. Banala Bhujanga Reddy,**
**Asst. Professor, Dept. of Telugu,**
**Co-Coordinator of the Seminar,**
**Univ. of Hyd.**

**Tea Break – 11:30am. - 11:45am.**

# Session – 1
# 04 October, 2013
## 11:45am. - 01:00pm.

---

**Session Chair:** **Prof. Tummala Ramakrishna,**
**Professor of Telugu,**
**Dept. of Telugu, Univ. of Hyderabad.**

**Session Convener:** **Dr. Darla Venkateswara Rao,**
**Asst. Professor of Telugu,**
**Dept. of Telugu, Univ. of Hyderabad.**

**Paper Presenters:**

**1.** ***Vyaavahaarika Telugu praadhanyam gurtinchina laakshnikulu***
**- Prof. R. V. R. Krishna Sastry.**

**2.** ***Memorandum on Modern Telugu – Gidugu***
**- Dr. Pillalamarri Ramulu.**

**3.** ***Gidugu Ramamurti bhaasha, Saahityam, Saamaajika Drikpatham***
**- Dr. Darla Venkateswara Rao,**

**4.** ***Aadhunika bhaashagaa Telugu – Gidugu Aaloochanalu***
**- Dr. D. Vijayalakshmi**

**Lunch Break – 01:00pm. - 02:00pm.**

# Session – 2
# 04 October, 2013
## 02:00pm. - 04:30pm.

---

**Session Chair:** **Prof. R. V. R. Krishna Sastry,**
**Professor of Telugu,**
**Dept. of Telugu, Univ. of Hyderabad.**

**Session Convener:** **Dr. D. Vijayalakshmi,**
**Asst. Professor of Telugu,**
**Dept. of Telugu, Univ. of Hyderabad.**

**Paper Presenters:**

***5. Gidugu bhaasha drikpatham***
**- Dr. M. Sampatkumar**

***6. VaaDuka bhaasha: konni vivaadaalu***
**- Prof. B. R. Bapuji**

**7.** ***VaaDuka bhaashagaa Telugu: Gidugu Aloocanaa sarali.***
**- Prof. G. Umamaheswara Rao**

***8. Gidugu bhaashaa prasthaanam***
**- Dr. K. Krishnamurti**

***9. Bhaashaa saastraveettagaa Gidugu***
**- Dr. B. Bhujanga Reddy**

***10. Gidugu bhaashaa seeva: mana kartavyam***
**- Dr. Pammi Pavan Kumar**

**Tea Break – 04:30pm. - 04:45pm.**

# Valedictory Session
# 04 October, 2013
# 04:45pm. - 05:30pm.

---

| | |
|---|---|
| **Chair:** | **Prof. S. Saratjyotsna Rani,**<br>**Head, Department of Telugu,**<br>**Coordinator, Centre for Classical Telugu,**<br>**University of Hyderabad.** |
| **Chief Guest:** | **Prof. K. Yadagiri,**<br>**Director, Telugu Academy.** |
| **Report on the-**<br>**Seminar:** | **Dr. Pammi Pavan Kumar,**<br>**Asst. Professor, Dept. of Telugu,**<br>**Coordinator of the Seminar, Univ. of Hyd.** |
| **Vote of Thanks:** | **Dr. Banala Bhujanga Reddy,**<br>**Asst. Professor, Dept. of Telugu,**<br>**Co-Coordinator of the Seminar,**<br>**Univ. of Hyd.** |

RSVP:

| | | |
|---|---|---|
| Dr. PAMMI PAVAN KUMAR,<br>Asst. Professor &<br>Seminar Coordinator,<br>M: 99493 58500 | Dr. BANALA BHUJANGA REDDY<br>Asst. Professor &<br>Seminar Co-Coordinator,<br>M: 94939 76813 | Prof. S. SARATJYOTHSNA RANI<br>Professor & Head,<br>M:98665 92115 |

Department of Telugu, University of Hyderabad, HYDERABAD – 500 046. Andhra Pradesh, India.

Dr. I. VALLI SUBBALAKSHMI,
*Chitkala Vahini Sahitya Samskitika Samstha*, Hyderabad.

# ముఖ్యఅతిథి ప్రసంగపాఠం

(పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కులపతులు **ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు** సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వారి ప్రసంగ పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.)

'సభాధ్యక్షులు, తెలుగుశాఖ అధ్యక్షులు, కో–ఆర్డినేటర్ ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణిగారికీ, కీలకోపన్యాసం ఇవ్వడానికి విచ్చేసిన ఆత్మీయులు, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వరిజిస్ట్రార్ ఆచార్య ప్రతాపరెడ్డిగారికీ, తెలుగు శాఖకు సౌజన్యాన్ని అందిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సబ్‌రిజిస్ట్రార్ డాక్టర్ వల్లీసుబ్బలక్ష్మిగారికీ, ఈ సదస్సులో ప్రముఖ పాత్ర పోషిస్తున్న డాక్టర్ పమ్మి పవన్‌కుమార్‌గారికీ, డాక్టర్ బాణాల భుజంగ రెడ్డి గారికీ, సభలో ఉన్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికీ, ఆచార్య రామకృష్ణ గారికీ, సదస్సులో ఆసీనులైన వారందరికీ నమస్కారం.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి వస్తే, రాష్ట్ర ప్రభుత్వంనుండి కేంద్ర ప్రభుత్వానికి వచ్చినట్లు ఉంటుంది. మేమంతా శరత్ జ్యోత్స్నారాణిగారికి గురువులని అన్నారు. కాని, గురువులు రాష్ట్రంలో ఉంటే శిష్యులు కేంద్రంలో ఉన్నారు. కాబట్టి, ఎప్పటికైనా ఇలాంటి శిష్యులు పైకొస్తే నిజమైన గురువులు సంతోషిస్తారు. నాకు ఇప్పుడు అలాంటి ఆనందమే కలుగుతోంది. ...

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ పక్షాన సదస్సు జరుగుతుంటే పాల్గొనడం అనేది మా బాధ్యత. నాలుగు విషయాలు తెలుసుకోవచ్చు. ఎందుకంటే, ఒక పరిశోధకుడికి సాహిత్యంలోని అన్ని ప్రక్రియల మీద సంపూర్ణమైన అవగాహన ఉంటుందని చెప్పలేం. కాబట్టి, మనకు సంబంధించని విషయాన్ని ఇతరులు చెప్పినప్పుడు వినగలగడం అనేది ఒక అదృష్టం. ఈ రోజు, ఇంతమంది సదస్సులో పాల్గొంటున్నారు, మంచి పత్రాలు సమర్పిస్తున్నారు అంటే తెలుసుకోదగ్గ విషయాలు అనేకం ఉన్నాయని అర్థం. సాధారణంగా, నిండైన పరిశోధన పత్రాలు ఐదారు పేజీలకు మించవు. ఆ ఐదారు పేజీల పరిశోధన పత్రం తయారు చేయడానికి నాలుగు నెల్లో, సంవత్సరమో పని చేస్తాడు పరిశోధకుడు. కాబట్టి, ఒక శాస్త్రవేత్తైనా, ఒక సాహిత్య వేత్తయినా, ఒక భాషావేత్తయినా, ప్రతి ఆలోచనా కోణానికీ పని కల్పించాలి. అలాచేసి రాసిన వ్యాసాలే పరిశోధనా పత్రాలు. మా శరత్ జ్యోత్స్నారాణిగారి ఆధ్వర్యంలో నడుస్తున్న తెలుగుశాఖలో మంచి యువకులైన అధ్యాపకులు సముచితమైన సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందుకు వీరందరినీ అభినందిస్తున్నాను.

గిడుగు రామమూర్తి పంతులుగారికి 150వ జయంతి వత్సరం పూర్తయింది. 151లోకి అడుగు పెట్టాం. రామమూర్తిగారి గురించి చెప్పేముందు, విద్యార్థులకు నా సూచన ఏమిటంటే, ఎంతో ఎక్కువగా రాయాలనిగానీ, ఎన్నో గ్రంథాలు రాయాలనిగానీ మీలో ఒక విపరీతమైన వాంఛ ఉంటుంది. రచనకు ఉండాల్సిన మొదట లక్షణం ప్రామాణికత. అంతేకానీ, పరిమాణం కాదు. ఈ విషయాన్ని సదా గుర్తుంచుకోమని కోరుతున్నాను. ఒక ఉదాహరణ చెబుతాను. గిడుగు రామమూర్తి పంతులుగారున్నారు; ఎన్ని గ్రంథాలు రాసారు?, జీవితాంతం కష్టపడితే– చాలా తక్కువ! –మనకు నచ్చినా నచ్చకపోయినా– చిన్నయసూరి ఉన్నాడు, ఆయన ఎన్ని రాసాడు? రెండే రెండు! ఒకటి బాలవ్యాకరణం, మరొకటి నీతిచంద్రిక. ఏ భాషావేత్త అయినా, మౌలికంగా పరిశోధన చేసినవాడు ఎక్కువ రాయలేదు. కాని, ఆయన చేసిన పరిశోధన మాత్రం జాతికి ఒక దీపంలాగా, దీప స్థంబంలాగా నిలుస్తుంది. అలాంటి మహానీయుడు గిడుగు రామమూర్తి పంతులుగారు.

గిడుగు రామమూర్తి పంతులుగారంటే మనకు గుర్తొచ్చేది వ్యవహారిక భాషోద్యమం. వ్యవహారిక భాషోద్యమం అంటే గిడుగువారి పేరుతోపాటు గుర్తొచ్చే మరోపేరు గురజాడ. చిన్నయసూరి మద్రాసు యూనివర్సిటీలో ఒక ఆచార్యుడిగా ఉండి ఆయన సాంప్రదాయికమైన తీవ్రాభిలాషతో, పాణినీయ పద్ధతిలో బాలవ్యాకరణం రాశారు. ఆయనకు పదహారు సంవత్సరాల వరకు అక్షరాలు రావు. ఆయన జీవించిన కాలమే యాభైయారో, యాభైయేడో సంవత్సరాలు. దాంట్లో ఎంత నిష్ఠత్వం వహించాడంటే– ఈనాడు మనం చిన్నయసూరిగారిని మెచ్చుకోవల్సిన అవసరం లేకున్నా, ఆయన మార్గాన్ని అనుసరించవల్సిన అవసరం లేకున్నా– ఆయన పరిశోధనా దృష్టిని మాత్రం గుర్తుంచుకోవాలి. బహుశః, భవిష్యత్తులో కూడా తెలుగులో బాలవ్యాకరణంలాంటి గ్రంథం రాదు. చిన్నయసూరి వ్యాకరణం రాసింది కేవలం సంప్రదాయ కవిత్వాన్ని నిలబెట్టడానికో, పరిరక్షించడానికో తప్ప, ప్రజలకు పనికొచ్చే వ్యాకరణం కాదు అనేది తర్వాత గుర్తించిన పెద్దల్లో గిడుగు రామమూర్తి పంతులుగారు ఒకరు.

"ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం" లో మీరు తెలుసుకోవలసిన అంశాలు చాలా ఉన్నాయి. వ్యావహారిక భాషే సముచితమైందీ, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేదీ, పాఠ్యపుస్తకాలలో మనం వినియోగించదగిందీఅని దృఢమైన విశ్వాసంతో ఆ వాదాన్ని గట్టిగా వినిపించినవారు రామమూర్తి పంతులుగారు. దాన్ని వ్యతిరేకించినవారుకూడా చాలామంది ఉన్నారు. జయంతి రామయ్య పంతులుగారి వంటివారు చాలామందిఉన్నారు. కాని, చిన్నయసూరికూడా వ్యవహారిక భాషలోచేసిన కొన్ని రచనలున్నాయి. ఆయన భారత ఆదిపర్వాన్ని పరిష్కరించాడు– ఒక మిత్రుడితో కలిసి. పద్యానికి ఎడమ వైపు రాసిన వివరణను వ్యావహారిక భాషలో రాసాడు చిన్నయసూరి. కాని, కృత్రిమమైనటువంటి ఆ భాష తెలుగులో శాస్త్రాలు... మొదలైన రచనలు ప్రచారం చేయడానికి పనికిరాదు– అని విశ్వవిద్యాలయ బోర్డాఫ్ స్టడీస్‌లో ఈ నిర్ణయాలన్నింటినీ పునస్సమీక్షించిమరీ, వ్యవహారిక భాషను విశ్వవిద్యాలయంలో ప్రవేశ పెట్టాలనే వాదాన్ని బలంగా వినిపించినాయన రామమూర్తి పంతులుగారు. ఎవరెవరైతే గ్రాంథిక

భాషావాదులుగా, గ్రాంథిక భాషను గట్టిగా బలపరుస్తున్నారో వారి రచనలో ఉన్నటువంటి లోపాలన్నింటినీ సేకరించేవారు గిడుగువారు. ఎవరూ గ్రాంథికభాషను వారు చెబుతున్నట్టుగా, సమగ్రంగా రాయలేరు అని ఉదాహరణలను చూపేవారు. చిన్నయసూరి వాడిన పదాలనే చిన్నయసూరి చెప్పలేదు కొన్నిసార్లు. నావుడు, అనవుడు అన్నమాటలకు బాలవ్యాకరణంలో సమాధానం దొరకదు. అందుకే గిడుగువారు వ్యావహారిక భాషకు లక్ష్య నిర్దేశనం చేయడానికి ప్రయత్నం చేశారు. సవర భాషకు ఆయన చేసిన సేవ చాలాగొప్పది. సదస్సులో పత్రసమర్పణ చేస్తున్న తక్కిన పండితులు ఆ విషయాలు చెబుతారు. ...

వ్యావహారిక భాషకు లక్షణం చెప్పినవాడు గిడుగు రామమూర్తి పంతులుగారు. దానికి లక్ష్యాన్ని నిర్మించినవాడు గురజాడ వెంకట అప్పారావుగారు. కన్యాశుల్కం గాని, లేకుంటే గురజాడ రచనలను మొత్తంగా గమనించండి. రామమూర్తిగారు ఏ లక్షణాలైతే చెప్పాడో, ఆ లక్షణాలన్నీ పాటిస్తూ, వ్యావహారిక భాషలో జీవకళ ఉంటుందని నిరూపించాడు గురజాడ అప్పారావు. కాబట్టి, ఒకరు లక్షణం చెబితే, ఇంకొకరు లక్ష్యాన్ని సంతరించారు. అలాంటి వాళ్ళు మనకు పూర్వం ఉన్నారు కాబట్టి, మనది ఈరోజు ఒక ప్రామాణిక భాష అంటున్నాం. లేకపోతే, ఏమయ్యేదో తెలియదు.

ఇప్పుడు ఆంధ్రదేశం రెండుగా చీలిపోయింది. మనకేం అభ్యంతరం లేదు. కానీ భాషా విషయంలో, సాహిత్య విషయంలో మాత్రం ఈ భాష అనేది ఒక చెరుకుగడ. దాన్ని నిట్టనిలువునా చీల్చండి, అడ్డంగా చీల్చండి అది మధురంగానే ఉంటుంది. కాబట్టి సాహితీ వేత్తలమైన మనమేమీ బాధపడవల్సిన అవసరంలేదు. ఇది గిట్టని వాళ్ళకు– వాళ్ళిష్టం, వాళ్ళనెంతైనా బాధపడనివ్వండి, లేదా ఎంతైనా సంతోషించనివ్వండి.

ఈనాడు ఇంగ్లీషునే స్టాండర్డ్‌లాంగ్వేజ్ అంటున్నాం. నిజానికి, పర్‌ఫెక్ట్ స్టాండర్డ్ లాంగ్వేజ్ అన్నది లేదు. అంటే; నూటికి నూరు శాతం ప్రామాణికభాష అనిపించుకోదగిన భాష లేదు. నిన్న మొన్న గోపల్లె అనే నవల రాశాడు తమిళనాడులో ఉంటున్న రాజనారాయణ అనే ఒక తెలుగాయన. ఈయన ఆరేడు వందలసంవత్సరాల క్రితం దక్షిణాదికి వెళ్ళిన వాళ్ళద్వారా తమిళం నేర్చుకున్నాడు. తమిళంలో రచనలు చేశాడు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు కూడా పొందాడు. కాని ఆయన గోపల్లె నవలలో చిత్రించిన వాతావరణం అంతా తెలుగు వాతావరణమే. దాన్ని, జంధ్యాల నారాయణ రెడ్డి తెలుగులోకి అనువదించారు. అది ఎక్కడో రెండు మూడు చోట్ల ఆవిష్కరణ పొందింది. ఆ పుస్తకం చదివితే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఆరేడు వందలు అంటే, ఇంచుమించు బహుమనీ సుల్తానుల కాలానికి కొంచెం ముందుగా ఇక్కడి నుంచి వలసవెళ్ళిన వారు, తమిళదేశంలో ఉంటూ, ఇంచుమించుగా తమిళులై పోయిన తెలుగువారిగా ఉంటూనే, తమ మాండలిక పదాలను ఎలా పరిరక్షించుకున్నారనేది మనకు ఆ రచనలో తెలుస్తుంది. ...

ఈ రోజు ఒక ఉద్యమం మొదలైంది. మాండలికంలో రచనలు చేయాలి అని. – మాండలికంలో రచనలు చేయడం తప్పేమీ కాదు. ఉదాహరణికి, విశాఖపట్నంనుంచి ఒక వ్యక్తిని తీసుకొద్దాం. ఒక

మహబూబ్ నగర్ వాసిని తీసుకొద్దాం. ఇద్దరిని కూర్చోబెడదాం. వాళ్ళిద్దరిని మాట్లాడుకోమందాం. వాళ్ళిద్దరికి ఒకరి మాటలు మరొకరికి అర్థం కావు. అర్థమయ్యే పరిస్థితి ఉండదు. ఎందుకంటే కేవలం మాండలిక భేదంవల్ల. మాండలికాలు అనేవి సజీవమైనవి. దానిని ఎవరూ కాదనలేరు. కాని, కేవలం మాండాలికాల్నే నమ్ముకుంటే భాష విస్తృతి పొందదు. కాబట్టి, కథలు, నవలలు ఎవరైనా మాండలికంలో రాసినా, మనకేమీ అభ్యంతరం లేదు. అది వారి ఇష్టం. అలా రాయడానికి అవకాశం ఉంది. కాని, ఒక వ్యాసం గానీ, పరిశోధన గ్రంథంగానీ దేశమంతటా ఉన్నటువంటి తెలుగు సాహిత్య వేత్తలంతా, తెలుగు సాహిత్య అభిలాషులంతా అర్థం చేసుకోవాలంటే– ప్రామాణిక భాష కావాలి.

తెలుగులో ప్రామాణిక భాష గురించి చాలా మంచి వ్యాసాలు రాశారు, విషయాలు చెప్పారు. అయినా, ఈ మాండలిక భేదాలవల్ల తెలుగులో ప్రామాణిక భాషను నిర్మించడం అన్నది ఇంచుమించుగా అసాధ్యమైన పరిస్థితి. ఇప్పుడు మాత్రం మరీ కష్టం. ఎందుకంటే ఇప్పుడు రెండు భాగాలుగా చీలిపోయినం కాబట్టి. నేను తెలంగాణ వాణ్ణి కాబట్టి, 'వచ్చిందు' అంటాను. ఒక మిత్రుడున్నాడు 'వచ్చాడు' అంటాడు. ఏది ప్రామాణికం? అంటె– తెగదు. కాబట్టి, దాని జోలికే వెళ్ళకుండా ఉండడం మంచిది. ... గాయాలన్ని మాయమై, వీళ్ళ మీద వాళ్ళు, వాళ్ళ మీద వీళ్ళు సగౌరవంగాఉన్న రోజుల్లో మన తెలుగు భాషంతా ఒకటి, మన తెలుగు వాళ్ళంతా ఒకటి అని నమ్మకం కలిగిన రోజుల్లో మళ్ళీ ప్రామాణిక భాషకేమైనా అవకాశం ఉంటుందేమోకాని ఇప్పుడైతే ఆ అవకాశం లేదు.

ఈ సందర్భంగా గిడుగు రామమూర్తిపేరు మీదుగా స్మరించుకోదగింది ఏమిటంటే– వారి శాస్త్ర దృష్టి. సైన్సు చదువుకున్నవాళ్ళకి భాషమీద దృష్టివేరే ఉంటుంది. ఒక విషయాన్ని ఎనాలసిస్ చేసేటప్పుడు మాత్రం, ఎక్స్‌పరమెంట్, అబ్జర్వేషన్, ఇంప్రషన్స్– అనిరాస్తాం. అది ఏదన్నాసరే– ఆధారంలేంది సైన్స్ చదువుకున్నవాళ్ళు ఫలితాంశాలు చెప్పాలంటే కొంచెం జంకుతారు. తెలుగు చదువుకున్నా అదే పద్ధతిలో వెళ్ళాలని మనకు నేర్పినవారు గిడుగువారు.

పరిశోధన విషయంలో మనం కొందరు మహానుభావుల్ని స్మరించుకోవాలి. ఒక వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, ఒక గిడుగు రామమూర్తిగారు, ఒక గురజాడ అప్పారావుగారు, ఒక మల్లంపల్లి సోమరశేఖరశర్మగారు మొదలైనవారు అరకొర సౌకర్యాలతో, వనరులతో మనకు జ్ఞానభాండాగారాలను అందించారు. ఒక ఆయన అన్నాడు; వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు మద్రాసు రోడ్లమీద తిరుగుతుంటే, రోడ్లు అరిగాయి కాని, వారి కాళ్ళు అరగలేదు– అని. అంతగా శ్రమించేవారు నాటి పండితులు. కొమ్మరాజు లక్షణరావుగారున్నారు. ఎంత పట్టుదలండి ఆయనకు?! యజ్ఞం అన్న అంశం గురించి విజ్ఞాన సర్వస్వం కోసం ఒక వ్యాసం రాయడానికి ఆయన మూడేళ్ళు శ్రమించారు. అదీ పరిశోధన అంటే!. ...

ఈమధ్య వెలువడుతున్న ఎం.ఫిల్, పిహెచ్. డి. థీసెస్‌ల శీర్షికలుచూస్తే , నాకు బాధకలుగుతోంది. ... విద్యార్థులకు ఈరోజు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి, లైబ్రరీస్ ఉన్నాయి, ల్యాప్‌టాప్‌లున్నాయి,

కంప్యూటర్‌లున్నాయి. మీరు ఒకసారి 20వ శతాబ్దంలో కృషిచేసిన తొలితరం భాషావేత్తలను, సాహిత్యవేత్తలను చూడండి. ఎవరికైనా ఇన్ని సౌకర్యాలున్నాయా? లేవు. ఆ సౌకర్యాలు మనకు అందుబాటులో ఉన్నపుడు, మనం వినియోగించుకోవాలి. ఆ సౌకర్యాలని మనం ఎలా వినియోగించుకోవాలో అధ్యాపకులు మనకు నేర్పాలి. ఈ అధ్యాపకులను ఎలాతీర్చిదిద్దాలో ప్రభుత్వంవాళ్ళు గమనించాలి. తగిన సౌకర్యాలను సమకూర్చేది ప్రభుత్వం బాధ్యతైతే, విద్యార్థులను ప్రేరేపించి, వాళ్ళలో నూతనోత్తేజాలను కల్పించి స్ఫూర్తిదాయకమైన పరిశోధన చేయించడం అధ్యాపకుల బాధ్యత. మీఅదృష్టంవల్ల, మీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అలాంటి మంచి పరిశోధక అధ్యాపక మిత్రులున్నారు. చాలా సంతోషం. ...

పరిశోధనలకోసం వస్తున్న ఈ తరం విద్యార్థులు ప్రాచీన సాహిత్యం వైపు వెళ్ళడం లేదు. ప్రాచీన సాహిత్యం వైపు వెళితే, ఆధునిక సాహిత్యానికి వెలి అవుతామని ఎవరూ అనుకోనవసరంలేదు. ఒక ఆచార్యుడు, భాషాశాస్త్రవేత్త ఒకసారి ఒక సమావేశంలో నాతో – "ప్రాచీన సాహిత్యం మీద అభిమానమున్న వారికి ఆధునిక సాహిత్యం గురించి ఏం తెలుస్తుంది అని!". "అసలు ఆధునిక సాహిత్యం మీద అభిమానంఉంటే ప్రాచీన సాహిత్యం ఏం తెలుస్తుంది"?– అని ఇంకొక డెవడన్న ప్రశ్నిస్తే? కాబట్టి; మీకున్న అవకాశాల్లో ప్రాచీనంలేదు, ఆధునికంలేదు, అంతా ఒకటే!. రెంటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాల్సిందే! కాని, ఆధునిక సాహిత్యం గురించి పరిశోధన చేయాలంటేమాత్రం సంప్రదాయ సాహిత్య పరిజ్ఞానం చాలా అవసరం.

నారాయణరెడ్డిగారు ఒకసారి చెప్పగా విన్నాను– "నేను ప్రబంధాలను విశ్వవిద్యాలయాల్లో పాఠం చెప్పకుండా ఉంటే సినిమా గీతాల్లో ఇంత మంచి భాష వాడేవాణ్ణి కాదు."అని. కాబట్టి, ఆధునిక సాహిత్యాన్ని మనం కోరుకుందాం, ఆ అత్యాధునిక విధానాల్నే పాటిద్దాం, కాని, సంప్రదాయాన్ని గౌరవిద్దాం. సంప్రదాయం తల్లి లాంటిది. ఆధునిక సాహిత్యం భార్య లాంటిది. భార్యతో కాపురం చేస్తున్నాంకదాని, తల్లిని వృద్ధాశ్రమంలో చేర్పిస్తామా? అవసరంలేదు. తల్లిని గౌరవిస్తూ భార్యతో హాయిగా కాపురం చెయ్యవచ్చు. కాబట్టి, విద్యార్థి మిత్రులారా! ఆధునిక జీవితం తెలియాలంటే, అర్థంకావాలంటే, ఆధునిక సాహిత్యం చదవాలి. ఆధునిక జీవితాన్ని జీవిస్తేనే, ఆధునిక సాహిత్యాన్ని కూడా బాగా అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. కాని, సంప్రదాయాన్ని పదిసార్లు గౌరవించండి. నేను ఇంటర్వ్యూలు చేయడానికి వెళ్ళినప్పుడల్లా, ఒక పద్యం చెప్పమని అడిగేవాణ్ణి. కొందరు బాగా చెప్పేవారు. వేమనపద్యంలో మూడవపాదం మర్చిపోయిన వాళ్ళున్నారు. –నాల్గవపాదం మర్చిపోలేరులెండి–. ఎందుకంటే అది అందరికి తెలుసు కాబట్టి. ... బాధాకరమైనా, ఇటువంటి విషయాలను మళ్ళీ మళ్ళీ చెబుతాం– ఎందుకంటే, అధ్యాపకులుగా మేం మీ హితాన్ని కోరుతాం, మీశ్రేయస్సును కోరుతాం– కాబట్టి, ఆ బాధ ఉంటుంది.

గిడుగు రామమూర్తి పంతులుగారిని గురించిన వివరాలు, విశేషాలు అనేకం మీరు ఈ సదస్సులో తెలుసుకోబోతున్నారు. శ్రద్ధగా గ్రహించి, వాటిని అస్తిగతం చేసుకోమని కోరుతున్నాను. గిడుగువారి ఆశయాలను అస్తిగతం చేసుకుంటే బహుశః, మీలోనుంచే పది, ఇరవైమంది ప్రామాణిక పరిశోధకులు, – రామ్మూర్తి పంతులుగారిని మించినవాళ్ళు తయారవుతారని ఆశిస్తున్నాను. ... నాకు ఈ అవకాశమిచ్చిన మీ అందరికి మరోసారి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. –సెలవు'.

≻≻≻≺≺≺

# కీలకోపన్యాసపాఠం

(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వాచార్యులు, రిజిష్ట్రార్, తెలుగు అకాడమి పూర్వ డైరెక్టర్ **ఆచార్య జె. ప్రతాపరెడ్డి** సదస్సు ప్రారంభసమావేశానికి విచ్చేసి కీలకోపన్యాసం ఇచ్చారు. ఆ ఉపన్యాస పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.)

'తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, చిత్కళావాహిని సాహిత్య సాంస్కృతిక సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిడుగు వేంకటరామమూర్తిగారి 150వ జయంతి సదస్సుకు నన్ను ఆహ్వానించిన సోదరి, సభాధ్యక్షులు ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణిగారికి, చిరకాల మిత్రులు, సోదర సమానులు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి, ఈ సదస్సు నిర్వహణకు ఆర్థికంగా సహాయాన్నందిస్తున్న డాక్టర్ వల్లీసుబ్బలక్ష్మిగారికీ, చిరంజీవులు డాక్టర్ పవన్‌కుమార్‌కు, డాక్టర్ బాణాల భుజంగరెడ్డిగారికీ, నా మొదటితరం శిష్యుడు ఆచార్య రామకృష్ణగారికి, తెలుగు అధ్యయన శాఖలోఉన్న ఇతర అధ్యాపకులకు, విద్యార్థినీ విద్యార్థులకు అందరికీ నా నమస్కారాలు.

...

గిడుగు-గురజాడల ప్రస్తావన లేకుండా, ఆధునిక తెలుగు భాష, సాహిత్యాలను గురించి మనం మాట్లాడుకోలేం! భాషలో మార్పు వచ్చినప్పుడల్లా గురజాడ దానికి అనుగుణంగా ఆ భాషలో కావ్యాలను, గేయాలను, నాటకాలను రాయటానికి ప్రయత్నం చేసాడు. ఆయన మహానుభావు డెందుకు అయ్యాడంటే, మనకు భాష వాడకంలో ఒక దారిని చూపించాడు. ఆనాడు అనేక మంది వాడుక భాషకు వ్యతిరేకంగా పనిచేసినవారు ఉన్నారు కనుక, గురజాడకు అంతగా గుర్తింపు రాలేదు. వ్యావహారిక భాషను స్కూల్లో ప్రవేశపెట్టాలని గిడుగు, గురజాడవంటివారు అప్పటి ప్రభుత్వాన్ని వేడుకుంటే జయంతి రామయ్య పంతులు లాంటివారు వ్యతిరేకించారు. కావ్య భాష తప్ప వాడుక భాష వాడటానికి వీల్లేదు అన్నంత స్థాయిలో ఉద్రిక్తత వాతావరణాన్ని కల్పించారు. ఈ వాతావరణానికి ఎదురు నిలిచి గిడుగు, గురజాడలు వాడుక భాషోద్యమాన్ని నడిపారు. అందుకు వీరిరువురిని నరనారాయణుల్లాగానూ, నన్నయభట్టు-నారాయణ భట్టుల్లాగానూ పోల్చినవారు ఆ రోజుల్లో చాలా మంది ఉన్నారు.

వాడుక భాష అంటే ఏమిటి? దాని భిత్తిక ఏమిటి? తెలుగు భాషను మాట్లాడే సమాజాన్ని తెలుగు భాషా సమాజం అనీ, ఆ వ్యవహర్తలను తెలుగు ప్రజలని మనమంటుంటాం. 2000 సంవత్సరాల క్రితం తెలుగు భాష ద్రవస్థితిలో ఉందని చెబుతుంటారు మన భాషా శాస్త్రవేత్తలు. సాహిత్యమని ఒకదాన్నీ, భాషాశాస్త్రమని ఒకదాన్ని పిలిచారు. అసలు శాస్త్రం అంటే ఏమిటి? ఉన్న విషయాలను గమనించి, వాటినన్నింటిని నిరూపణ యోగ్యమైన అంశాలుగా తరచగా వచ్చిన ఫలితాంశాలను సిద్ధాంతంగా ప్రతిపాదించటాన్ని శాస్త్రం అంటారు. శాస్త్రం కేవలం రుజువులు ఉన్న విషయాలను మాత్రమే

అంగీకరిస్తుంది. గిడుగు ఇటువంటి పరిశోధన చేశారు. అది మొత్తం తెలుగు భాషాశాస్త్రానికి సంబంధించినది. ఇప్పుడు మనం Discriptive Grammer అని మాట్లాడుతున్నాం గానీ, ఆ రోజుల్లోనే ఆయన సవర భాషకు Discriptive Grammerరాసాడు. నేను కూడా రాయలసీమ ప్రాంతంలో ఉన్న ఆరెమరాఠి భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాసాను. రాయలసీమ మరాఠి భాషకు, సాధారణ మరాఠి భాషకు మధ్య ఉన్న మార్పుల్ని గుర్తించాను. గ్రియర్‌సన్- Linguistic Survey of India కూర్పు పనినికూడా స్వీకరించి సవర భాషకు వ్యాకరణాన్ని రాసాడు. ఇది శాస్త్రీయంగా ఉందని విదేశీ పండితులుకూడా మెచ్చుకొన్నారు.

2000 సంవత్సరాలనాటి తెలుగు భాష ద్రవస్థితిలో ఉండటానికి గల కారణాలేవి? ఆనాడు వాడుక భాష లేదా అనే ప్రశ్నల్ని మనం వేసుకుంటే, – విష్ణుకుండినులు, శాలంకాయనులు మొదలైన వారు సంస్కృతాన్ని పోషించారు. కనుక పాలకులచేత పోషింపబడుతున్న భాషకే మన్నన ఉంటుంది. మొదట కలమళ్ళ శాసనం ద్వారానే మనకు తెలుగు కనిపించింది. ఈ మధ్యలో లిఖితమైన ఆధారాలు లేకపోవడం వల్ల కావ్యాలు ఉన్నాయో లేవో? స్పష్టంగా చెప్పలేం. ఆ శాసనాల్లోని భాషను కొద్దిగా మార్పులు చేస్తే ఈనాటి తెలుగుకు దగ్గరగా కనిపిస్తుంది. ఆ తరువాతి కాలంలోని భూస్వామ్య వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని వారికి అనుకూలమైన అభిరుచుల్ని, ఆలోచనల్ని, వర్ణ వ్యవస్థను తమ తమ కావ్యాలలో పొందుపరిచారు కవులు. అంతే కాకుండా, ఆ కాలంనాటి బౌద్ధ, జైన మతాలు ప్రజల్ని ప్రభావితం చేస్తూ చాలా ఉన్నత స్థానంలో ఉన్నాయి.

మనకు పక్కన కన్నడ దేశంలో కూడా నాడు జైనం విపరీతంగా వ్యాప్తిలో ఉంది. కనుక వైదిక మతాన్ని పునరుద్ధరించటానికి నన్నయ తెలుగులో మహాకావ్యం రాసాడు. అప్పటి వరకు ఉన్న సంస్కృత ప్రభావాన్ని కొంత తగ్గించాడు. ప్రజలకుఅందుబాటులో లేని విషయం గుర్తింపు పొందదు కనుక తెలుగులో రాసాడు. మరి తెలుగులో రాసాడు కదా సమస్యేమిటి? నన్నయ ఆకావ్యంలో ఉన్నత వర్గాలకు సంబంధించిన సంస్కృత సాహిత్యం నుంచి కొంచెం మలుపు తీసుకొచ్చాడు. కొత్త రూపు రేఖలను తీసుకొచ్చాడు.

తెలుగును వాడుక భాషగా కావ్యాల్లోకి ఎవరెవరు తీసుకొచ్చారని చారిత్రకంగా ఒకసారి చూస్తే, శైవకవులు కనిపిస్తారు. శైవ మత ప్రభావం వల్ల, సామాన్య ప్రజానికానికి దగ్గరగా వెళ్ళాలి కాబట్టి పాల్కురికిలాంటి వారు ద్విపదల్లో ఆ కాలం నాటి వాడుక భాషను రాసారు. ఈనాడు మనకు అది కావ్య భాషలా కనిపించవచ్చు గానీ, ఆ కాలం నాటికి అది వాడుక భాషే! అదే విధంగా శైవకవుల తర్వాత తిక్కన తన నుడికారంతో మాండలిక వాక్య స్వభావాన్ని తన రచనల్లోకి తీసుకొచ్చాడు. తిక్కన మీద అపారమైన కృషి చేసిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు ఇక్కడ ఉండగా నేను తిక్కన గురించి మాట్లాడమంటే

హనుమంతుని ముందు కుప్పిగంతులు వేసినట్టుగుంటుంది. తిక్కన ఆనాటి నెల్లూరి మాండలికాన్ని తన కావ్యంలో గ్రహించాడు కాని, ఆ తరువాతి కవులకది అనుసరణీయం కాలేదు. కర్ణ పర్వంలో దుశ్శాసనుడికి, భీమునికి యుద్ధం జరిగినపుడు 'పసరమా' అనే మాటను ప్రయోగించాడు తిక్కన. దుశ్శాసనుణ్ణి చంపినా తరువాత భీమసేనుడు "ప్రైవడి పోయెగాన్ దృతరాష్ట్రుడు ......." అనే పద్యంలో 'ప్రైవడి' అనే మాటను ప్రయోగించాడు. ఇది నేటికి నెల్లూరు మాండలికంలో వాడుకలో ఉంది. కనుక ఏ కాలంనాటి కవి అయినా తన సమకాలీన సమాజపు వాడుక భాష నుండి తప్పించుకోలేడు.

శ్రీనాథుడు "రసికుడు పోవడు పల్నాడు... ఎసంగగా రంభయైన నూలే వడుకున్" అన్నాడు. అదేవిధంగా "ఓయమ్మా నీ కుమారుడు మా యిండ్లను ... పోయెద మెచ్చటి కైనను" – అంటూ చిన్న చిన్న మాటల్ని పోతన వాడాడు. అలాగే అన్నమయ్య "చక్కని తల్లికి చాంగు భళా! నీ చక్కని మోముకు చాంగు భళా!" అంటూ కీర్తనాలపించాడు. 'చాంగుభళా' మనకు మహారాష్ట్ర నుంచి వచ్చిన పదం. ఇటువంటి సమకాలీన వాడుక భాషనే తన 32,000 సంకీర్తనల్లో ప్రయోగించాడు కనుకనే, ఆనాడు అన్నమయ్యకు సరైన గుర్తింపు రాలేదు. పరిశోధ్న పేరుతో మద్రాసులో కాళ్ళరిగేట్టు తిరిగిన వేటూరి ప్రభాకర శాస్త్రి వెలుగులోకి తెచ్చేంత వరకు, మన కర్మ! అన్నమయ్య బయటకు రాలేదు. "చందమామ రావె! జాబిల్లి రావె! " అంటూ మననోళ్ళలో నానుతున్నా, మనకు ఆ గేయాన్ని అన్నమయ్యే రాసాడన్న విషయం తెలియదు. అన్నమయ్య సాహిత్య సృజనంతా మాండలికంలోనే సాగిందని సభాముఖంగా మీకు తెలియజేస్తున్నాను. వేమన గురించి ప్రత్యక్షంగా నేను చెప్పాల్సిన పనిలేదు. మీరందరూ ఆయననూ చదువుకున్నారు. ఆయన అచ్చమైన తెలుగు కవే గానీ, అచ్చ తెలుగు కవి కాదు. సంస్కృత పదాలకు తెలుగులో సమానార్థకాలు లేకపోయినా, వాటికి కచ్చితంగా తెలుగు పదాలను సృష్టించాలనే ఉద్దేశ్యంలో తెలుగును కొత్తగా పుట్టించిన వాడు కాదు వేమన. నాటి ప్రజల వాడుకలో ఉన్న పదాలను గ్రహించాడు. పద్యలల్లతూ పోయాడు.

ఒక పదానికి సంబంధించిన అర్థం విషయంలో, ఎక్కడైతే, ఒక ప్రాంతంవారికి, ఇంకో ప్రాంతంవారికి Mutual Intelligibility ఉండదో, దాన్ని మాండలికం అంటాం. ఇది మీ అందరికి తెలుసు. వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు లేకపోవడం వల్ల, ఒక ప్రాంతం భాషలో మార్పులు ఇంకో ప్రాంతానికి అర్థం కాకపోయేది. తెలంగాణ ప్రాంతం ముస్లిం పాలనలో ఉండటం, రాయలసీమ పాలెగాళ్ళ పాలనలో ఉండటం భాషలో వచ్చే మార్పులు పరస్పరం ఇరువురికి తెలిసే అవకాశం లేదు.

నేను 20 సంవత్సరాల క్రితంహైదరాబాదుకు వచ్చినపుడు అడ్రస్ తెలియక ఒకరిని అడిగాను ఆయన షీడీల మీద పో అన్నాడు. ఆ పదం నాకు అర్థం కాలేదు మరొక వ్యక్తిని 'షీడీలు' అంటే ఏమిటని అడిగాను. పక్కన మెట్లను చూపిస్తూ, పక్కనే 'షీడీలు' ఉన్నాయన్నాడు. అంతమాత్రాన అవగాహన

క్షమత్వం పోయినట్టుకాదు. శ్రీకృష్ణదేవరాయలకాలంలో తంజావూర్‌వెళ్లి స్థిరపడిన తెలుగువారి భాషను పరిశోధించాలని, నేను Linguistic Minorities in Other States అనే ప్రాజెక్టును తెలుగు అకాడమీలో ఉండగా చేసే ప్రయత్నం చేసాను. సేలం, మదురై ప్రాంతాల్లోని తెలుగు భాషలోని ప్రత్యేకతల్ని, వాడుకలో నేటికీ నిలిచిఉన్న ప్రాచీన తెలుగు రూపాలను వెలికి తీయాలనుకున్నాను. నేను ఒక విషయం చెప్పటానికి బాధపడుతున్నాను. నేటి యువకుల్లో నిబద్ధత పోయింది. మొక్కుబడిగా ఫీల్డువర్కుకోసం వెళ్ళి తెచ్చే సమాచారంతో ఏం విలవలను "రికార్డు" చేయగలం? నేను ప్రాజెక్టు ప్రారంభించి 5 సంవత్సరాలు ఐంది. ఇప్పటికి మూడులక్షల రూపాయాలు ఖర్చయ్యాయి. పని ఏ మాత్రమూ జరగలేదు. తంజావూరు తెలుగువారు మనతో మాట్లాడాలంటే, చాలా న్యూనతగా భావిస్తారు. ఎందుకంటే, వారికీ మనకూ 10% కూడా Mutual Intelligibility లేదు. నా ఫ్రెండ్‌ను 'ఏమయ్యా కాఫీ కొస్తావా?' అని అడిగితే 'సేపు లేదు' అని అన్నాడు. 'సేపు' అనే మాట నాకు అర్థం కాలేదు. చివరకు అర్థమైనదేంటంటే 'సేపు' అనే మాటకు మన దగ్గర వ్యస్త ప్రయోగం లేదు. సమస్త ప్రయోగంగానే అంటే 'చాలా సేపు, కొంచెం సేపు' అనే వాడతాం. అంటే ఒక ప్రాచీన రూపం మధురై దగ్గరలోని రాచ(జ)పాలెంలో ప్రయోగంలో ఉంది. అందుకనే మాతృభాషను మరువలేం. మాట్లాడే భాష ఒకటి, నేర్చుకునే, చదువుకునే భాష ఇంకొకటి ఉండటాన్ని 'Linguistics'లో Diaglossia అంటారు. ఈ నాలుగు ప్రాంతాల్లో రాకపోకలు పెరిగిపోయిన తర్వాత విద్య అందరికి అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒక రకమైన ప్రామాణిక భాష ప్రజల అందరికి వచ్చేస్తుంది. నేడు అందరూ ప్రామాణిక భాషలోనే మాట్లాడటానికి ప్రయత్నం చేస్తారు. ఎవరూ బయట స్టేజి మీద 'వచ్చింద్రు, పోయింద్రు, వచ్చినాడు, పోయినాడు' అని అనరు.

వాడుకభాషను గురించి మాట్లాడేటప్పుడు గానీ, ఆలోచన చేసేటప్పుడు గానీ ఇంగ్లీష్‌లో గానీ, గ్రాంథికంలో గానీ ఆలోచించరు. కేవలం వాడుక భాషలోనే ఆలోచిస్తారు. ఇటువంటి దార్శనికుడు కనుకనే గిడుగువారు ఆరోజుల్లోనే వాడుకభాషకోసం పోరాడారు. 1913లో 'A Memorandum on Modern Telugu'ను గిడుగు, 'The Minite of Descent' ను గురజాడ వారు ప్రభుత్వానికి సమర్పించారు. ఏ భాషలో మాట్లాడుతున్నామో అదే భాష విద్యా బోధనలో ఉండాలి. ప్రభుత్వం కానీ, ఉత్తర ప్రత్యుత్తరాలు కానీ, గెజిట్‌ని కానీ, విద్య, ఆరోగ్యం... తదితర విషయాలకు సంబంధించినవి కూడా వాడుక భాషలోనే ఉండాలనేది ఆ రెండు రచనల సారాంశం.

మనం ఇన్ని సంవత్సరాల తరువాత ఏర్పాటు చేసుకున్న 'అధికార భాషా సంఘం' ఏయే పనులు చేయాలో ఆనాడే చెప్పినవాడు గిడుగు. భాషాసంఘం స్థాపన ఉద్దేశంమీద నిరంతరం సమీక్ష జరగాలి. ఈ రోజుకు ఉన్న దౌర్భాగ్య మేమిటంటే కోర్టులో పిటిషన్ వేయాలంటే తప్పనిసరిగా ఇంగ్లీషులో రాయాల్సిందే. విద్యార్థులకు నిర్ణయించే పాఠ్య పుస్తకాలు సులువుగా అర్థమయ్యే భాషలో రావాలే తప్ప

పరిచయం లేని కావ్య భాషలో కాదు అని గిడుగు వారు స్పష్టంగా చెప్పారు. ఈ మాటల్ని స్ఫూర్తిగా తీసుకొని తెలుగు అకాడమి నేడు పని చేస్తోంది.

గిడుగువారు వాడుక భాషోద్యమం చేపట్టినపుడు, కొంతమంది వ్యతిరేకంగా గ్రాంథిక ఉద్యమాన్ని నడిపారు. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి లాగానే, గిడుగువారు కూడా పర్లాకిమిడిలో ఉద్యోగం చేస్తూ, ఒంటిమీద శాలువ కప్పుకొని మద్రాసు, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం మొదలైన ఊర్లు తిరుగుతూ, ఆయా ఊళ్లలో ఉన్న మేధావులందరి దగ్గరికెళ్ళి, వాడుక భాషపై చర్చలు జరిపి, వారిని ఒప్పించే ప్రయత్నం చేసారు. ఈ పని వల్ల తనకు రూపాయికూడా లాభం లేకపోయినా, భావితరాలను దృష్టిలో ఉంచుకొని వాడుక భాషను ఒక ఉద్యమంగా నడిపాడు. శ్రీశ్రీ లాంటివాడు 4000 పద్యాలు రాసిన తర్వాత గురజాడ ప్రభావంతో వాడుక భాషలో, దానికి తగిన ఛందంలో రాసాడు. విరసం.లో చేరిన తర్వాత రాసిన జట్కావాలాలో కూడా అనేక సంస్కృత పదాలున్నాయి. తదనంతర కాలంలో మాత్రం ప్రజలు ఏంమాట్లాడతారో అదే భాషలో రాయాలనే నిర్ణయించుకొన్నారు శ్రీ శ్రీ. ...

ఈ రకంగా వాడుక భాషోద్యమానికి విశేష కృషి చేసినవాడు గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆయన చేసిన పరిశోధనలు, ముఖ్యంగా సవర భాషా పరిశోధన, ఆయన పడ్డ తాపత్రయం, ఆయన చేసిన ఉద్యమాలు వీటన్నింటిమీద ఇంత చక్కటి సెమినార్‌ను నిర్వహిస్తూ, అందరి పత్రాల్నీ సమర్పించటానికి అవకాశం కల్పించిన తెలుగు శాఖకు కృతజ్ఞతలు'.

# విశిష్ట అతిథి ప్రసంగపాఠం

(హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ విద్యార్థి, పరిశోధకురాలు, ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో సబ్‌రిజిష్ట్రార్‌గా పనిచేస్తున్న **డాక్టర్ ఐ. వల్లీ సుబ్బలక్ష్మిగారు** సదస్సు ప్రారంభ సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆమె ప్రసంగ పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.)

'సభలో ఉన్న పెద్దలందరికీ నా వందనాలు. మిత్రులకు అభినందనలు.

ఈ రోజు సభలో ఎక్కువగా మాట్లాడడానికి రాలేదు. మాట్లాడే పెద్దలందరి వేదిక పునాదులు ఎప్పటికీ గట్టిగా ఉంచాలనే సత్సంకల్పంతో ఇక్కడికి వచ్చాను. ఎందుకంటే, సాహిత్య విలువలు అంతరించిపోతున్న ఈ రోజుల్లో, ఇటువంటి సెమినార్స్ చాలా కీలకమైనపాత్ర పోషిస్తాయని నా అభిప్రాయం. వీటికి ప్రోత్సాహం లేకపోతే, రాబోయే తరాలకు చాలా సమాచారం అందకుండాపోతుంది.

అమ్మకు జేజే, నాన్నకు జేజే, చదువులు నేర్పే గురువుకు జేజే – ఇవే నా జీవితాన్ని నడిపిస్తున్న, నడిపించబోతున్న మాటలు. ...

ఇప్పటి క్షణాలు నాకు అతి అపురూపమైన, అమూల్యమైన క్షణాలు. ఎందుకంటే, మా టీచర్ల ఎదురుగా నిలబడాలంటే భయపడే విద్యార్థినిగాఉండే నేను, ఈరోజు వారి పక్క కూర్చోగలుగు–తున్నానంటే, అది నాకు లభించిన అదృష్టంగా భావిస్తున్నాను. విద్యార్థులను ఎంతగా అక్కున చేర్చుకోవచ్చో, అంతా నాకు అనుభవంలోకి తెచ్చిన గురువు మా శరత్‌జ్యోత్స్నారాణిగారు. అలాంటి గురువు, గుగ్గురువులముందు మాట్లాడడం అదృష్టంగా భావిస్తున్నాను.

చిత్కళావాహిని సంస్థ అన్నది నా మానస పుత్రిక. Pure consciousness అన్న అర్థంలో నేను దాన్ని సంభావిస్తుంటాను. వాహినిలా, ఎప్పుడూ ప్రవహిస్తూ, ప్రవర్ధమానమౌతూ, ఎప్పటికీ తరిగిపోని, చెదిరిపోని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలని కోరిక. ...

నా కళ్ళారా చూసిన సంఘటన ఒకటి –వికారాబాద్‌లో జరిగింది– మీతో పంచుకొంటాను. అంబులెన్స్ సౌకర్యంలేక, ఉన్న అంబులెన్స్ లో ఆక్సిజన్ వంటి కనీస సౌకర్యాలు లేక, ఒక చిన్న పాప నా

కళ్ళముందే చనిపోయింది. అప్పటికి నాకు ఉద్యోగం లేదు. విద్యార్థినిగా ఉన్నాను. ఆ సంఘటన నా మనసులో నాటుకుపోయింది. బాగా బాధించింది. ఇదే విషయాన్ని స్నేహితులతో చర్చించాను. మేం అందరం కలిసి ఒక సేవా సంస్థను స్థాపించాం. అదే చిత్కళావాహిని. దానిద్వారా కొన్ని సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను చేయగలుగుతున్నాం.

సాహిత్యంకూడా సమాజంకోసమే కాబట్టి, సాహిత్య-సమాజాల అవినాభావ సంబంధాన్ని విడిగా చూడలేం కాబట్టి, అటు, సాహిత్య కార్యక్రమాలను, ఇటు, సామాజిక సేవా కార్యక్రమాలను మా సంస్థద్వారా చేస్తున్నాం. అటువంటి భావాలను నాలో పాదుకొల్పింది ఈ విశ్వవిద్యాలయం. ఆ భావాల మూలాలన్నీ ఈ మట్టిలో ఉన్నాయి. ఈ గాలిలో ఉన్నాయి. ...

మా సంస్థ నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలను రెండు పుస్తకాలుగా తీసుకొచ్చాం. కొన్ని సి.డి.ల రూపంలోకి తీసుకొచ్చాం. ఇటువంటివంటి వాటిద్వారా వచ్చే ఆదాయం అంతా- ప్రతిపైసా- మా సంస్థ తలపెట్టే కార్యక్రమాలకే వినియోగిస్తున్నాం. ఇలా చాలాకాలం చేయాలని ఉంది. కొనసాగించగలననే నమ్మకం ఉంది. ...

నాకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలందరికీ నమస్కారాలు'.

>>>><<<<

# మొదటిసమావేశ అధ్యక్షుల తొలిపలుకులు

(మొదటి సమావేశానికి, హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా ఉన్న తుమ్మల రామకృష్ణగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఇదే శాఖలోని సహవ్రతులు డాక్టర్ దార్ల వేంకటేశ్వరరావు సమావేశకర్తగా వ్యవహరించారు. మొదటిసమావేశంలో అధ్యక్షులు తొలిపలుకుల రూపంలో చేసిన ప్రసంగపాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.)

'గిడుగు వేంకటరామమూర్తిగారి జీవితం, రచనలపై మన తెలుగుశాఖ, మరోసంస్థతో కలిసి నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు విచ్చేసిన మీ అందరికీ నమస్కారాలు.

తెలుగు వారందరూ గుర్తుంచుకోదగ్గ మహనీయులు, దీప స్తంభాలుగా గుర్తుంచుకోదగ్గ మహనీయులు ముగ్గురున్నారు. ఒకరు వీరేశలింగం పంతులు. రెండోవ్యక్తి గురజాడ అప్పారావు. మరోవ్యక్తి గిడుగు వేంకట రామమూర్తిపంతులు. ఈ ముగ్గురి పుట్టుక మరికొంత ఆలస్యమైతే, మనకు ఆధునిక సాహిత్యంకూడా కొంచెం ఆలస్యంగా వెలువడేదేమో! వీరేశలింగం సమాజ సంస్కరణకు పూనుకొంటే, గురజాడ సాహిత్య సంస్కరణకు పూనుకొన్నాడు. గిడుగు భాషా సంస్కరణకు పూనుకొన్నాడు. ఈ ముగ్గురూ తెలుగు సాహిత్యానికి, భాషకు త్రిమూర్తులు.

భాషాశాస్త్రం తెలుగునాట ఒక శాస్త్రంగా పాదుకోడానికిముందే ఆ రంగంవైపు దృష్టిసారించిన మేధావి గిడుగు. ఎక్కడో పర్వతాలపేటలోపుట్టి, గంజాం జిల్లాలో పనిచేసి, గురజాడకు సహపాఠిగాఉన్న గిడుగు వాడుకభాషా ఉద్యమాన్ని ఎందుకు ప్రారంభించాలనుకొన్నాడు? ... ప్రతి మనిషి తన మాతృభాషలోనే చదువుకొంటాడు, వ్యవహారాలను నడుపుతాడు. అన్నీ తన మాతృభాషలోనే చేస్తాడు. కాని, తనదికాని మాతృభాషలో చదువుకోవలసి వచ్చినపుడు ఎన్ని ఇబ్బందులు పడాలో మనకు తెలియనిది కాదు. అందుకే గిడుగు నాటి విద్యావ్యవస్థలో సంస్కరణలు ప్రారంభించాడు. ఈ క్రమంలో హేమాహేమీలైన అనేకమంది పండితులతో తలపడ్డాడు గిడుగు. భారతంవంటి గ్రంథాలను గిడుగు చదివినన్నిసార్లు మరేపండితుడూ చదివి ఉండడు. నన్నయ, తిక్కన, ఎర్రన...వంటి మహాకవుల ప్రయోగాల్లో దోషాలు ఉండకూడదని ఎక్కడాలేదు. దోషాలను ఎత్తిచూపడమేకాదు, వాటిని ఎలా సరిచేసి చదువుకోవచ్చో మనకు నేర్పిన మహామనీషి గిడుగు. ...

ఒకవైపు శాసనాల పరిష్కరణ, మహాగ్రంథాల పరిష్కరణ, మరోవైపు భాషా సంబంధమైనసేవ, మరోవైపు విద్యాలయాల్లో ఏస్థాయివారికి, ఏది, ఎలా, ఎంత, (?) బోధించాలో మొదలైన విషయాలపై నిపుణులతో చర్చలు...వంటి పనులెన్నోచేశారు గిడుగు. ప్రజాస్వామ్యంవైపు సమాజం పయనిస్తున్నపుడు, భాషకూడా ప్రజాస్వామ్య బద్ధంగానే ఉండాలన్నారు గిడుగు. ప్రజలువాడే వాడుకభాషను పండితులు తమతమ ప్రమాణాలతో చూడవద్దని కోరేవారు. మనకున్న వ్యాకరణాల ఆధారంగా మనం భాషను నిర్ధారించలేం! ప్రజల వాడుకకు, అవసరాలకు తగినట్టుగా పుట్టుకొచ్చే భాష వారి వ్యవహారభాష. ఆ వ్యవహారభాషే లేకపోతే, ఆధునిక సాహిత్యంలోఉన్న కథాసాహిత్యం, నవలా సాహిత్యం, స్వీయచరిత్రలు, నాటకాలు, నాటికలు... ఇవేవీ మనం చూసి ఉండేవాళ్ళంకాదు.

పిల్లవసుచరిత్రలు, పిల్ల మనుచరిత్రలకాలం ముగిసింది. భాష అనేది మన భావాలను వ్యక్తీకరించే ఒక సాధనం ఐనపుడు, మనం ఏం చెప్తామో ఇతరులకు తెలియాలి. అలా తెలిసినపుడుమాత్రమే విజ్ఞానం పదిమందికీ చేరుతుందని నమ్మిన వ్యక్తి గిడుగు వేంకట రామమూర్తిగారు. అలాంటి మహనీయునిమీద మనం సదస్సు నిర్వహించుకోడం చాలా చాలా చాలా హర్షించదగిన అంశం. సమావేశ అధ్యక్షుడిగా ఈ నాలుగు మాటలు మీతో పంచుకొంటూ మొదటిపత్ర సమర్పకులను తమ పత్రాన్ని సమర్పించవలసిందిగా కోరుతున్నాను. ...’

>>>><<<<

# రెండో సమావేశ అధ్యక్షుల తొలిపలుకులు

(రెండో సమావేశానికి, హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా ఉన్న ఆర్. వి. ఆర్. కృష్ణశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఇదే శాఖలోని సహవ్రతులు డాక్టర్ డి. విజయలక్ష్మి సమావేశకర్తగా వ్యవహరించారు. రెండో సమావేశంలో అధ్యక్షులు తొలిపలుకులను ఇక్కడ ఇస్తున్నాం.)

'ప్రస్తుత సమావేశంలో ఆరుగురు పత్ర సమర్పకులు ఉన్నారు. సమయాన్ని దృష్టిలో ఉంచుకొని తమ తమ పత్రాలను సమర్పించవలసిందిగా పత్ర సమర్పకులందరినీ కోరుతున్నాను. ఈ ఆరు పత్రాలూకూడా గిడుగువారిని గురించి సాక్షాత్తుగా ప్రస్తావించేవే! కాబట్టి ఆ వివరాలజోలికి నేను పోకుండా– డాక్టర్ సంపత్‌కుమార్‌గారిని పత్ర సమర్పణ చేయవలసిందిగా కోరుతున్నాను.

# ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథి చేసిన ప్రసంగ పాఠం

(సదస్సు ముగింపు సమావేశానికి **ఆచార్య వై. యాదగిరిగారు** ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వారి ప్రసంగ పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.)

‘అంతర్జాలా సరూపస్య శివస్య బహిరాకృతిం
వందే మనిశతాం, దేవీం విద్యత్ జిహ్వాగ్ర నర్తకీం|

ఒక భాషావిప్లవకారుడు, భాషాతపస్వి ఒక శతాబ్దానికి పునాదివేసిన మహానుభావుడుపుట్టి 150 సంవత్సరాలు గడచిన సందర్భంగా, భాషాభిమానులమయిన మనమందరం ఈ ఉత్సవం జరుపుకోవడం మనందరి ప్రథమకర్తవ్యం. యువత, తెలుగుదేశం, తెలుగు ప్రజలు స్మరించి, ఆరాధించి, పూజించ వలిసి నటువంటి ఆ మాహానుభావుడికి బాధ్యతగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఒకరోజు భాషాతపస్సుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం నాకు ఆనందంగాఉంది. ఈ కార్యక్రమ బాధ్యతను చేపట్టిన తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య ఎస్. శరత్జ్యోత్స్నారాణిగారికీ, వేదికనలంకరించిన డాక్టర్ పవన్ కుమార్, డా. భుజంగరెడ్డిగార్లకు, సభలో ఆసీనులైన పెద్దలు ఆచార్య జి. ఉమామహేశ్వరరావుగారికీ, ఇతర పెద్దలకు, విద్యార్థులకు వందనాలు.

భాషాతపస్సు చేస్తున్న బాలఋషులు మీరందరూ, ఋషి బాలికలు మీరందరూ, మీఅందరికి అభివందనాలు. భాషే జగత్తుకు ప్రాణం. అటువంటి భాషను, ప్రజలందరికి అందుబాటులోకి తీసుకొనిరావడానికి, గిడుగు రామమూర్తిపంతులుగారు చేసినకృషి తెలుగుజాతి బ్రతికున్నంతవరకు జ్ఞాపకముంటుంది. తెలుగుభాష మనం మాట్లాడినంతకాలం ఆయన తప్పకుండ మనహృదయంలో ఉంటారు. ప్రాచీనకాలంలో తెలుగు వాక్యానికి పునాదులు వేసిన నన్నయ ఎలాగో, ఆధునికకాలంలో తెలుగుభాషకు ఆధునికమైన పరిణామాలతో ప్రజలచెంతకు తీసుకెళ్ళడానికి తపస్సుచేసిన గిడుగు అలనాటి నన్నయవంటివాడు. ఒక శతాబ్దిలో వేలకు వేలకవులు, రచయితలు పుట్టుకొచ్చినారంటే, గిడుగువారు చేపట్టిన వ్యావహారిక భాషోద్యమమే కారణం. అదేలేకపోతే, తెలుగులో ఇంత సాహిత్యం వచ్చిఉండేదేకాదు.

భాషలో మార్పు అనివార్యం. గిడుగు కాలంలో వారి సాటి రచయితలకు ఈ తరం ప్రాతిపదికగా మారింది. భాషమారుతూ ఉంటుందని రాయప్రోలు సుబ్బారావు తన రమ్యాలోకం మొట్టమొదటి పద్యంలోనే చెప్పారు. “కాలధర్మానుగతమై, జగత్ప్రవృత్తి మారునపుడెల్ల, వాఙ్మయముమారు నిజము’ అంటారాయన. కొత్తనీరు తొల్కరియై పొర్లిపార, పాతనీరు తొలంగుట అబ్బురమ్ముకాదు” కొత్తనీరు రాగానే, పాతనీరు పోతుంది. కాల ధర్మాన్నిబట్టి భాషలోకూడా మార్పువస్తుందని రాయప్రోలు ఆనాడే

చెప్పారు. కాలధర్మాన్ని విడిచిపెట్టి ఏ రచయిత రచనలు చేయలేరన్నది దాని పరమార్థం. అందుకే, ప్రతివ్యక్తీ భాషను పరిశీలించాలి, పరిశోధన చేయాలి, ప్రేమించాలి, ఆరాధించాలి.

శబ్దాన్ని దేవతగా ఆరాధిస్తే అది మనకు సాక్షత్కారిస్తుంది, ప్రసన్నమవుతుంది అని విశ్వనాథ చెప్పారు. భాషను తపస్సుగా భావించేవారు, ఒక సాధనగా ఎవరైతే భావిస్తారో, వారు తప్పకుండా ఉన్నతులవుతారన్నది గతశతాబ్ది సాహిత్య, భాషాపండితులను గమనిస్తే తెలుస్తుంది.

మనకు చిన్నయసూరి, గిడుగువంటి భాషతస్సంపన్నులు అనేకులున్నారు. కవులున్నారు. భాషను, సాధనంగా చేసుకొని మాత్రమే వీరంతా ప్రపంచాన్ని మార్చదగిన సాహిత్యసృష్టి, రచనలసృష్టి చేశారన్నది గమనించి..... భాషకంటె నవ్వులకు తపస్సులేదు అని నేడు చెప్పుకోగలుగుతున్నామంటే, మనవెనుక ఋషితుల్యుడైన, గిడుగు ఉన్నాడని భావించాలి. తెలుగువారి నాల్కలపై నాట్యమాడే పదజాలాన్ని సృష్టించిన మహానుభావులెందరో మనకున్నారు. ఆర్ద్ర నవనీత మార్దమ మందునుడువు, శ్రవణ శుభగమిచ్చు లలితోచ్చారణమున....' లలితమైన, మార్దవమైన, శబ్దజాలాన్ని సమీకరించుకొని, రచనలుచేయమని కవులు కోరినారంటే కారణం, వెనుక గిడుగు ఉన్నాడని. ఈ కారణంవల్లనే, చాలాకావ్యాలు, చదివి అర్థంచేసుకోగలుగుతున్నాం ఈనాడు. ప్రాచీన సాహిత్యం మనఅందరికీ, దూరంకావడానికి, కారణాలు మనఅందరికీ తెలిసిందే. వ్యవహారానికి భిన్నంగా ఉండడం. ఆ బేధాన్ని పక్కన పెట్టిరచనలు చేశారు గతశతాబ్ది ఆధునిక కవులందరు.

తెలుగుభాషపై జరిగినంత పరిశోధన ఇతర భాషలపై, జరిగిందని నేననుకోను. ఎందరోమహానుభావులు, భాషాశోధనకు, తమజీవితాల్ని, ప్రాణాన్నికూడా, ఫణంగాపెట్టి, భాషను రక్షిస్తూవచ్చారు. భాషను, తల్లిగా భావించారు. ఆరాధించారు. ఆ ఆరాధనాభావం, విద్యార్థిదశనుంచే రావాల్సిన అవసరం ఉంది. అటువంటి ప్రేరణ పొందడానికి ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయి.

నేను రాయప్రోలు సుబ్బారావుగారిమీద పరిశోధనచేసే సమయంలో, గిడుగువారినిగురించి ఎక్కువగా తెలుసుకున్నాను. రాయప్రోలు తన రచనల్లో మార్పుకోరడానికి ప్రేరణఎక్కడిది? –అన్నవిషయ పరిశీలన నుంచి చాలావిషయాలు గ్రహించగలిగాను. పండితవంశంలోపుట్టి, మహానుభావులతోతిరిగి, వ్యవహారభాషకోసం పరితపించడం, భాషలో మార్పును, పరిణామాన్ని సహజలక్షణంగా గుర్తించడంఅన్నది సామాన్యమైన విషయంకాదు– గతశతాబ్దం ప్రారంభంలో. కరడుగట్టిన మహాపండితుల నెదుర్కొన్నాడు గిడుగు. అందుకే, ఆయన్ను పిడుగు అన్నారానాడు. మీలో ప్రతివిద్యార్థి గిడుగును ఆదర్శంగా తీసుకొని అధ్యయనాన్ని, పరిశోధనలను కొనసాగించాలని కోరుతున్నాను.

భాషలోమార్పుఅనివార్యం. అన్నవిషయాన్ని గుర్తించి, ఈనాడు రచనలుచేసే రచయితలుకూడా తమరచనలో కొత్తమాటలకు చోటివ్వాల్సిన అవసరంఉంది. అప్పుడే ప్రజలహృదయాన్ని ఆకట్టుకోగలుగుతాం. ప్రపంచీకరణ నేపథ్యంలో మనభాషలో అనేకమైన మార్పులు కలుగుతున్నాయి. ఈ కారణాన్ని, చూపుతూ భాష చెడిపోయిందని, చెప్పకూడదు. ఆత్మీకరించుకొని కొన్ని మాటలను, చెప్పడంవల్ల, మనభాషల్లో పదసంపద పెరుగుతుంది. విస్తృతమౌతుంది. తెలుగు వ్యవహారంలో, ఇంగ్లీష్, ఉర్దూమొదలైన, భాషలనుంచి పదాల్ని మనం కలుపుకొని ఆభాషలో వ్యవహరిస్తారు. అది తెలుగువారి విశాలమైన హృదయాన్ని తెలియజేస్తుంది. భాషావ్యవహారంలో సంకుచితత్వం ఉన్నవారు పైకిరాలేరు. అందుకే; వ్యాకరణాలనుకూడా ఎప్పటికప్పుడు మార్చుకోవాలి.

తెలుగు ఎంతో సంపన్నమైన భాష. “తెలుగే తీయనిదంచు పద్యపద రీతి క్రీడలత్యంత మోహనముల్, శోభనముల్...” అన్నారుకవి. తెలుగు చదివినవారు అదృష్టవంతులు. మనం జీవితకాలంచదివినా, భాషాధ్యయనం పూర్తికాదు. భాషే జీవితంగా బ్రతికిన మహానుభావులున్నారు. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారున్నారు. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు, ఆచార్య G.V.S... లాంటి గొప్పభాషా తపస్సంపన్నులు, పనిచేసిన విశ్వవిద్యాలయం ఇది. అటువంటి, విశ్వవిద్యాలయంలో మీరంతా చదువుతున్నరనే స్ఫూర్తిని మీరు నిరంతరం గుర్తుంచుకోవాలి. భాషా ప్రేమికుడిగానే నేను ఈరోజు ఇక్కడికి వచ్చాను. భాషే మనకు శాంతినిస్తుంది, డబ్బు పెట్టికొనలేని ఆనందాన్నిస్తుంది. అందుకే, భాషను మనంతల్లి అన్నాం. సరస్వతి అన్నాం... ఒక సందర్భంలో ఆదిశక్తి అన్నాం. మన మనసు మరీ ఆహ్లాదభరితమైన, సందర్భంలో, భాషను ప్రేయసిగాకూడా సంభావించాం మనం. మనకు హృదయ సంస్కారాన్ని నేర్పించేది భాషే. అందుకే ఏ రచన నూతక్కువ చేసి చూడవద్దు. సాధ్యమైనంత ఎక్కువగా అధ్యయనం చేయండి.

ఈనాటి సమాజానికి, అనుగుణమైన పదజాలాన్ని సృష్టించుకొని మనం రచనలుచేస్తే రచనకు ఒక సౌందర్యం ఏర్పడుతుంది. దానికోసం, పరిశోధకులు విద్యార్థులు, అధ్యాపకులు కృషిచేయాలి. పదప్రయోగ సందర్భాలు తెలిస్తేనే, భాషాప్రయోగ ఔచిత్యం తెలిసినట్టు; అందుకే 'భాషలో శిక్షణ అవసరం'. సాహిత్య సృజన ప్రక్రియలన్నిటికీ, మూలంభాషే కాబట్టి. మీరంతా భాషలో ఎక్కువదృష్టి పెట్టాలని కోరుతున్నాను.

తెలుగు అకాడమి సంచాలకుడిగా నేను ఈ సందర్భంలో మీముందు ఉన్నాను. గిడుగు, సాహిత్య సర్వస్వాన్ని ఒక నెలలో మీ ముందుకు తెచ్చేందుకు శాయాశక్తులా ప్రయత్నిస్తున్నాం. భాషకు సంబంధించి ఎవరైనా పరిశోధన చేసినా, వ్యాసాలు రాసినా, అకాడమీ తరపున ముద్రిస్తామని తెలియజేస్తున్నాను. సదస్సులో వచ్చిన పత్రాలను అకాడమికి ఇవ్వడానికి మీరు అంగీకరిస్తే, ఒక నెలలో ఆ గ్రంథాన్ని మీకు ముద్రించి అందజేస్తాను.

మరోఅంశం చెప్పి ముగిస్తాను:

1913లో ఆధునిక కవిత్వానికి అంకురార్పణ జరిగిందని పెద్దలు చెబుతున్నారు. ఇది 2013వ సంవత్సరం. అంటే 100 సంవత్సరాల ఆధునిక కవిత్వాన్ని సమీక్షించుకొని, దాని నుంచి ప్రేరణ పొందవలసిన అవసరంఉందిఅని నేను మీదృష్టికి తెస్తున్నాను. ఆ అంశంపై ఒక సెమినార్ను మీరు నిర్వహించదలిస్తే, తెలుగు అకాడమీ తరపున, ఆర్థికంగా పూర్తిబాధ్యత వహిస్తుందని మీకు తెలియజేస్తున్నాను. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన శరత్జ్యోత్స్నారాణిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'.

>>>><<<<

# గిడుగు వ్యవహారిక భాషోద్యమం – 'తెలుగు' పత్రిక పాత్ర

## 'Gidugu's' Colloquial Language Movement and the Role of the Periodical 'Telugu'

–Prof. S. Saratjyotsna Rani,
Head, Department of Telugu &
Coordinator, Centre for the–
Study of Classical Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.

ఆంధ్రదేశానికి, ఆంధ్ర భాషకు సంబంధించినంతవరకు 19వ శతాబ్ది ఉత్తరార్థంనుండి మంచిరోజులు ప్రారంభమయ్యాయి. ఒకరి తరువాత మరొకరు, మొత్తంగా, ముగ్గురు సాహితీ వేత్తలు – ఈ తెలుగు వసుధపై ప్రభవించడం మనందరికి గర్వకారణం. కందుకూరి వీరేశలింగం పంతులు జన్మించిన తరువాత, పాతికేళ్ళకు గురజాడ వెంకట అప్పారావు, గిడుగు వెంకట రామమూర్తిగారు జన్మించారు. ఆధునికాంధ్ర సాహిత్యం మరియు సామాజిక దృక్పథం ఈ ముగ్గురివల్ల ఎంతగానో ప్రభావితమయ్యాయి. ఈ ముగ్గురు, మూడు రకాల మౌలికమైన అభ్యుదయ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. అందువల్ల వీరి పేర్లు ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో సుస్థిరంగా నేటికీ నిలిచిపోయాయి.

సంఘ సంస్కర్త, నవీన యుగ సాహితీ నిర్మాత, ప్రజాహిత సంస్థ నిర్మాత అయిన వీరేశలింగంపంతులు సమాజ దృక్పథంలోనే మౌలికమైన మార్పులు తేవటానికి జీవితాంతం కృషి చేశారు. వీరి ఆశయ సిద్ధి కోసం అచ్చమైన సాంఘిక కృషి చేసినవాడు అప్పారావు అయితే, సాంఘిక దృక్పథంతో భాషా కృషి సాగించినవాడు గిడుగు. ముఖ్యంగా సాహిత్యాన్ని పండితుల గుత్తాధికారం నుంచి తప్పించినవాడు గురజాడైతే, సాంఘిక ప్రయోజనానికి భాష మీద గుత్తాధిపత్యాన్ని పండిత వర్గం నుంచి తప్పించి, ప్రజలకు భాషాస్వాతంత్ర్యం కల్పించిన వాడు గిడుగు. వీరు 1863వ సంవత్సరం ఆగస్టు నెల 29వ తేదిన పర్వతాల పేటలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం పర్వతాల పేటలోనే జరిగింది. విజయనగరం మహారాజావారి పాఠశాలలో ఇంగ్లీషులో లోయర్ ఫోర్త్‌లో చేరారు. ఆయనకు కాళ్ళకూరి విశ్వనాథంగారు ఇంగ్లీషు అక్షరాలు నేర్పి, వ్యాకరణాంశాలు బోధించారని గిడుగు తన జీవిత చరిత్రలో పేర్కొన్నారు. ఆ పాఠశాలలోనే గిడుగు నాలుగేళ్ళు చదివారు. 1879 నాటికి మెట్రిక్యులేషన్ పరీక్షలో

ఉత్తీర్ణులై, ఉన్నత పాఠశాలలో విద్యకోసం చేరినప్పుడు గిడుగుకు, గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, బుర్రా పార్వతీశం వంటివారు సహపాఠకులుగా ఉండేవారు. గిడుగు పట్టుదల గలవాడు, సరళ హృదయుడు. ఆయన బి. ఎ. లో ర్యాంక్ సాధించి పర్లాకిమిడిలో ఉద్యోగంలో చేరారు.

1910లో గురజాడ రాసిన దిద్దుబాటుతో కథా సాహిత్యం ప్రారంభమైనట్లే, 1910 ప్రాంతంలోనే వ్యవహారిక భాషోద్యమానికి ఒక స్పష్టమైన ఆకృతి కలిగింది. అప్పటి గ్రాంథిక భాషాభిమానులకు ఈ వ్యావహారికోద్యమం పట్ల చాల అపోహలు ఉండేవి. సనాతన సంప్రదాయవాదులు సంఘసంస్కరణోద్యమం పట్ల ఎంత వ్యతిరేకతను కనబర్చారో గ్రాంథికవాదులు వ్యవహారికోద్యమం పట్ల అదే విధానాన్ని అనుసరించారు. వ్యవహారిక భాష అంటే వారి దృష్టిలో గ్రామ్యం. కనీసం మూడు దశాబ్దాలకు కాని ఈ తీవ్ర వ్యతిరేకత వాళ్ళలో సడలలేదు.

'లక్షణ విరుద్ధమైంది గ్రామ్యం' కాబట్టి ఇది కేవలం పామరులు వ్యవహరించేదే కాని, శిష్టుల వ్యవహారానికి, కవులు ప్రయోగించే లక్షణానికి విరుద్ధమైనదని గ్రాంథిక వాదులు గట్టిగా వాదించారు. అటువంటి ప్రయోగాలు కావ్యాలకు ఏమాత్రం పనికిరావని వాదించారు. కాని వ్యావహారిక వాదులు తామాశించే ప్రయోజనం వచన రచన విరివిగా కొనసాగడమేననీ వాడుక భాషను వచన రచనలో స్వీకరించడంవల్ల భావాభివ్యక్తికి అనుకూలంగా ఉంటుందని, కావ్య భాషకు –కావాలంటే, మీ నియమ నిబంధనలతోనే నిర్వచించుకోవచ్చునని చెప్పినా –నాటి గ్రాంథిక భాషా వాదులు ఏమాత్రం అంగీకరించలేదు.

వ్యావహారిక భాషోద్యమం ఎందుకు తలెత్తింది? అనే ప్రశ్నకు చక్కని జవాబు కూడా ఉంది. సమాజంలో తలెత్తిన సంఘసంస్కరణోద్యమాల మాదిరిగానే, సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి ఈ ఉద్యమం పుట్టింది. ఈ వ్యావహారిక భాషోద్యమం, నూటికి తొంభైకి మించి జనులు విద్యావంతులైనప్పుడు సమాజంలో సుస్థితి ఏర్పడుతుందనీ, సామాజిక, రాజకీయ, ప్రయోజనాలను ప్రజలు అనుభవించగలుగుతారనీ, ప్రజలను విద్యావంతులను చేయడానికి వాళ్ళలో సామాజిక బాధ్యతలను ఉద్బోధం చేయడానికి వాడుకభాష అత్యంత సహకారి అవుతుందని రామమూర్తిపంతులుగారు వాదించారు. ఆ సిద్ధాంతాన్నే ఆయన గట్టిగా బలపర్చారు. ముఖ్యంగా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల పఠన, పాఠనాదుల్లోనైతం వాడుకభాష ఉండటం మంచిదని ఆనాటి విద్యాశాఖ అభిప్రాయపడింది. వ్యావహారికభాషోద్యమం 1909–10లలో ప్రారంభమై 1919 నాటికి చాలావరకు అంగీకృతమై, సాఫల్యం పొందింది. 1919వ సం.లో గిడుగువారి ఉద్యమాన్ని సమర్థిస్తూ, ఆనాటి కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికలు సంపాదకీయాలు రాశాయి. 1922 నాటికే మాలపల్లివంటి నవల వాడుకభాషలో వెలువడింది. ఆతర్వాత, సాహిత్య పత్రికలెన్నో పుట్టుకొచ్చాయి. వీటిలో ప్రధానమైనది 'తెలుగు' పత్రిక. ఒక్క సంవత్సరం మాత్రమే వెలువడిన ఈశతాబ్ది తెలుగుసాహిత్యానికి, ముఖ్యంగా వ్యావహారికభాషోద్యమానికి

ఈపత్రిక తెచ్చినస్ఫూర్తి అనుపమానం, భాషాతత్త్వ వివేచనను శాస్త్రీయంగా నిర్వహించిన తొలితెలుగుపత్రిక ఇదేనని చెప్పాలి. అప్పటికి గిడుగు పర్లాకిమిడి ప్రాంతంలో ఉన్నాడు. ఆ మూలప్రాంతం నుంచి, ఈ తెలుగుపత్రికను వెలువరించడంలో చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కేవలం భాషావిషయకమైన అంశాలే ఈపత్రికలో ఉండేవి. కవిత్వం, సృజనాత్మక సాహిత్యం మొదలైనవేవి ఉండేవికావు. ఈపత్రిక గిడుగు పరమపదం పొందినంతవరకైన వెలువడిఉన్నట్లయితే తెలుగుభాషాసాహిత్యాల నవీకరణం ఎప్పుడోసాధ్యమై ఉండేది. రాజశేఖరుడి కావ్యమీమాంసలోని సూక్తికి గిడుగు పతాక విలువనిస్తూ సూక్తి వాక్యంగా ప్రచురించేవారు. సంస్కృతం గొప్ప భాషే. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే ప్రాకృతానికున్న సౌదర్యం, లాలిత్యం సంస్కృత భాషకెక్కడిది? ప్రాకృతమే మాకు ఇష్టం అని ఆ సూక్తి వాక్యానికి భావం.

గిడుగు, వేదం వారిపై రాసిన 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం'ఈ పత్రికలో మొదటిసారిగా ప్రచురించబడింది. సీతాపతి, పంతులుగారి తెలుగు చంధస్సులోని విశేషాలు ఈ పత్రికలో వెలువడ్డాయి. కేవలం భాషా శాస్త్రీయమైన పత్రిక కాబట్టి, దీనికి చందాదారులుండేవారు కాదు. గిడుగు తంజావూరు నుంచి చత్రపురం దాకా తిరిగి సేకరించిన సమస్త వ్యావహారిక భాషోద్యమానుకూల సమాచారం ఈ పత్రికలో ప్రచురించాలనే తపనతో ఈ పత్రికను స్థాపించినట్లు కనబడుతుంది.

ఒకవైపు ఆంధ్ర సాహిత్య పరిషత్తు వ్యవహారిక భాషోద్యమానికి బలమైన వ్యతిరేకత ఏర్పడిందో, అప్పుడు గిడుగు రామమూర్తి పంతులుగారు తెలుగు దేశంలో ప్రచారానికి బయలు దేరారు. ముఖ్యంగా నగరాలలోని కళాశాలలకు వెళ్ళి, అధ్యాపక బృందాలను కలుసుకొని, సభలు చేసి, తమ వాదాన్ని వినిపించి, తనకు లభించిన సాక్ష్యాధారాలన్నిటినీ వాళ్లకు ప్రదర్శించాక పూర్వులు వ్యవహారికాన్ని నిరసించలేదని అంగీకరిస్తారా? లేదా? అని వాళ్ళతో చర్చలు చేసేవారు. ఒప్పుకోకపోతే, ఎందుకు ఒప్పుకోవటంలేదో ఆవిషయాన్ని లిఖిత పూర్వకంగా తమసాక్ష్యంకోసం ఇవ్వాల్సిందిగా కోరేవారు. ప్రముఖులఎదుట ఉపన్యసించేవారు. ఆవిధంగా, బళ్ళారినుంచి బరంపురంవరకు పర్యటించి తను సేకరించిన సాక్ష్యాధారాలన్నింటిని తెలుగుపత్రికలో ప్రచురించేవారు. గిడుగు అంతేకాకుండా, స్థానికంగా లభ్యమయ్యే తాళపత్రగ్రంథాలనుంచి, గ్రంథాలయంలోని పుస్తకాలనుంచీ, వ్యక్తులనుంచి, సేకరించిన అంశాలను, తనవాదానికి ప్రామాణికంగా ఉపకరించే సమాచారాన్నికూడ సేకరించేవారు. టీకలూ, టిప్పణులు, వ్యాఖ్యానాలుఅన్ని మన పూర్వీకులు వ్యావహారికంలోనే రచించేవారని చూపేవారు. తనవాదాన్ని వ్యతిరేకించినవారి ప్రమాణపత్రాలనుకూడ సేకరించేవారు గిడుగు. ఆకరాలలోనుంచి వాడుక భాషాప్రయోగాలను చూపిస్తే అవిచాలామటుకు లేఖన ప్రమాదాలనీ, విషయ విశదీకరణే ప్రాధాన్యంగాగల టీకలు, టిప్పణులు తాము ప్రామాణికంగా గ్రహించజాలమని అంటే అభిప్రాయాన్ని రాయించి పుచ్చుకొనేవారు పంతులుగారు.

గిడుగువారి మిత్రులు గోపాలయ్య పర్లాకిమిడిలో ఇంజనీరుగా పనిచేసేవారు. నన్నయ భారత పద ప్రత్యయ వర్గీకరణలో రామమూర్తికి తోడ్పడేవారు. పండితుల నుండి సేకరించిన ఈ అంశాలన్నింటినీ గిడుగువారు "Tradition regarding Telugu Composition Testimony" 'తెలుగు రచన సంప్రదాయమునకు సాక్షం' అనే శీర్షిక కింద తెలుగు పత్రికలో ప్రచురించేవారు.

కాకినాడలో 1915వ సంవత్సరం మార్చి 20వ తేదిన పండితులను కలుసుకున్నారు గిడుగు రామమూర్తిగారు. "కావ్య గౌరవమున కర్తమునగాని, బడిపిల్లల వ్రాతలలో కావ్య నియమముండి తీర వలయుననుట సంప్రదాయ విరుద్ధం" అన్న పండితుల అభిప్రాయాలను తెలుగు పత్రికలో రాసారు.

గ్రంథాలయములలోని పుస్తకాలు అందరూ చూసేవి కాకపోవడంచేత అక్కడివారి సాక్ష్యం కావలసి వచ్చింది. మా వద్దనున్న పుస్తకాలు మీతోతీసుకొని పోయి పాఠశాలల్లో, కాలేజీలలో వున్న పండితులకు, ఉపాధ్యాయులకు చూపించి సంప్రదాయమును గురించి వారి నుంచి నిదర్శన పత్రాలు పుచ్చుకొన్నామని పేర్కొన్నారు. తెలుగు పత్రికలోని ప్రారంభ సంచికలో 'తెలుగు భాషా సాహిత్యాలు ఆధునికం కావటానికి ప్రణాళికలు నిర్ణయించారు. వృత్తి పదకోశాలు వారు ఆనాడే ఊహించారు. మాండలిక పదకోశాలు కావాలన్నారు. ఆకారాది పదనిఘంటువుల మాదిరిగానే ఆకారంత నిఘంటువులు కుడా ఉండాలని సూచించారు.'ఇటువంటి ప్రణాలికలు మొదటి సంచికలోని ఆయన పన్నెండుదాకా పేర్కొన్నారు. ప్రతి సంచికలోను భాషా పరిణామం గురించి ఒక వ్యాసాన్ని ప్రచురించేవారు.

శాసన భాషాధారాలు చూపి, ఏ కాలంలోని వారు ఆ కాలం వాడుకనే అనుసరిస్తూ వచ్చారని నిరూపించారు గిడుగు. తమ "మెమొరాండం ఆన్ మాడరన్ తెలుగు" అనే ఇంటర్మీడియెట్ కాంపోజిషన్ కమిటి వారికి సమర్పించిన అభిప్రాయ నివేదనపై పండితులు ఇచ్చిన అభిప్రాయాలను తెలుగు పత్రికలో ప్రచురించారు. భారతదేశ భాషలన్నింటినిసర్వే చేసిన గ్రియర్ సన్ పండితుని అభిప్రాయం ఇంగ్లాండులో ఫ్రైజర్ పండితుని అభిప్రాయం ఫారిన్ ప్రాచ్య భాషోపాధ్యాయుడైనయూత్‌బ్లాక్ పండితుని అభిప్రాయాన్ని తెలుగు పత్రికలో ప్రచురించారుగిడుగు.

ప్రొ. స్టెన్‌కొనో 1931వ సంవత్సరం జులై నెలలో రాసిన ఉత్తరాలు తెలుగు పత్రిక ప్రారంభ సంచికలో ప్రచురించారు. గిడుగు ఈ పత్రికను ఎందుకు నడుపుతున్నాడో తెల్పుతూ, భాషా పరిణామం ప్రాథమిక సూత్రాలను తెలియజేయడమే పత్రిక ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

ప్రొ. స్టెన్‌రొనె ఉత్తరంలోని మొదటి పంక్తులను గమనిద్దాం.

'My dear Rao Sahib,

Many Thanks for your letter of the 3rd ... and for your able pamphlet about modern Telugu. Which i have read with great interest. I entirely agree

with your views. The classical Telugu of the *pandit* cannot remain the vehicle for teaching modern Telugu.'

మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలులో గ్రాంథిక వాదుల పక్షాన పిఠాపురం రాజావారు అడిగిన ప్రశ్నలు, అందుకు కౌన్సిలులో జరిగిన చర్చలు, వాటి వివరాలను ప్రభుత్వం వారిచ్చిన సమాధానాలను కూడా సంగ్రహంగా తెలుగు పత్రికలో ప్రచురించేవారు.

తెలుగు పత్రిక సంపాదకీయంలోని గిడుగు తెలుగుభాష వర్తమాన స్థితిగతులను గూర్చి బాధపడుతూ ఆడవాళ్ళు చదువుకోవడానికి, పిల్లలుచదివి ఆనందించటానికి, వివిధస్థాయి పాఠకులు చదివి, లోకవృత్తం తెలుసుకోవటానికి తగినరచనలు తెలుగులో వెలువడకపోవటానికి కారణం తెలుగు వచనరచనను అనావశ్యకమైన నియమ నిబంధనలు బాధించటమే అంటారు. ఏభాష అభివృద్ధి అయినా, ఆ కాలపు విజ్ఞానవ్యాప్తిపైనే ఆధారపడి ఉంటుందనీ, జనసామాన్యంలో విద్యనూ, విజ్ఞానాన్నీ వ్యాపింపజేయాలంటే వాఙ్మయాన్ని మించిన సాధనం మరొక్కటిలేదని, పదేపదే బోధించేవారు గిడుగు రామమూర్తి. ఆయన నడిపిన 'తెలుగు' పత్రిక ఆ రోజుల్లో గొప్ప పత్రికగా వెలుగొందింది. ఈనాటికి, ఏనాటికి ఆ పత్రికను తెలుగు ప్రజలు మర్చిపోలేరు.

రామమూర్తి పంతులుగారి ఆశయాలను ప్రజలకు అందించిన వెలుగు పత్రిక ఈ తెలుగు పత్రికే. ఇది సంవత్సరం మాత్రమె నడిచి ఆగిపోయింది. చివరి రోజుల్లో కూడా, – గిడుగు చనిపోతారనగా – గూడవల్లి రామబ్రహ్మంగారి ప్రజామిత్ర కార్యాలయంలోని పత్రికా రచయితల గోష్ఠిలో పాల్గొన్నారు. ఏనాటికైనా తమ వాదం విజయవంతమవుతుందనే ఆత్మా విశ్వాసాన్ని ప్రకటించిన భాషాభిమాని, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామమూర్తి పంతులు. గిడుగు పుట్టిన రోజును మాతృభాషా దినోత్సవంగా తెలుగు వారందరూ జరుపుకోవడం ఆనందదాయకమైన విషయం.

## సంప్రదించిన గ్రంథాలు


1. రమాపతిరావు, అక్కిరాజు. 1971. వ్యావహారిక భాషా వికాసం–చరిత్ర. హైదరాబాదు: ఎమ్. శేషాచలం అండ్ కో.
2. రాజు, ఎన్. ఎస్. 2001. గిడుగు లేఖలు. హైదరాబాదు: విశాలాంధ్ర ప్రచురణాలయం.
3. రామారావు, చేకూరి. 1986. మరోసారి గిడుగు రామమూర్తి. హైదరాబాదు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
4. వేంకట రామమూర్తి, గిడుగు. 1879. ఆంధ్ర పండిత భిషక్కులభాషాభేషజం. విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణాలయం.


>>>><<<<

# వ్యావహారిక తెలుగు ప్రాధాన్యం గుర్తించిన లాక్షణికులు

## The importance of colloquial Telugu: Philologists

– Prof. R. V. R. K. Sastry,
Professor, Dept. of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.
sastryrvrk@yahoo.in

లక్షణం అంటే శాస్త్రం. దాని నిర్మాతలు లాక్షణికులు. వీరిని మనవారు లక్ష్యైక చక్షుష్కులు అన్నారు. అంటే లక్ష్యంమీద ప్రయోగంమీదమాత్రమే దృష్టి కలవారు అని అర్థం. శాస్త్రంలో సామాన్య విశేష విధి సూత్రీకరణకు ఈ ప్రయోగాలే ఆధారం. అందుకే 'ప్రయోగ శరణం వ్యాకరణం' అన్నారు. ఈ మాట ఒక్కవ్యాకరణానికేకాదు ఏశాస్త్రానికైనా వర్తిస్తుంది. అయితే ఈప్రయోగం ఎవరిది అన్నదానిపై అభిప్రాయభేదాలుండవచ్చు. నిష్కర్షగా చెప్పాలంటే ఆయా భాషావ్యవహర్తల ప్రయోగమే ప్రమాణం, అదే శరణం. అందుకే ఎంతటి వ్యాకర్త అయినా జనవ్యవహారానికి దూరంగా ఉండలేడు. కాబట్టి ఏదో ఒకవిధంగా జనవ్యవహారభాషను గుర్తించి తీరాల్సిందే.

వ్యావహారిక భాషాప్రాధాన్యాన్ని లాక్షణికులు గుర్తించిన తీరు రెండు విధాలుగా ఉంది. 1.ప్రతికూలమైన గుర్తింపు, 2. అనుకూలమైన గుర్తింపు. వైరభక్తి–సఖ్యభక్తిలా దీన్ని అనుకోవచ్చు. ప్రతికూలమైనా అనుకూలమైనా వ్యావహారిక ప్రాధాన్యాన్ని గుర్తించడమే మనకు కావలసిన అంశం. ఎలా గుర్తించారో కొంచెం చూద్దాం.

ఆంధ్రశబ్దచింతామణి కర్త 'ప్రవాహినీ దేశ్యా' అని దేశ్యాన్ని నదీప్రవాహంతో పోల్చాడు. నదిలో నీరు నిత్యం ప్రవహిస్తూనే ఉన్నా ఈరోజున్న నీరు రేపుండదు. కాని నీటిప్రవాహం అలాగే ఉంటుంది. దీన్ని ప్రవాహనిత్యత అంటారు. వ్యవహారంలో ఉండే దేశ్యం అటువంటిదన్నమాట. ఇది జీవద్భాషలకుండే లక్షణం. నిత్యపరిణామశీలంగల జీవద్భాషలకు రాసే లక్షణాలుకూడా మారుతుంటాయి, మారుతూండాలి. అందుకే తిరుపతి వేంకటకవులు 'భారతమును చూసి బాలవ్యాకరణమును దిద్దవలె గాని బాలవ్యాకరణమును చూసి భారతమును దిద్దరా'దని చెప్పారు. ఈమాట నన్నయాదుల భాషకున్న

ప్రామాణికతనే కాదు వ్యారణానికున్న పరిమితిని కూడా తెలియజేస్తుంది. దీన్నిబట్టి కాలక్రమంలో భాషలో వస్తూన్న మార్పుల్ని అంగీకరించాలని సూచించాడని భావించవచ్చు.

గ్రామ్యాన్ని నిర్వచిస్తూ 'అనియమాద్ గ్రామ్యం హి' అన్నాడు. నియమంలేనిది గ్రామ్యం, అంటే నియమించడానికి సాధ్యంకానిదని తాత్పర్యం. అంతేకాని నియమవిరుద్ధం అనికాదు. కాని చిన్నయసూరి 'లక్షణవిరుద్ధంబగు భాష గ్రామ్యంబు. ఈ భాష ప్రయోగంబునకనర్హంబు' (బాలవ్యా.సంజ్ఞ.సూ.)అని చెప్పాడు. చింతామణి గ్రామ్యం ప్రయోగార్హం కాదని చెప్పలేదు. పదజాలవైవిధ్యాన్ని చెపుతూ గ్రామ్యాన్ని నిర్వచించాడు. అంటే దానిప్రయోగం కూడా ఇష్టమనే భావించాలి. అందుకే ఇక్కడ అహోబలపండితుడు 'చతుర్విధా భాషేతి గ్రామ్యయా సాకం వికృత్యా శ్చాతుర్విధ్యం వదత శ్శబ్దానుశాసనాచార్యస్య కుత్రచిద్వినియోగ ఇష్ట ఏవ.అన్యథా తత్పరిగణనం ముధా స్యాత్' అని చెప్పాడు. ఈసందర్భంలోనే అధర్వణకారికావళిలో కూడా 'గ్రామ్యం తత్తద్విధౌ సాధు కరకంఠముఖా హితాః'(సంజ్ఞ.29) అని చెప్పాడు.

ఇక్కడ మరోమాట చెప్పాలి. లక్షణవిరుద్ధానికి గ్రామ్యమని పేరు పెట్టడమే సమంజసంకాదు. ఎందుకంటే గ్రామ్యమంతా లక్షణవిరుద్ధంకాదు. గ్రామీణజన వ్యవహారంలో ఉన్నభాషంతా లక్షణవిరుద్ధమనడానికి లేదు. లేదా ఇది కేవలం వ్యాకరణ వ్యవహారంకోసం ఏర్పరుచుకొన్న సంజ్ఞాపదమేకాని అన్వర్థసంజ్ఞ కాదనుకోవాలి.

కేతన 'హాస్యనిందోక్తులలో గ్రామ్యం ప్రయోగార్హ' మన్నాడు. చిన్నయసూరి గ్రామ్యం ప్రయోగార్హం కాదన్నా 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు'అని కవిప్రయోగారూఢములైన గ్రామ్యాలు స్వీకరింపదగినవని చెప్పాడు. ప్రౌఢవ్యాకర్త 'గ్రామ్యంబు తత్తజ్జాతి వర్ణనంబున ప్రయోగార్హంబు' అని మరికొంత వెసులుబాటు కల్పించాడు. వీరుచెప్పిన లక్షణవిరుద్ధప్రయోగాలన్నీ సూక్ష్మంగా పరిశీలిస్తే ఆయాకాలాల్లోని జనవ్యవహారంలోంచి కావ్యంలో ప్రవేశించినవే. నన్నయ ప్రాణగొడ్డము అన్నా, తిక్కన సెల్లుడు, చేతురు, కోతురుఅన్నా, రామరాజభూషణుడు కూతుర్లు, కూతుర్ని అన్నా– ఇవన్నీ అప్పటి జనవ్యవహారంలోంచి కావ్యాల్లోకి వచ్చినవే. కాబట్టి కవులు వ్యావహారికంనుండి తప్పిచుకోలేనట్లే లాక్షణికులకూడా వ్యావహారికాన్ని గుర్తించకుండా ఉండలేరు. అత్వసంధి విషయంలో, క్రియాపదాల్లోని ఇకారసంధివిషయంలో, క్త్వార్థకేకారసంధి విషయంలో లాక్షణికులు కాలక్రమంగా ఎలా వెసులుబాటు కల్పించారో అదేవిధంగా వ్యావహారిక (గ్రామ్య)విషయంలోకూడా వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉంది. పైలాక్షణికుల అభిప్రాయాలు చూస్తే గ్రామ్యాన్ని కాదంటూనే కొంచెంకొంచెంగా వెసులుబాటు కల్పిస్తూనే వచ్చారని గ్రహించవచ్చు. వీరందరిది ప్రతికూలదృష్టితో గ్రామ్యాన్ని గుర్తించడంగా భావించాలి.

ఇక అనుకూలదృష్టితో గ్రామ్యాన్ని స్వాగతించినవారిని చూస్తే, వీరిలో ముందుగా పేర్కొనదగినవాడు మండలక్ష్మీనృసింహకవి. 1. ఇతడు గ్రామ్యాలను సంస్కృతభవాలుగా చూపాడు. ఉదా. గ్లాని–గిలాని, వ్యాత్యస్తం–వెత్తెస్తం, న్యాయం–నేయం, త్యాగం–తేగంమొ.వి. ఇవి నిస్సంశయంగా కావ్యప్రయోగాలుకాదు. అంటే జనవ్యవహారంలోని ఈమాటలను తద్భవాలుగా గ్రహించాలనేకదా అతని అభిప్రాయం.

2.తెలుగు పదాలమొదట యకారంబు, వువూవొవోలు లేవని బాలవ్యాకర్త (సంజ్ఞా. 17) చెప్పాడు. కాని ఇతడు వు వూ వొ వోల పదాదిత్వాన్ని అంగీకరించి దానికి ఉదాహరణంగా జైమిని గామాయణంలోని ప్రయోగం చూపాడు– వువిద యొకర్తు మేనఁ దొడవుల్దగిలించె ముదంబు మీరగా. నవనాథచరిత్ర, ద్విపద భారతం మొదలయినవాటిల్లో ఇలాంటి ప్రయోగాలున్నాయి. ఉకారానికి ఇటువంటి వకారాది పదాలు పరంగా ఉన్నపుడు వకారలోపంచెప్పి (పరిభాష. 26) సంధికార్యాన్ని సుగమం చేసాడు.

3. ఇదేవిధంగా చింతామణి కర్త యెవడు, యేవి, యెగ్గు మున్నగు యకారాది పదాలను అంగీకరించినా, అతడు యెక్కడ వంటి చోట్ల సంధివచ్చే విధానాన్ని చెప్పలేదు. కాని ఇతడు అటువంటి యకారానికి (పరిభాష. 28) లోపంచెప్పి అతడెక్కడవంటి రూపాలు సాధించాడు.

4. జనవ్యవహారంలో ఉన్న రూపాలనుకూడా సాధించడానికి ఇతడు పూనుకున్నాడు. విత్తులు–ఇత్తులు, విడెము–ఇడెము, వేటు–ఏటు మొదలగువాటిల్లోని పదాదివకారలోపం (సంధి.36) చెప్పి ఆరూపాల్ని సాధించాడు. ఇదేవిధంగా ఒకడు–ఒగడు వంటిచోట్ల కకారానికి గకారంవిధించి (తద్భవ.28) వ్యావహారికానికి మార్గం సుగమంచేసాడు. లాక్షణికులలో జీవద్భాషపట్ల ఉండవలసిన విశాలదృక్పథం ఇతడు కనబరిచాడు. వ్యావహారికాన్ని కాదనకుండా, దానికి సంస్కారంకలిగించే ప్రయత్నం చెయ్యడం మిక్కిలి ప్రశంసింప దగిన విషయం.

ఇక వ్యావహారికభాషోద్యమ పితామహుడు మహామహోపాధ్యాయ గిడుగు రామమూర్తి పంతులుగారి బాలకవిశరణ్యం పరిశీలిస్తే వ్యావహారికాన్ని లక్షణవిరుద్ధమంటూ ప్రయోగానికి దూరంచెయ్యడం ఎంతటి అపచారమో మనకు అవగతమవుతుంది. ఇపుడు చిన్నయసూరి బాలవ్యాకరణం ఆధారంగా లక్షణవిరుద్ధాలుగా కనబడుతున్నవన్నీ ఒకప్పుడు జనవ్యవహారంలో ఉన్నవనీ, కవులు వాటినే ప్రయోగించారనీ, గ్రంథపరిష్కర్తలు బాలవ్యాకరణం ఆధారంగా వాటిని సంస్కరించడానికి ప్రయత్నించారని వారు సోపపత్తికంగా నిరూపించారు. వారి బాలకవి శరణ్యం ప్రధానంగా నాలుగు అంశాలకోసం ఉద్దేశింపబడింది. 1. తెలుగుభాషాతత్త్వాన్ని నిరూపించడం, 2. ప్రాచీనగ్రంథాలలోని వ్యావహారికాన్ని పరిష్కర్తలు మార్చినతీరు, 3. గ్రాథికభాషగా చెప్పబడుతున్నదానికి సార్వత్రికమైన

ఏకరూపతలేదనడం, 4. ప్రాచీన కవుల ప్రయోగాలను సమగ్రంగా పరిశీలన చేయకనే వ్యాకరణరచన చేసి, దానికి లొంగనివాటిని లక్షణవిరుద్ధాలని చెప్పడం దుస్సాహసం, కవులపట్ల అపచారం, వ్యవహర్తలను అవమానించడం అని చెప్పడం.

భాషాశాస్త్రదృష్టితో వర్ణ, ఉచ్చారణ, సంధి, సమాస సంబద్ధములైన అనేకవిషయాలను చర్చించారు. వీరు భాషను మూడు స్వరూపాలుగా చెప్పారు. గ్రాంథికభాష, శిష్టవ్యావహారికము, గ్రామ్యము. ఇందులో శిష్టవ్యావహారికం ప్రయోగార్హమని అభిప్రాయపడ్డారు. గ్రాంథికం కేవలం ప్రాచీన కావ్యాలకే పరిమితం. గ్రామ్యం ఆయాజాతివారికిమాత్రమే తెలుస్తుంది. శిష్టవ్యావహారికం అందరికి తెలుస్తుంది కాబట్టి అది స్వీకరించాలన్నారు. అంతేకాక గ్రామ్యాన్ని లక్షణవిరుద్ధమనడం తప్పు. లక్షణవిరుద్ధమైనదాన్ని చ్యుతసంస్కారమనే కావ్యంలో శబ్దదోషంగా పరిగణించారు. కాబట్టి లక్షణవిరుద్ధం గ్రామ్యం ఒక్కటికావు అన్నారు. భాషకు శిష్టత్వం అది వాడేవారి శిష్టత్వంపై ఆధారపడి ఉంటుంది. అది దాని స్వభావసిద్ధమైన లక్షణం కాదు. గ్రామ్యమనుకొన్నది శిష్టవ్యవహారంలోకి రావచ్చు, శిష్టవ్యవహారంలోది గ్రామ్యంలో చేరవచ్చు. అలాగే ఒకప్రాంతంలో గ్రామ్యం అనుకొన్నది వేరో ప్రాంతంలో శిష్టవ్యవహారంలో ఉండవచ్చు. ఒకే భాషైనా అన్ని ప్రాంతాల్లోని అచ్చుపోసినట్లుగా ఒకేలా ఉండదు. అలా ఉండటం భాషాస్వభావానికి విరుద్ధం. కాబట్టి వ్యావహారికాన్ని లక్షణంపేరుతో దూరంచేయడం తగదు అని నిరూపించారు.

చివరిగా వారన్నమాట– 'శిష్టానాముక్తౌ సూత్రాణామభావే అనుశాసనకారిణ ఏవ దండనీయాః', కవులప్రయోగాలు, శిష్టవ్యవహారమంతా వ్యాకరణసూత్రాలలోకి రాకపోతే అది వ్యాకర్తలదోషంకాని, కవులదోషంకాదు. వ్యావహారదూరమైన గ్రాంథికాన్ని రక్షించుకోవడం కోసం వ్యవహారసిద్ధమైన భాషాస్వరూపాన్ని కాదనడం అవివేకమని వారి తాత్పర్యం. వారి ప్రయత్నం కేవలం గ్రాంథికానికి బదులు వ్యావహారికాన్ని తేవడమే కాదు, జనవ్యవహారంలో ఉన్నతెలుగు భాషను రక్షించుకోవడంకూడా.

అంతిమంగా తేలిందేమిటంటే– లక్షణవిరుద్ధం గ్రామ్యం ఒకటికాదని, గ్రామ్యం జనవ్యావహారికమని, అదే కవులప్రయోగాల్లోకి వచ్చిందని, దాన్ని ఏదోరూపంలో లాక్షణికులు అంగీకరించారని, జీవద్భాషకు లక్షణం ఎప్పటికప్పుడు మారుతూ ఉండాలని తెలుస్తోంది.

## ఉపయుక్త గ్రంథాలు –


1. ఆంధ్రశబ్దచింతామణి
2. అధర్వణకారికావళి
3. అహోబలపండితీయము
4. బాలవ్యాకరణము
5. ప్రౌఢవ్యాకరణము
6. త్రిలింగశబ్దానుశాసనము
7. బాలకవి శరణ్యము
8. కావ్యాలంకారసంగ్రహము


≻≻≻≻≺≺≺≺

# వాడుక భాషగా తెలుగు : గిడుగు ఆలోచనాసరళి

## Telugu as a Colloquial Language: Ideas of 'Gidugu'

–Prof. Garapati Umamaheswara Rao,
Director, CALTS, Univ. Of Hyd.
Hyderabad – 500 046

నేటికి సరిగ్గా వంద ఏళ్ల కిందట మద్రాసు ప్రెసిడెన్సీ గవర్నరుకు సమర్పించేందుకు ఇంగ్లీషులో రాసిన "ఎ మెమొరాండం ఆన్ మాడర్న్ తెలుగు" అనే కరపత్రంలో వాడుక భాషా సందర్భంలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు వాడుక భాషను గురించిన ఆయన ఆలోచనా సరళికి నిదర్శనం. ఇలాంటి ఆలోచనా సరళి ఆధునిక భాషాశాస్త్ర పద్ధతిలో సాగిన భాషా ప్రణాళికకు ఆనవాలు. అంతేకాదు వ్యవహారిక భాషా ప్రణాలికా సిద్ధాంతానికి మౌలిక రూపం. ఈ ఆలోచనా సరళిని మీ ముందు ఉంచటమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

గిడుగు రామమూర్తి (1913) వ్యవహారిక భాషావాదం –
సిద్ధాంతం – నిరూపణ

**1.0 నేపథ్యం**

సమాజంలో జనసామాన్యానికి అందుబాటులోలేని చదువులు ఉన్న సమయం.
చదువు జ్ఞానార్జనతో బట్టీప్రాయంగా ఉండేది.
చదువు ఇంటిభాషలో గాక వాడుకలో లేని గ్రాంథిక భాషలో సాగేది.
ఇంగ్లీషు విద్యాభివృద్ధిని సాధించడంలో దేశభాషల నిర్లక్ష్యం.
విజ్ఞానాన్ని ప్రజాసామాన్యానికి అందుబాటులోకి తేవడంలో దేశభాషల పాత్ర కనుమరుగు ఔతోంది.

**2.0 లక్ష్యం**

**2.1 ప్రధాన లక్ష్యం**

మాతృభాష మాధ్యమంలో విజ్ఞానం అందించడం.

**2.2 ఉపలక్ష్యాలు**

పాఠశాలల్లో;
పాలనా రంగంలో ఉత్తర్వులలో, వార్తలలో;
వ్యవసాయ, వాణిజ్య, పారిశుద్ధ్య తదితర రంగాలలో సమాచార వినిమయంలో;

తెలుగు సమాజంలో చదువుకున్న వర్గాల వారి వాడుకలో ఉన్న నేటి తెలుగు మాండలికాన్ని ప్రామాణిక భాషగా అంగీకరించి ఉపయోగించడానికి;

**3.0 పునాది రాళ్ళు**

గిడుగు రామమూర్తి తన లక్ష్యమూ, లక్ష్య సాధనలోనూ, నిర్దేశానంలోనూ, వాటి వల్ల చేకూరే ప్రయోజనాల పట్ల స్పష్టత ఉంది. లక్ష్య సాధనకు కావలిసినవి అన్నీ పునాది రాళ్ళుగా మారాయి.

1. అవగాహన 2. అనుభవం 3. సర్వజనామోదం 4. బోధనానుభవం 5. పాలనానుభవం 6. విద్యావిషయక నిర్వహణానుభవం

**4.0 నాటి విద్యావిధానంలో వాడే తెలుగు తత్త్వ నిరూపణ**

1. కృత్రిమ తత్సమ పదజాలంతో కూడిన అనువాద రచనలు; 2. కానరాని వచన రచనలు; 3. ఆశిక్షిత రచయితలు; 4. మొరటు ప్రయోగాలు: తత్సమ ప్రయోగ బాహుళ్యం; 5. జనసామాన్యంతో సాహిత్య సంబంధం తెగిపోవడం; 6. భిన్న ఆధారాల కలగాపులగమైన కృతక భాష; 7. శుద్ధ సంస్కృత పదాలూ, సమాసాలూ; 8. ప్రాకృత పదాలూ; 9. సజాతీయ ద్రావిడ పదాలూ; 10. అన్య దేశ్య పదాలూ; 11. వేయి సంవత్సరాలుగా వాడుతున్న అన్ని తెలుగు పదాలూ; 12. కవి ప్రయోగం ఉంటేనే పదప్రయోగం చేయాలనే బంధం; 13. కృతకమైన అపరిచిత భాష; 14. గ్రాంథిక భాష రూప బాహుళ్యమైనది, అల్ప సంఖ్యాక వర్గం వాడేది;

**5.0 వాడుక భాష**

1. దైనందిన వాడుకలోని భాష, ఇంటి భాష, తోటి వారితో మాట్లాడే భాష, అందరికీ పరిచయమైనా జీవద్భాషగా గుర్తింపు పొందింది;

2. ఆధునిక అవసరాలైన రాతకోతలకు కావలిసిన వచన రచనలు రావడానికి వీలున్న భాష;

3. వచన రచనలోని భాష సర్వోత్తమమూ,శక్తివంతమూ, జాతీయమైన తెలుగనీ వాదన;

4. ప్రసార ప్రభావంఅమోఘం;

5. ప్రాచీన భాష నేటి తెలుగు నుంచి అర్థం కానంత దూరం జరిగింది;

**6. ఉచ్చారణలో మౌలిక తేడాలు**

1. ఇచ్చాను, వచ్చాను మొదలైనచకారయుత అకార ఉచ్చారణ;

2. అనేకానేక పదాలల్ని అంతస్సంధి వల్ల ఏర్పడిన అనేక అచ్చుల ఉచ్చారణ (సవర్ణ రూపాలు)

3. ఆగమ యకార లోపం;

4. అజాకర్షణ; ఊనిక మార్పు; పరుష సరళాల మార్పిడి; అర్థానుస్వార లోపం మొదలైనవి;

**7. రూప నిష్పత్తిలో మార్పులు**

1. బహువచనంలో రూపాంతరాలు;

2. విభక్తి ప్రత్యయాల మార్పు;

3. ప్రాచీన భాషలో క్రియావిశేషణాల కర్తృ ప్రయోగాలలో షష్ఠీ సమాన రూపాలు ఉండగా ఆధునిక తెలుగులో ప్రథమ;

4. భూత, భవిష్యత్కాల నిష్పాదనలో తేడాలు;

5. కర్మణి ప్రయోగాలలో తేడా;

6. సహాయక క్రియల వ్యాకరణ కార్యాలలో తేడాలు;

ఇట్లాంటి విశ్లేషణా పటిమతో సహేతుక, తర్కబద్ధ వాదనా, ఉదాహరణలతో ప్రతిపాదిత సిద్ధాంతమే గిడుగువారి వ్యవహారిక భాషా సిద్ధాంతం. దీన్ని ప్రతిపాదించి వంద సంవత్సరాలు గడిచినా దీని ప్రయోజనమూ, లక్ష్యమూ పూర్తిగా తెలుగు సమాజం సాధించుకోలేక పోవటానికి అనేక సామాజిక రుగ్మతలతోబాటు మన బాధ్యతా రహిత్యమూ కొంత కారణమే.

## సంప్రదించిన రచన


1. రాధాకృష్ణ, బూదరాజు. 1991. నేటి తెలుగు – నివేదిక. (ఎ మెమొరాండం ఆన్ తెలుగు) హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.


>>>><<<<

# వాడుక భాష గురించి కొన్ని వివాదాలు

## Some Arguments on Colloquial Language

– Prof. B. R. Bapuji,
Professor of Linguistics & Sociology,
University of Hyderabad,
Hyderabad – 500 046.

రోజువారీ సంభాషణలు మినహా,మిగతా సమాజిక సందర్భాలలో గ్రాంథిక భాషని ఉపయోగించాలా, వ్యవహారిక /వాడుక భాషని ఉపయోగించాలా– అనే వివాదం ముగిశాక, వాడుక భాషకి సంబంధించే కొన్ని వివాదాలుతలెత్తాయి. ఆ వివాదాన్ని సంక్షిప్తంగా, సామాజిక భాషా శాస్త్ర దృష్టితో చర్చించడమే ఈ పత్రం ఉద్దేశం.

20వ శతాబ్దంలో దేశంలోని ఇతర అన్ని భాషా ప్రాంతాలలో లాగే, తెలుగు మాట్లాడే ప్రాంతంలో కూడా సాంప్రదాయిక మేధావులూ, ఆధునిక మేధావులూ రెండు ప్రధాన శిబిరాలుగా ఉన్నారు. సంస్కృతంలోనూ, తెలుగులోనూకూడా నిష్ణాతులై, ఆ భాషలతో సాంప్రదాయికమైన మమేకత్వం పొందినవారు ఒక పక్కా; సంస్కృతమూ, తెలుగూ మాత్రమే కాక, ఇంగ్లీషుతో కూడా తగినంత పరిచయం కలిగి, సంప్రదాయాన్ని కొన్ని విషయాల్లో ప్రశ్నించే ఆధునికులు ఇంకో పక్కా కనిపిస్తారు. ఈ రెండు శిబిరాల వాళ్ళనీ, ఒకరిని 'సంప్రదాయ వాదులు' అనీ, ఇంకోరిని 'ఆధునిక వాదులు' అనీ అందాం. భాషపట్ల వారికున్న దృక్పథాలని బట్టే మనం వారిని అలా అందాం. భాషేతర అంశాలలో (అంటే ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలలో) వారి దృక్పథాల గురించి మనం ఇక్కడ చర్చించడం లేదు.

సాంప్రదాయిక వాదులకూ, ఆధునిక వాదులకూమధ్య తలెత్తిన మొట్ట మొదటి వివాదమే గ్రాంథిక, వ్యవహారిక భాషా వివాదం. గిడుగు రామమూర్తి లాంటి ఆధునిక వాదుల కృషి ఫలితంగా వ్యవహారిక భాష/వాడుక భాష అనే దానికి ప్రాధాన్యత వచ్చింది.

ప్రతీ వివాదానికీ ఉన్నట్టే, ఈ మొట్ట మొదట భాషా వివాదానికి కూడా సామాజిక (అంటే– ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక) కారణాలు ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైనది; ఆధునిక ఉత్పత్తి విధానాలు ప్రవేశించేటప్పుడు, రకరకాల స్థాయుల్లో జనాలకు చదువులు రావాలి. చదువులు రావాలంటే, అందరికీ అర్థమయ్యే వ్యవహారిక భాషలోనే సాగాలి గానీ, ప్రత్యేకంగా నేర్చుకుంటే గానీ ఉపయోగించడం సాధ్యం

కాని గ్రాంథిక భాషలో కాదు. కాబట్టి, వ్యవహారిక భాషలోనే చదువులు సాగాలి– అనే వాదన మొదలై, గ్రాంథిక భాషావాదులకూ వ్యవహారిక భాషా వాదులకూ మధ్య పెద్ద వివాదమే చెలరేగింది.

వ్యవహారంలో వున్న దానిని వ్యవహారిక భాష అన్నారు. వ్యవహారంలో –అంటే, 'వాడుకలో' అనే అర్థంలో, దాన్ని మనం వాడుక భాష అంటున్నాం. 'వాడుక భాష' అనేదికూడా ప్రాంతాల వారీగా (ప్రాంతీయ మాండలికాలుగా), సామాజిక బృందాల వారీగా (విద్య, సామాజిక హోదా మొదలైన వాటిని బట్టి సామాజిక మాండలికాలుగా) రకరకాలుగా (వెరైటీస్ ఆఫ్ లాంగ్వేజ్‌గా) వుంది.

ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలను బట్టి రకరకాల ప్రాంతాలకూ, సామాజిక బృందాలకూ చెందిన భాషా వ్యవహర్తలు భిన్న దృక్పథాలతో వుంటారు. ఆ భిన్నత్వం భాషా పరమైన కొన్ని వివాదాలకు కారణం అవుతుంది. అలాంటి వివాదాలను– సదస్సు నిడివి కారణంగా కొన్నిటిని మాత్రమే, అది కూడా సంక్షిప్తంగా మాత్రమే ఇక్కడ చర్చించగలం. ఆ వివాదాలు ఇవీ: (1) మాట్లాడే భాషలో పాటించే నియమాల్ని రాసే భాషలో కూడా పాటించాలా, వద్దా? (2) 'తెలంగాణా భాష' అనీ, 'ఆంధ్రా భాష' అనీ జనం అంటున్నది వేర్వేరు భాషలా, ఒకే భాషలో రెండు ప్రాంతీయ మాండలికాలా? (3) సినిమాలలో ప్రాంతీయ మాండలికాన్ని ఉపయోగించడంలో ప్రత్యేకించి ఒక ప్రాంతం వారిని కించపరిచే ఉద్దేశం వుందా? 'వైవిధ్యం'తో (వెరైటీ పేరుతో) వ్యాపారం చేసే ఉద్దేశంఉందా? (4) పాఠ్యపుస్తకాల్లో ప్రాంతీయ మాండలికాలను ఉపయోగించాలా?, ప్రామాణిక భాషని ఉపయోగించాలా?

ఇప్పుడు ఒక్కో వివాదాన్నే చూద్దాం.

మాట్లాడేభాషలోపాటించే నియమాల్ని రాసే భాషలో కూడా పాటించాలా, వద్దా?–ఇదొక వివాదాంశం.

'మాట్లాడే భాషా, రాసే భాషా ఒకటికావు కాబట్టి, మాట్లాడే లాగే, ఆ నియమాల ప్రకారమే, రాయాలనేమీ లేదు. రాసే భాష లక్షణాలు వేరుగా ఉంటాయి' –అని ఒక వాదం.

మాట్లాడే భాష మొదటగా వచ్చింది. ఆ తర్వాతే రాసే భాష వచ్చింది. రాసే భాషకి, మాట్లాడే భాషే ఆధారం. కాబట్టి, మాట్లాడే భాషలో పాటించే నియమాలే, రాసే భాషలోనూ కనిపిస్తాయి, కనిపించాలి. అలా కనిపించకపోతే, చదివేవాళ్ళకి తేలిగ్గా అర్థం కాదు. (రాసిన దాన్ని చదివినపుడు, అది వినేవాళ్ళకి తేలిగ్గా అర్థంకాదు). నియమాలు అంటే ఎవరో పైనించీ మనమీద విధించేవికావు. ఒకేభాష మాట్లాడే–వాళ్ళందరమూ ఒక అలవాటుగా పాటించేసూత్రాలు.

మాట్లాడే భాషలో వుండి రాసే భాషలో కనిపించని కొన్ని నియమాల్ని చూద్దాం.

(1) మాట్లాడేటప్పుడు ధీర్ఘంపలికి,రాసేటప్పుడు దాన్ని చూపక పోవడం.

ఉదా. "అప్పటికి యువకులు వెనుకంజ వెయ్యలేదు." దీన్ని మాట్లాడేప్పుడు,"అప్పటికీ..."అని వుంటుంది. ఈ దీర్ఘం లేకపోతే, వాక్యం అసలు అర్థంకాకుండా పోతుందని కాదు. వెంటనేనూ, తేలిగ్గానూ అర్థంకాదన్నమాట! మొదటిసారి చదవగానే, 'యువకులు, అప్పటిదాకా వెనుకంజ వెయ్యలేదు గానీ, ఆ పని అప్పుడు చేశారు'అనుకుందాం. కానీ, మొత్తం వార్తలో సందర్భం ప్రకారం, ఎన్ని అవాంతరాలు వచ్చినప్పటికీ యువకులు వెనుకంజ వెయ్యలేదన్నమాట!

(2) రెండూ, అంతకంటే ఎక్కువ విషయాల్ని (వ్యక్తులు గానీ, వస్తువులు గానీ, సంఘటనలు గానీ) చెప్పేటప్పుడు ప్రతీ చోటాదీర్ఘాలు పెట్టకపోవడం.(వీటిని 'సముచ్చయ చిహ్నాలు' అంటారు.)

ఉదా. "పెండే కంటి, అంజయ్య నేడు నగరానికి రాక"అని రాస్తే, దాన్ని చదివినప్పుడు గానీ, విన్నప్పుడు గానీ, ఇద్దరు వ్యక్తుల గురించి చెబుతున్నారని వెంటనే అర్థం కాదు. 'పెండే కంటి అంజయ్య'అనే ఒకాయన రాక గురించిన వార్త అనుకుంటారు. పెండేకంటీ,అంజయ్యా నేడు నగరానికి రాక 'అంటే తేలిగ్గా లేదూ!. అలాగే, ఒక తల్లీ పిల్లల్ని గురించి రాసేటప్పుడు "సావిత్రీ పిల్లలూ బాగున్నారు"అని 2 చోట్లా దీర్ఘాలు రాసినప్పుడు స్ఫురించే అర్థం, 'సావిత్రి, పిల్లలు బాగున్నారు'అని రాసినప్పుడుస్ఫురిస్తుందా?

(3)అవసరమైన చోట్ల విభక్తి చిహ్నాలు పెట్టక పోవడం.

ఉదా. "సువార్తమ్మ, చంద్రయ్యను చూశా. సువార్తమ్మ కత్తి చంద్రయ్యను కొడుతున్న సమయంలో, చెరువు సమీపంలో తేళ్ళ జడ్సన్ కూడా వున్నారని పేర్కొన్నారు." ఈ ఉదాహరణలో, రెండు చోట్ల 'నూ' అనే సముచ్చయంతో కలిసిన విభక్తి చిహ్నం లేకపోవడం వల్లా, రెండు చోట్ల సముచ్చయ చిహ్నం లేకుండా, కేవలం 'ను' అనే విభక్తి ప్రత్యయం పొట్టిగా వుండడం వల్లా ఎవరు ఎవర్ని కొట్టారో తెలీదు. అసలు జరిగింది, 'సువార్తమ్మనూ, చంద్రయ్యనూ అగ్ర కులస్తులు కొట్టారు.'

అలాగే, బహువచనంలేని విభక్తి చిహ్నాల తప్పులు కొన్ని. ఉదా. "సోనియా, పవార్‌కి పరోక్ష హెచ్చరిక. " దీన్ని బట్టి, సోనియాయే పవార్‌ని హెచ్చరించిందని అర్థం వస్తుంది. కానీ వాళ్ళిద్దర్నీ ఇతరులు హెచ్చరించారన్నది అక్కడి సందర్భం.

విభక్తులకు సంబంధించే ఇంకో రకపు లోపం:

షష్ఠి విభక్తి చిహ్నాలు రాయకపోవడం. ఉదా. "లెక్చరర్లు, టీచర్ల భర్తీలను పూర్తి చెయ్యాలి: ఎబివిపి డిమాండ్." 'లెక్చరర్లా, టీచర్లా'అని ఉంటే ఎంత స్పష్టంగా వుండేది! ఇంకో ఘోరమైన ఉదా. "జైల్ సింగ్, రాజీవ్ హత్యకై బెదిరింపు." ఇందిరాగాంధీకి నమ్మినబంటునని ప్రకటించుకున్న వ్యక్తి, ఆమె కొడుకుని

హత్య చేస్తానని బెదిరిస్తాడా? ఎవరో వాళ్ళిద్దర్నీ బెదిరించారన్నమాట! అలాంటప్పుడు, 'జైల్ సింగూ, రాజీవుల హత్య కై బెదిరింపు' అని రావాలి.

(4) 'బడు' వాక్యాలు రాయడం

వాడుక భాషా పద్ధతికి వ్యతిరేకంగా వున్న లక్షణాలలో బడు ప్రయోగాన్ని తీవ్రంగావ్యతిరేకించిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి గారు. ఆయన నించే నేర్చుకుని, నిలకడగా ఆచరించ వలసిన అంశం ఇది. పత్రికా రచనలో భాషా ప్రయోగాల గురించి ఒక భాషా వేత్త రాసిన వాక్యం చూడండి. "అటువంటి పద్ధతులు కొన్ని, ఈ వ్యాసంలో పరిశీలించబడతై. "“...ఈ వ్యాసంలో పరిశీలిస్తాను"– అంటే ఏం బోయింది? పోనీ, బాధ్యతనంతా తన మీద వేసుకోడం ఇష్టం లేకపోతే, "... ఈ వ్యాసంలో పరిశీలిస్తాము" అనవచ్చును గదా? అలాగే, "ఈ విషయం పూర్వాధ్యాయంలో వివరించబడింది" అట! 'వివరించాను' లేదా 'వివరించాము'– అంటే ఎంత తేలిగ్గా వుంటుంది?

ఈ ఉదాహరణల్ని బట్టి, వెంటనేనూ, వేగంగానూ, తేలిగ్గానూ వారికీ/అర్థం అయ్యేలా రాయాలంటే, మాట్లాడే భాషలో పాటించే నియమాల్ని/సూత్రాల్ని పాటించాలనేది రుజువు కావడం లేదూ?

ఇప్పుడు ఇంకో వాదం

"తెలంగాణా భాష"అనీ, "ఆంధ్రా భాష"అనీ జనం గానీ, ఉద్యమ నాయకులు గానీ అంటున్నవి వేర్వేరు భాషలా, ఒకే భాషలో రెండు ప్రాంతీయ మాండలికాలా?– అవి ప్రాంతీయ మాండలికాలే అనేది స్పష్టం. శాస్త్ర దృష్టి లేని వాళ్ళూ, తమ ఉద్యమానికి సమర్ధనగా కొత్త వాదనలు సమకూర్చుకుందామనుకునే రాజకీయ నాయకులూ మాత్రమే మాండలికాలను పట్టుకుని వేర్వేరు భాషలుగా నినదిస్తారు. అవి నిజంగా వేరే భాషలైతే, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడమే సాధ్యం కాదు. ఉచ్చారణలో కొన్ని చోట్లా, కాలాన్ని సూచించే కొన్ని ప్రత్యయాల దగ్గిరా, ఒకే అర్థానికి ప్రాంతీయంగావేరు పదాలూ –ఇలాంటి కొన్ని తేడాలని పట్టుకుని, వేరే భాషలనడం అర్థరహితం. అలాంటి నినాదానికి జవాబు: "వేరే రాష్ట్రం అడగండి! వేరే భాష అనకండి!"

మరో వివాదం

సినిమాలలో ప్రాంతీయ మాండలికాల్ని ఉపయోగించడంలో– ప్రత్యేకించి; ఒక ప్రాంతం వారిని కించ పరిచే వుద్దేశం ఉందా? 'వైవిధ్యం'తో (వెరైటీ కోసం) వ్యాపారం చేసే ఉద్దేశం ఉందా?– ఈ రకం వివాదం, ప్రధానంగా ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సందర్భంగా మొదలైంది. గత 10ఏళ్ళుగా అప్పుడప్పుడూ ఉద్యమకారులు అంటున్న దాన్నే ఇటీవల ఒక నాయకుడు కూడా అన్నట్లు వార్తల్లో వచ్చింది. ఆ వార్త చూడండి: ఈ సందర్భంగా కె. సి. ఆర్. మాట్లాడుతూ, ఆంధ్రోళ్ళు తెలంగాణా భాషను కూడా తక్కువ చేసి మాట్లాడుతున్నారనీ, సినిమాల్లో హీరోహీరోయిన్లకు ఆంధ్రభాషనూ, జోకర్లకూ విలన్లకూ తెలంగాణా

భాషనూ వాడుతుండడం అంటే వారిని కించపరచడమేననీ ఆయన అన్నారు." (ఆంధ్రప్రభ. 22-09-2013)

ఎవరైనా ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే: కొంత పెట్టుబడి పెట్టి, దానికి ఎన్నో రెట్లు సంపాదించాలనే ఏకైక లక్ష్యంతో నడిచే సినిమా వ్యాపారస్తులెవరూ, ఒక ప్రాంత యాసనీ, వాడుకనీ కించపరచడంకోసం లక్షలూ, కోట్లూ ఖర్చు పెట్టరు. సినిమా వ్యాపారంలో– అన్ని వ్యాపారాలకంటే కూడా– వెరైటీకి (మార్పుకీ, కొత్తదనానికీ, వైవిధ్యానికీ) ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అందుకే, సాంఘిక సినిమాలలో, తొలినాళ్ళలో, 1950ల తర్వాత కృష్ణా, గుంటూరు మాండలికాల్నీ; గోదావరీ, విశాఖల మాండలికాల్నీ; ఆ తర్వాత తెలంగాణా మాండలికాన్నీ; చివరికి ఫ్యాక్షనిజం మీద తీసిన సినిమాలలో కడపా, కర్నూలూ ప్రాంత మాండలికాన్నీ విలన్లకూ, జోకర్లకూ, వెరైటీ కోసం (అంటే కొత్త రకం పద్ధతుల్లో లాభాలు సంపాధించటం కోసం) వాడుతూ వచ్చారు. తొలినాళ్ళ నుంచే తెలంగాణా మాండలికాన్నీ వాడలేదు. పైగా, హీరోహీరోయిన్లకు వాడింది ఆంధ్ర మాండలికం కాదు. ప్రామాణిక భాషని వాడారు. ఆ ప్రామాణిక భాష ఆంధ్ర మాండలికం కాదు.

సినిమా పెట్టుబడి దారులు ఏదిచేసినా, ఒక ఫార్ములా ప్రకారం, పక్కా వ్యాపార దృష్టితోనే చేస్తారు. వ్యక్తిగతంగా, ఒక నిర్మాతకి లేదా రచయితకి ఇతర మాండలికాల పట్ల (ఉదా|| ఆంధ్ర మాండలికం మాట్లాడే సినిమా వ్యక్తికి, తెలంగాణా మాండలికం పట్ల) చిన్నచూపు ఉండదని కాదు. కానీ, కోట్లతో వ్యాపారం చేసేవాళ్ళు ఇంకో మాండలికాన్ని కించపరచడానికి కోట్లు ఖర్చు పెడతారని వాదించడం ఆర్థికశాస్త్ర రీత్యా అర్థరహితం.

<u>చివరిగా, చాలా ముఖ్యమైన వివాదం</u>

పాఠ్య పుస్తకాలలో ప్రాంతీయ మాండలికాలను ఉపయోగించాలా, ప్రామాణిక భాషని ఉపయోగించాలా? ప్రత్యేక తెలంగాణా ఉద్యమ క్రమంలో 9ఏళ్ళ క్రితం(2004లో) ఈ విషయం పై 'ఇంటి భాష పేరుతో చర్చ ప్రారంభమైంది. ఇటీవల (22-09-2013న) జరిగిన 'అఖిల భారత తెలంగాణా రచయితల మహాసభల్లో చేసిన తీర్మానంలో "తెలంగాణా భాషను మన పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెట్టాలన్నారు." (ఆంధ్రజ్యోతి. 23-09-2013).

ఈ అంశం గురించి, నేను వేరేచోట చెప్పినదాన్ని, తిరిగి ఇక్కడ చెప్పడం అసందర్భం కాదు. ఈ వివాదానికి అదే చెప్పవలసి వస్తుంది. 'ఇంటి భాష' లో విద్యాబోధన గురించి రామయ్యగారూ, ఇతరులు చేసిన చర్చను గమనించాక, రెండు ప్రశ్నలు తలెత్తుతాయి. (1) మాండలికాల్లో విద్యాబోధన వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? (2) ప్రామాణిక భాషలో విద్యాబోధన వాళ్ళ కలిగే ప్రయోజనాలు ఏమిటి?

మాండలికాల ద్వారా అయితే విషయాలు తేలిగ్గా అర్థం అవుతాయి. పరాయితనం ఉండదు. ఇప్పటికే ఏర్పడి, కొనసాగుతున్న ప్రామాణిక భాషద్వారా అయితే వర్ణ విస్తృతి – మాండలికాలకే పరిమితం కాని వర్ణాలతో – ఫోనెమిక్ ఇన్వెంటరీతో – పరిచయమూ, వినియోగమూ సాధ్యం. అలాగే, మాండలికాల మధ్య క్రమంగా ఒక రకమైన ఏకత్వం (భాషాపరంగా) ఏర్పడడానికి మార్గం ఏర్పడుతుంది.

మాండలిక ప్రయోగాలను కించపరచకుండానూ, వాటిని బట్టి భాషా నైపుణ్యాన్ని అంచనా కట్టకుండానూ, ప్రామాణిక భాషలో విద్యాబోధన జరిగితే కొన్నాళ్ళకి 'ప్రామాణిక భాష' అనే మాట పోయి 'ఉమ్మడి భాషా ప్రయోగం' అనేది ఏర్పడుతుంది. ఇది జరగాలంటే ప్రామాణిక భాషను గురించిన దురభిప్రాయాలు తొలగాలి.

తెలుగులో ప్రామాణిక భాష – లేదా ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ప్రామాణిక మాండలికం – ఏ ఒక్క మాండలికానికి చెందినది కాదు. మధ్య కోస్తా ఆంధ్ర ప్రాంతంలో, పట్టణవాసులైన, ఎగువ మధ్యతరగతికి చెందిన విద్యావంతులు కుటుంబ సభ్యులతో కాక, బహిరంగ వేదికలలో (ఉపన్యాసాలలో, రేడియోలో, టీవీలలో, సినిమాలలో, పత్రికల్లో, సాహిత్య రచనలలో) వాడే భాషగా ప్రామాణిక భాషని సామాజిక భాషా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనర్థం, మధ్య కోస్తా ప్రాంతం వాళ్ళంతా ప్రామాణిక భాష మాట్లాడరు. ఉదా|| 'చ' బదులు కొన్నిచోట్ల 'స' (చాప/సాప) ఉచ్చరించడం; పద ప్రారంభంలో 'వె'ని ఉచ్చరించకపోవడం (వెళ్ళు/ఎళ్ళు), ఒత్తులు పలక్కపోవడం (భయం/బయం), మూర్ధన్యాలను పలక్కపోవడం (వీణ/వీన), సంయుక్తాక్షరాలున్న శబ్దాల్ని పూర్తిగా/సరిగా పలక్కపోవడంపలక్కపోవడం (సత్యనారాయణ/సచ్చనారాయణ)– ఇవి ప్రాంతాలకు అతీతంగా భాషా వ్యవహార్తల్లో కనిపించే లక్షణాలు. అలాగే, కాల సూచికల్లో (టెన్స్ మార్కర్స్ లో) కూడా (వస్తున్నాడు, వస్తన్నాడు, వత్తన్నాడు, అత్తన్నాడు).

ప్రామాణిక భాషలో విద్యాబోధనకి వ్యతిరేకంగా, మాండలికంలోనే జరగాలనే వాదనకి మూలం ప్రామాణిక భాష గురించి, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వివిధ ప్రాంతాలవారికున్న అవగాహన లోపమే. ప్రామాణిక భాష అనేది కోస్తాంధ్ర భాష అని ఇటు తెలంగాణా ప్రాంతంలోనూ, అటు కోస్తాంధ్ర ప్రాంతంలోనూ కొందరు మేధావులు దురభిప్రాయపడడం ఒక కారణం. ఈ దురభిప్రాయానికి అంతర్లీనంగా ఉన్న కారణం రెండు ప్రాంతాల మధ్య ఉన్న 'అసమానతలూ', తద్వారా ఏర్పడిన వైరుధ్యాలే. కాబట్టి, ఈ వైరుధ్యాలు సమసే వరకూ, భాషకి సంబంధించిన ఈ వివాదం సాగుతూనే ఉంటుంది.

>>>><<<<

# గిడుగు రామమూర్తిపంతులుగారి 'నేటితెలుగు–నివేదిక'

## *Memorandum on Modern Telugu* of Gidugu Ramamurti Pantulu

– Dr. P. Ramulu,
Reader, Dept. Of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.

తెలుగు సాహిత్యంలో వచ్చిన అపూర్వ చైతన్యానికి ప్రాతినిధ్యం వహించిన రచయితలు 19వ శతాబ్దంలో సాహిత్యానికి కొత్త సొబగులు అద్దినట్లే, సాధారణప్రజలు సహితం అర్థంచేసుకోవడానికి, అత్యంత సులభంగా తమభావాలను వ్యక్తీకరించడానికి, ఆధునికభాష ఉపకరించాలని ఉద్యమించిన ప్రజాభాషా వ్యావహారికుడు గిడుగు. భావవ్యక్తీకరణ సాధనలో భాషను ఎంత సమర్థవంతంగా, అర్థవంతంగా అత్యాధిక ప్రజలకు చేరువయ్యే విధంగా బోధించాలో, రాయాలో విశదపరిచే కృషిని ఉద్యమస్థాయిలో నిర్వహించిన భాషాపరిశోధకుడు గిడుగు. భాషావ్యవహార స్వరూపాన్ని ప్రాచీనాధునిక దశల లక్షణాలను విశ్లేషించిన గొప్పచారిత్రక విశ్లేషకులు గిడుగు.

ఆయన ఇంగ్లీష్‌లో రూపొందించిన Memorandum on Modern Teluguకు తెనుగీకరణే 'నేటితెలుగు – నివేదిక'. విద్యాలయాల్లో నేర్పుతున్న అంశాలనుగూర్చి ముఖ్యంగా భాషాశిక్షణగూర్చి 1901లో లార్డ్ కర్జన్ అధ్యక్షతన ఒక కమిటి ఏర్పడి విద్యాభివృద్ధి స్థితిగతులను సమీక్షించింది. "అది ప్రాథమికస్థాయి నుండి విశ్వవిద్యాలయాల స్థాయివరకు విద్యావ్యవస్థ తీరుతెన్నులు పరిశీలించింది. అది సమర్పించిన నివేదికలో విద్యార్థులు తాము సంపాదించిన జ్ఞానాన్ని మాతృభాషలో ప్రజలకు అందజేయడంలేదని, విద్యావిధానమంతా ఇంగ్లీష్ నేర్చుకోవడానికే ఉపయోగపడుతుందనీ, అంచేత, తామునేర్చిన దానిని, వారు తమ ప్రజల్లో వ్యాప్తిచేసే పద్ధతిలేదని, అటువంటి సామర్థ్యం వారు సంపాదించలేకపోతున్నారనీ, దానిని సరిదిద్ది అనేక ఉన్నత పాఠశాలలోనూ, కాలేజిలలోనూ, మాతృభాషలో వ్యాసరచన ఇంగ్లీషునుండి మాతృభాషలోకి అనువాదం నిర్బంధాంశాలను పెట్టాలని సూచించింది. ఈ విద్యావిధానం జయప్రదం కావడానికి తెలుగు బోధనను సులభం చెయ్యడం తప్పనిసరి"(గురజాడ అసమ్మతి పత్రం పేజి – XIV). అందువల్ల, విద్యావిధానంలో మార్పులు తీసుకురావాలని భావిస్తున్న బ్రిటీష్ అధికారవర్గ అభిప్రాయాలను అమలుజరిపే కృషిలో భాగంగా

W. A. ఏట్స్ విశాఖపట్నంలో తెలుగు నేర్చుకోవాలని సంకల్పించినప్పుడు సామాన్య ప్రజలు వ్యవహారభాషకు, కళాశాలల్లో బోధించే తెలుగుకు మధ్య విపరీతమైన ఆంతరం ఉండడం గమనించారు. తనమిత్రుడైన శ్రీనివాసయ్యంగార్‌తో జరిపిన చర్చల ఫలితంగా గురజాడ, గిడుగుల భాషా సాహిత్యకృషిని గూర్చిఆయన అనేక విషయాలు తెలుసుకున్నారు.

ఆనాటి ప్రజాసామాన్యంలో నూటికి 92 మంది నిరక్షరాస్యులుగాఉన్న సమాజంలో ప్రజలకు ఎటువంటి తెలుగును నేర్పాలనే విచికిత్స బయలుదేరింది. కొంతమంది పండితులు ప్రజలతో ఏమాత్రం సంబంధంలేకుండా క్లిష్టమైన కావ్యభాషలోరాస్తూ ఉండడం, అటువంటి భాషని పాఠశాలల్లో నేర్పడం వల్ల ప్రజలకు మేలు కలగడంలేదని ఆనాటి బ్రిటీష్ పాలకులు, సంస్కరణాభిలషులైన గిడుగు, గురజాడ, శ్రీనివాసయ్యంగార్ లాంటి కొద్దిమంది భావించారు. ఈ సమస్యను అధ్యయనం చేయడానికి ఏర్పడిన కమిటిలో గురజాడ, గిడుగు, వేదం వెంకటరాయశాస్త్రి, కొక్కొండ వేంకటరత్నంపంతులు, కొమర్రాజు లక్ష్మణరావుగారు సభ్యులు. అధ్యయన, అధ్యాపనాల్లో సామాన్యభాషను ఉపయోగించాలని చేసిన వాదానికి వివిధసందర్భాలలో మెజారిటీ సమ్మతి లభించలేదు. గిడుగు వెంకటరామమూర్తి, గురజాడ వెంకట అప్పారావులలోని 'GV'ని గ్రామ్యవాదులుగా నాటి పండితులు అవహేళన చేశారు. అయినా, తమవాదంలోని హేతుబద్ధతను గుర్తించిన గిడుగు, గురజాడలు తమతమ వాదాలను బలంగా వినిపించడానికి తమ భావనలోని సహేతుకతను అర్థం అయ్యేట్టు వివరించడానికి విశేషంగా కృషిజరిపారు.

నేటి తెలుగునివేదికలో గిడుగు అనేక ఆధునిక భావాలకు అంకురార్పణ చేశాడు. భాష ఎవరికోసం ఉపయోగపడాలనే మౌలిక ప్రశ్ననుండి, సమాజంలో అత్యధిక ప్రజలు సులభంగా నేర్చుకోగలిగిందీ, దానివల్ల ప్రయోజనం పొందాల్సిందీ ఎవరనే విషయాలనూ గిడుగు రూపొందించిన నివేదికలో చూడవచ్చు. ఈనాటికీ విశ్వవిద్యాలయస్థాయిలో భాషాసాహిత్య ప్రయోజనాలపట్ల, వాటిని నేర్పడంలో తీసుకోవలిసిన మెళుకువలపట్ల ఒకస్పష్టత కనిపించదు. ఆనాడు ప్రజాబాహుళ్యానికి విస్తృతస్థాయిలో విద్యను అందించాలని బ్రిటీష్ ప్రభుత్వం సంకల్పించినపుడు, ఎటువంటి తెలుగు నేర్పాలనే అంశంపై నాటి ఉద్దండపండితులైన పండితులలో తీవ్రంగా వాదించి, సులభ అవగాహనకు సాధ్యమైన భాషను నేర్పాలని పండితులను ఒప్పించడానికి గిడుగు, గురజాడలు నిర్వహించిన కృషి నిరుపమానమైనది.

సమాజంలో అన్నిరంగాల్లో కొత్తచైతన్యం, కొత్త మానవ సంబంధాలు, వివిధ ప్రదేశాలతో అనుసంధానాలు అవసరమవుతున్న సందర్భంలో, ప్రాచీన కావ్యభాషను నేర్పడంవల్ల, తామునేర్చిన చదువు నిత్యవ్యవహారానికి ఉపకరించకుండాపోతుందని గిడుగు వాదించాడు. రైల్వేసౌకర్యం వృద్ధిచెందుతున్న

సమయంలో సామాన్య రైతులు ఇతర ప్రాంతాలతోనూ, ప్రజలతోనూ సంబంధాలను, వృద్ధిచేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు." (నేటి తెలుగు నివేదిక. పేజి-24). అంతేకాదు, ఆనాడే దళితవర్గాలకు విద్యాబోధన అందించే సమయంలో సహితం ఎటువంటి భాషవల్ల ప్రయోజన ముంటుందో గుర్తింపజేశాడు. "ఒకహరిజనుడు(?) ఉన్నత వర్గాలవారితో వారిమాండలికంలోనే మాట్లాడటం నేర్చుకుని, ఆ మాండలికంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించగలిగి ఆ మాండలికంలోనే చదవడంకూడా నేర్వడంకన్నా ఎంత అత్యాశాపరుడైన సంఘ సంస్కర్త అయినా అపేక్షించేదేముంది? (p-21). ప్రభుత్వంవారి ఆశా, నిరీక్షణలన్నీ నెరవేరతాయి. అప్పుడే, తెలుగుజాతికి చెందినా ప్రజాబాహుళ్యం చిట్టచివరకు ఒకఅస్తిత్వం సంపాదించుకో గలుగుతుంది. అందుకోసం పాఠ్యగ్రంథాలు సులభంగా అర్థమయ్యే రీతిలో రచించినపుడే ఈ లక్ష్యంనెరవేరుతుందని గిడుగు విస్పష్టంగా విశదపరిచాడు.

తన లక్ష్యాలు నెరవేరాలంటే, ఆధునిక విద్యాబోధన పద్ధతులు అనుసరించినపుడే భాషాగ్రహణ శక్తి అమితంగా వృద్ధిచెందుతుందని గిడుగు గుర్తించగలగడం, ఆయనలోని హేతుబద్ధ దృక్పథాన్ని విశదపరుస్తుంది. ఆ క్రమంలోనే, జ్ఞాపకశక్తిపై ఆధారపడిన విద్యనూ నిరసించాడు. భారతీయ విద్యావిధానం జ్ఞాపకశక్తిపై ఆధారపడి ఉండడమే దాని ప్రధానబలహీనత. చదువుకోవడానికి, రాయడానికీ కావలిసిన ఉపకరణాలు అపరిమితంగా ఉండటంవల్ల జ్ఞాపక సంప్రదాయంపై ఆధారపడ్డారని, ఎంతగా సమర్థించుకున్నా వాస్తవ అవగాహనకు, విషయ గ్రహణానికి, తర్కబద్ధపరిశీలనకు అనేకపరిమితులను, విధించిందన్న అంశాన్ని గిడుగు, గురజాడలు గుర్తించారు. దళితవిద్యార్థులకు సహితం, బ్రాహ్మణులతో సమానమైన పరిసరాలు వృద్ధిచెందినట్లయితే వారు భాషాసామర్థ్యాన్ని సులభంగా పొందగలుగుతారని ఉన్నతవర్గాలతో సమానమైన నాగరికత సంస్కృతులు సామాన్యప్రజలకు వెంటనే అందకపోయినా, కనీసం, భాష అవరోధాలు ఏర్పడకుండా చూడవలిసిన బాధ్యత సంస్కర్తలపై ఉందని గిడుగు విశదపరిచాడు. అందుకు అధ్యయనం ఎలాఉండాలనే అంశంపై గిడుగు ఒక స్పష్టతను అందించాడు. "చదవడమనే ఒక కేవల విద్యను, నేర్పడానికి వినియోగించిన మొత్తం సమయాన్ని అతడు వస్తువులను పరిశీలించి తెలుసుకోగల సామర్థ్యాన్ని ప్రోత్సహించడంద్వారా, అతడి వాస్తవిక జ్ఞానాన్ని విస్తరించడానికి వినియోగించినట్లయితే, సంభాషణలద్వారా తెలియజేసినట్లయితే, తానిప్పటికే తెలుసుకో గలిగినదానికన్నా ఎన్నోవిషయాలను సంవత్సరకాలంలో విద్యార్థి జీవితంలోనేర్చుకోగలడు." (p-20). జ్ఞానం సామాన్య ప్రజలకోసం అయినపుడువారికి అర్థంకాని భాషలో ఎందుకు రాయడం, నేర్పడం? అని ప్రశ్నించాడు.

గిడుగు అద్భుత పరిశోధకుడు. ఆయాభాషావ్యవహర్తలు, అత్యంత సన్నిహితంగా భాషలో ఎలా నైపుణ్యం సంపాదించాలో ఆయన చక్కగా విశదపరిచాడు. సవరభాషను నేర్చుకునేపుడు, వారిభాషకు, వ్యాకరణం రచించినపుడు సవరలతో ఏర్పడిన గాఢమైన అనుబంధంతో ఎన్నోవిశేషాలను నేర్చుకోగాలిగాడు. భాషను నేర్చుకునేశక్తీ, తిరిగి వ్యక్తీకరించే నైపుణ్యం ఎలా సహజంగా అలవాడుతాయో,

ఆధునిక భాషాశాస్త్రజ్ఞులలో అగ్రగణ్యుడైన Noam Chomsky వెలువరించిన అభిప్రాయాలతో సమానంగా ఉంటాయి గిడుగు ఆలోచనలు. "చిన్నపిల్లలు దేశభాషలో మాట్లాడడం నేర్చుకునేది సహజపద్ధతిలో పొందేశిక్షణవల్ల. పసివాడితోబాటు, అతడి భాషాశక్తీ ప్రవర్ధమానమవుతుంది. అది మేధ పరివర్తనలో భాగం. బహుశ, అతడి శరీర వ్యవస్థలో కూడాకావచ్చు. అతడి అస్తిత్వ లక్షణంలోనే అది భాగమైపోతుంది." (p-17). అటువంటి గ్రహణశక్తిగల విద్యార్థులకు భాషలో నైపుణ్యం కలిగించడానికి ఆధునిక విద్యాబోధన పద్ధతులను అనుసరించాలని గిడుగు ఉద్బోధించాడు.

గిడుగు ఈ నివేదిక రూపొందించిన సమయంలోనే శ్రీ శ్రీనివాసయ్యంగార్ Life or Death- A Plea for vernaculars అనే పత్రాన్ని తయారుచేశారు. అందులోనూ, వ్యావహారిక భాషకు జీవం పోయాలని, కావ్య భాషను నేర్పడంకాకుండా, విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయుక్తమైన భాషను నేర్పాలని విశదపరిచారు. వీరిద్దరి భావాలకు మరింత సమగ్రత్వం ఇస్తూ గురజాడ The minute of Dissent to the report of the Telugu composition commission అన్న నివేదికను సమర్పించారు. ఇందులో పరీక్షలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులురాసే సమాధానాలు ఎటువంటి భాషలో ఉండాలనే విషయంగురించి తన అభిప్రాయాలను విపులంగా చర్చించారు.

ఈ సంస్కర్తల అభిప్రాయాలకు నాటి సమాజంలో వెంఠనే ఆమోదం లభించకపోయినా, ఉత్తరోత్తరా, వారి వాదంలోని సామంజస్యాన్ని లోకమంతా గుర్తించి, పఠన పాఠనాదుల్లో ఉపయోగించడంవల్ల వారి కృషి నిరంతర స్మరణీయమైనది.

## ఆకర గ్రంథాలు


1. రాధాకృష్ణ, బూదరాజు. 1991(ప్ర.ము). నేటి తెలుగు-నివేదిక. హైదరాబాదు: విశాలాంధ్ర ప్రచురణాలయం.

2. వేంకట రామమూర్తి, గిడుగు, 1879(ప్ర.ము). ఆంధ్ర పండిత భిషక్కులభాషాభేషజం, విజయవాడ: విశాలాంధ్ర...


>>>><<<<

# గిడుగు భాషాదృక్పథం

## `Gidugu's' Perception on Language

– Dr. M. Sampat Kumar,
Department of Telugu,
University of Madras,
Chennai.

## 0. పరిచయం

గిడుగు రామమూర్తిది బహుముఖ వ్యక్తిత్వం. ఆయన పేరు చెప్పగానే అందరికి స్ఫురించేది వాడుక భాషా ఉద్యమం. సవర భాషతో ప్రారంభించిన ఆయన సేవ నేటి వాడుక భాషా వరకు సాగింది. ఈ మొత్తం పరిణామాలని గమనిస్తే ఆయన భాషాదృక్పథాన్ని భాషకు సంబంధించిన ఆయన నిశిత పరిశీలనను భాషా శాస్త్ర రీత్యా ఒక భాషను ఏవిధంగా విశ్లేషించాలన్న విషయాన్ని, భాషను సామాన్య ప్రజలకు ఉపయోగపడేటట్లు ఏవిధంగా చేయాలనే తపనను గమనించవచ్చు. ఈ విషయాలు ఆయనకున్న భాషా దృక్పథానికి సంబంధించినవి.

## 1. సవరలు – భాష, సేవ

గిడుగు రామమూర్తి తెలుగులో మొట్టమొదటి భాషా శాస్త్రవేత్త. భాషను ఆధునిక కాలానికి ఏవిధంగా ఉపయోగించుకోవాలన్న విషయంపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. అంతకు మించి ఆయన మానవతావాదం, ఆయన భాషాదృక్పథాన్ని మరింత పటిష్టం చేయడానికి ఉపయోగపడింది. అందువల్లే, ఆయన సవర భాషకు, ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసాడు. భాషను కూడా ఆయన మానవతా దృక్పథంతో ఆలోచించారు. ఆయన బి. ఎ. ముగించేనాటికి ఆయనకు పర్లాకమిడి చుట్టూ ఉన్న కొండలలో నివసించే సవరలపై దృష్టి మళ్ళింది. విద్యా గంధం లేకుండా కొండలలో నివసిస్తూ దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఆకలితో, అనారోగ్యంతో, జీవన్మరణాల మధ్య బతుకీడుస్తున్న సవరలపై ఆయనకు విపరీతమైన జాలి కలిగింది. వాళ్ళను చైతన్యవంతుల్ని చేయడానికి కంకణం కట్టుకొన్నాడు. వాళ్ళ భాషలోనే సవరలకు చదువు నేర్పించాలని సంకల్పించాడు. అందుకు గాను తాను ముందుగా సవర భాషను నేర్చుకోవాలనుకున్నాడు.

1892లో సవర భాష నేర్చుకోవడం ప్రారంభించాడు. సవర భాష నేర్చుకోవడం కోసం సవరలతో కలిసి జీవించడం ప్రారంభించాడు. సవరలు ఇతర ప్రజలను తమతో చేర్చుకోవడానికి అంత సులభంగా అంగీకరించరు. గిడుగు రామమూర్తి ఎంతో కష్టపడి వాళ్ళలో ఒక్కడిగా మారి సవర భాషను

నేర్చుకొన్నాడు. వాళ్లకు వాళ్ళ భాషలోనే విద్య నేర్పడం మొదలుపెట్టాడు. ఆ తరువాత తెలుగు – సవర నిఘంటువులను తయారు చేసాడు. సవర పాటలు, సవర కథలు సేకరించాడు. సవర వ్యాకరణం రచించాడు. సవరలు ఉన్నప్రాంతంలో వాళ్ళ కోసం బడులు పెట్టించాలని ప్రభుత్వానికి ఎన్నో ఉత్తరాలు రాశాడు. తనే సొంత డబ్బుతో సవర పిల్లల కోసం బడులు కట్టించి, బట్టలు ఇప్పించి చదువు చెప్పించేవాడు. ఈయన ప్రయత్నం వల్ల ప్రభుత్వంలో కొంత కదలిక ఏర్పడింది. ఈయన రాసిన సవర వాచకాలు, నిఘంటువులు, కథలు, సామెతలు, వ్యాకరణం అన్నీ ప్రభుత్వం అచ్చువేసింది. లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అనే గ్రంథంలో సవర భాషను గురించి రాస్తూ "దీనికి సంబంధించిన నిఘంటువు, కథలు, పాటలు రావుసాహెబ్ జి. వి. రామమూర్తిపంతులుగారు రచించారు. ప్రభుత్వం వారు అచ్చువేసి ప్రకటించారు. కాని ఇవి తెలుగు లిపిలో, తెలుగు తర్జుమాలో ఉన్నందున తెలుగు తెలిసిన వారికేగాని ఇతరులకు ఉపకరించదు. ఆంగ్ల భాషలో రచితములై ఉండినయెడల భాషాతత్వ వేత్తల కుపకరించి ఉండును"(మరోసారి గిడుగు రామమూర్తి, వ్యాసాలూ లేఖలు పేజి. 3)అని గ్రియర్‌సన్‌రాశారు. 1928లో మిస్ మన్రో అనే ఇంగ్లిష్ మిషనరీ సవరలున్న కొండల్లో పనిచేయాల్సివచ్చింది. ఆమె సవర భాషను నేర్చుకోవడానికి గిడుగును ఆశ్రయించారు. అప్పటికి ప్రభాత్వానికి సవర భాషకున్న ప్రాముఖ్యం అందుకోసం శ్రమించిన గిడుగు రామమూర్తి ప్రాధాన్యం తెలిసి వచ్చింది. ఇంగ్లిష్‌లో సవర – ఇంగ్లిష్, ఇంగ్లిష్ – సవర నిఘంటువుల్ని, సవర వ్యాకరణాన్ని సవర కథల్ని రాయాల్సిందిగా ప్రభుత్వం గిడుగును కోరింది. దానికి ఫలితంగా గిడుగుకి ఏమి కావాలని ప్రభుత్వం అడిగింది. దానికి గిడుగు సమాధానం – "చదువురాక, లోకజ్ఞానం లేక అడవి మృగములవలె కొండల మీద తిరుగుతున్నా సవరుల కోసం నా సొంత డబ్బుతో, కొద్దిపాటి గవర్నమెంటు గ్రాంటుతో నాకు అందుబాటులో ఉన్న గ్రామాలలో పాఠశాలలు నడుపుతున్నాను. వారి అభివృద్ధికి సహాయపడమని" కొరారు.(మరోసారి గిడుగు రామమూర్తి వ్యాసాలూ, లేఖలు పేజి. 103)

దీనిని బట్టి ఆయన భాషాదృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆయన సవరభాషకు అంకితమైంది డబ్బు కోసం, కీర్తి ప్రతిష్ఠల కోసం కాదు. ఆ ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి వాళ్ళను దారిద్ర్యం నుంచి విముక్తుల్ని కావించడానికి మాత్రమే. "సంఘంలో నిరక్షర కుక్షులు ఎక్కువగా ఉన్నంత కాలం సంఘం అభివృద్ధికి రాదు. సౌఖ్య మన్నది సంఘంలోని భాగ్యవంతులు, పెద్దలు, సామాన్య ప్రజలతో పాటు సమానులుగా అనుభవించాల్సిందే గాని తామొక్కరే అనుభవించ వలసినది కాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తేగాని సంఘం వృద్ధిలోకి రాదు". (మరోసారి గిడుగు రామమూర్తి వ్యాసాలూ – లేఖలు, పేజి. 103).

ఆవిధంగా ఆయన భాషకు, సంఘానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని అర్థం చేసుకొని ఆ దిశలో తన ఆలోచనా ధోరణిని పెంపొందించుకున్నారు. 1919లో తెలుగు మాస పత్రికను ప్రారంభిస్తూ – "we

believe in the uplift of the masses. Is there not here this reform of language the surest means of spreading light among the poor and needy? Is not our beautiful living tongue a true vehicle for message? Our little ones are starved for good literature. Our women hunger for pure imaginative books". (మరోసారి గిడుగు రామమూర్తి వ్యాసాలూ – లేఖలు, పేజి. 103) అన్నారు. అంటే విద్యాపరంగాను, భాషాపరంగాను సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రజలకు అర్థమయ్యే భాషా రచనా వ్యాసంగంలో ఉండాలన్నది ఆయన ఉద్దేశమ్. అందుకే సవరలకు సవర భాషలోనే విద్యాబుద్ధులు చెప్పించాలని వాళ్ళ దగ్గర ఆ భాషను నేర్చుకొని అందులో పుస్తకాలు తయారుచేసి వాళ్లకి ఆ భాషను నేర్పించాదానికి ప్రయత్నం చేశాడు. మాతృభాషలో విద్యాబోధన గురించి ఇప్పుడు పండితులు చేస్తున్నవన్నీ గిడుగు అప్పుడే ఆచరించి, తన భాషా దృక్పథాన్ని ప్రకటించుకున్నాడు.

## 2. శాస్త్రీయత – స్పష్టత

గిడుగు రామమూర్తి భాషకు సంబంధించి శాస్త్రీయమైన దృక్పథం ఉంది. మానవాతావాదంతోనో, ప్రజాభివృద్ధి కోసమో, అందరికి అర్థం కావాలనే ఉద్దేశ్యంతోనో మాత్రమె కాకుండా, భాష పరిణామాన్ని కూడా ఆయన గుర్తించారు, అవగాహన చేసుకున్నారు. ఆయనకు భాషకు సంబంధించి మొదటి నుండి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందువల్ల ఆయన భాషా విషయాన్ని శాస్త్రీయ దృష్టితో అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు. 1912లో డిసెంబర్‌లో బ్రిటీష్ ధ్వని శాస్త్రవేత్త డేనియల్ జోన్స్ మద్రాసు విశ్వవిద్యాలయంలో ధ్వనిశాస్త్రంమీద ఉపన్యాసాలు ఇవ్వడానికి వచ్చినపుడు గిడుగు రామమూర్తి ఆయనతో తెలుగు ధ్వనులకు సంబంధించిన చర్చలు చేసాడు. తెలుగు భాషను గురించి ఆధునిక పద్ధతులలో ఆలోచించిన తొలి భాషా శాస్త్రజ్ఞుడు ఆయనే. 1914లోనే గిడుగు రామమూర్తి ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి తెలుగు భాష నేర్పడానికి ఒక పుస్తకాన్ని తయారు చేశాడు. అయితే ఆ పుస్తకం ఇప్పుడు దొరకడం లేదు. ఆ పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటిలో ద్రావిడ భాషలను బోధించిన ఫిర్త్ ఉపయోగించినట్లు తెలుస్తుంది. సవర భాషకు పరివర్తన వ్యాకరణాన్ని రాసిన Starosta ఈ గ్రంథాన్ని గిడుగుకి అంకితం చేశాడు.

గిడుగు రామమూర్తి శాస్త్రీయమైన దృక్పథాన్ని మెచ్చుకొని Starosta ఈ గ్రంథాన్ని ఆయనకు అంకితం చేశాడు. ఆధునిక భాషావాదాన్ని నొక్కి చెబుతూ గిడుగు అనేక వ్యాసాలూ శాస్త్రీయ దృష్టితో రాశాడు. 1914లో ప్రచురితమైన "A Memorandam on Modern Telugu" అనే గ్రంథాన్ని పరిశీలిస్తే ఆ కాలానికే ఆయన భాషాశాస్త్రాన్ని ఎంత నిశితంగా పరిశీలించారో అవగాహన చేసుకోవచ్చు. 1911 – 1913 సంవత్సరంలో విశాఖపట్టణంలో జరిగిన ఉపాధ్యాయ పరిషత్తు సభలో భాషల పుట్టుక అభివృద్ధి గురించి ఆయన చేసిన ఉపన్యాసాలు ఆయన భాషాశాస్త్ర దృష్టికి నిదర్శనాలు. భాషకి,

సమాజానికి, సాహిత్యానికి ఉన్న సంబంధాన్ని ఆయన నిశితంగా పరిశీలించి వాటిని ఒక దానితో మరొకదాన్ని అనుసంధంచడానికి ప్రయత్నం చేశాడు. దీనికోసం ఆయన శాస్త్రీయ దృష్టిని అలవర్చుకొన్నాడు. సవరులకు ఏదో మొక్కుబడిగా అక్షరజ్ఞానం కల్పించే ప్రయత్నం కాకుండా ఆ భాషకు వ్యాకరణం, నిఘంటువు తయారు చేయడం ఆయనకు ఉన్న శాస్త్రీయ దృష్టిని తెలియజేస్తుంది.

గిడుగు రామమూర్తి ప్రచురించిన "A Memorandam on Modern Telugu" అనే గ్రంథంలో కేవలం బడి పిల్లల పుస్తకాల్లోనే కాకుండా ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు పంపే వర్తమానాల్లో, పుస్తకాల్లో, కరపత్రాల్లో, వ్యవసాయం, వాణిజ్యం, పారిశుధ్యం మొదలైన విషయాలు సామాన్య ప్రజలకు తెలియాలంటే వాటన్నిటిని వాడుకభాషలోనే రాయాలని చెప్పారు. 1903 మార్చి 11న గవర్నర్ జనరల్ కౌన్సిల్ తీర్మానంలో దేశాభాషల్ని ఉపేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. దాన్ని ఉటంకిస్తూ "ఈ దుస్థితికి మూల కారణం ప్రజలు మాట్లాడే అసలు భాషను – మాతృభాషను ఉపేక్షించడమేనని చెప్పారు. పండితులనిపించుకున్న వాళ్ళంతా సంస్కృతం మీదే మోజు చూపిస్తున్నారని తెలుగును పెంపొందింప చేయాలన్న ఆసక్తి వాళ్ళలో లేదని అన్నారు. ప్రాచీన సాహిత్యంలో చెప్పుకోదగ్గ వచన రచనలేవీ లేవు. బ్రిటీష్ ప్రభుత్వం సార్వజనిక విద్యావిధానం ప్రవేశ పెట్టిన కొంతకాలానికి తెలుగులో వచన రచనలు చేసే ప్రయత్నం జరిగింది. కాని దురదృష్టవశాత్తు అది భాషాభేషజం ప్రదర్శించే పండితుల చేతులో పడింది. అయితే పాశ్చాత్య సాహిత్య గ్రంథాలవల్ల ప్రభావితులైన రచయితలు కొందరు అప్పుడప్పుడు ప్రాచీనము, కృతకమూ అయిన కావ్యభాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా సరళీకరించడంలో ఆధునికం చెయ్యడంలో కొన్ని ప్రయోగాలు చేసిన మాట వాస్తవం.

వీరేశలింగం వంటివారు కొద్ది మంది తప్ప తక్కిన వాళ్ళు దీన్ని సాధించలేక పోయారు. అయితే వీరేశలింగం కూడా భాషను ఎంత సులభం చేసినప్పటికీ వాక్య నిర్మాణం వ్యాకరణం పాత పండితుల కృతక పద్ధతిలోనే ఉండిపోయింది అన్నారు. భారతీయ భాషల్ని గురించి ఇంగ్లీష్‌వారి అభిప్రాయాలను సేకరించి అవి భారతీయ భాషాభివృద్ధికి ఏవిధంగా తోడ్పడుతాయో గిడుగు తెలుగు పండితుల దృష్టికి తీసుకువచ్చారు. అంటే శాస్త్రీయమైన దృష్టి ఎక్కడున్నా, ఎవరు చెప్పినా– దాన్ని స్వీకరించాలన్నది ఆయన ఉద్దేశ్యం. అందుకే ఆయన గ్రియర్‌సన్ "The vernacular has been split into two sections – the tongue which is understand by the people and the literary dialect, known only through the press and not intelligible to these who do not know Sanskrit. Literature has thus been divorced from the great masses of the population and the literary classes" అన్న మాటల్ని ఈ సందర్భంలో ఉదహరించారు. అదే విధంగా – "న్యూ ఇంగ్లిష్ గ్రామర్" రచయిత స్వీట్ వ్యాకరణ శాస్త్ర అధ్యయన లక్ష్యాన్ని గురించి చెప్పినవి కూడా ప్రస్తావించారు . సర్ థామస్ మన్రో 1822లో మద్రాస్ ప్రెసిడెన్సీలో అమలులో ఉన్న భాషాబోధన సామగ్రి

గురించి చెప్పిన మాటలు ఇప్పటికీ వర్తిస్తాయనీ, అప్పటికీ ఇప్పటికీ దేశీయ భాషాబోధన ఏమీ మెరుగు కాలేదనీ అన్నారు.

1. విద్యార్థి తాను సులువుగానూ, బలంగానూ, సరిగానూ ఏదైనా చెప్పడానికీ రాయడానికీ భాషాబోధన తోడ్పడాలి.

2. మనస్సులో అనుకున్నది సొంతంగా చెప్పగలిగేలా చేయాలి.

3. నిర్దిష్టశ్రోతలకు నిర్దిష్ట లక్ష్యంతో చెప్పగలిగేటట్టు చెయ్యాలి.

4. క్రమబద్ధమైన ఆలోచనకు విద్యార్థి అలవాటుపడేటట్టు చెయ్యాలి.

5. వాస్తవ విషయాల గురించి ఊహించగల శక్తి, లోకజ్ఞానం విద్యార్థిలో పెరగాలి.

6. ఒక విషయం మీది నుంచి దృష్టి మళ్ళకుండా నిలకడగా కొనసాగే అలవాటు కావాలి.

7. మనస్సుకు విషయ గ్రహణ శక్తి బాగా అలవడాలి. ఈ విధంగా విద్యార్థిలో సమగ్ర వికాసం కలగడానికి భాషాబోధన తోడ్పడుతుందని ఆంగ్ల భాషావేత్త చెప్పిన అంశాలు తెలుగు పండితుల దృష్టికి తీసుకువచ్చారు రామ్మూర్తి పంతులుగారు.

"విద్యార్థులకు నిర్ణయించే పాఠ్యపుస్తకాలుసులువుగా అర్థమయ్యే భాషలో రాసినవే కావాలి కాని పరిచయంలేని కావ్యభాషా శైలిలో రాసినవికాదు. అంటూ "ది ఇండియన్ ఎడ్యుకేషనల్ పాలసీ'లో స్పష్టం చేశారు. సులువుగా అర్థమయ్యే భాష, ప్రజలకు పరిచితమైన భాష వాడుకభాషేనని అంగీకరించినప్పటికీ దేశంలో వివిధ వర్గాలవారి పిల్లలు, వివిధ మాండలికాలు మాట్లాడుతుంటారు కాబట్టి ఏకరూపత, ప్రామాణికత కోరవడతాయనిచెప్పి వాడుక భాషనూ నిరసించేవాళ్ళకి రామమూర్తి సహేతుకమైన సమాధానమిచ్చారు. ఇంగ్లాండులో కూడా కింది వర్గాలవాళ్ళ పిల్లలు తమతమ మాండలికాల్లో మాట్లాడుకుంటారు. కాని, వాళ్ళందరికీ ప్రామాణిక భాష బోధిస్తునారు. అలాగే తెలుగు దేశంలోకూడా ఆ మాదిరి ప్రామాణిక భాష – వాడుక భాష – బోధించవచ్చు. ఉన్నత వర్గాల వారి వాడుకలో ఏకరూపత లేదని కొందరి వాదం. కాని కావ్య భాషలో ఉన్నంత రూప బేధం వాడుక భాషలో లేదని చెప్తూ, గిడుగు వారు 'ఒకర్తె' అన్న మాటకు 52 రూపాంతరాలూ, 'ఒకడు'కు కనీసం 16రూపాంతరాలూ ఉన్నాయని ఉదహరించారు. నిజం చెప్పాలంటే ప్రామాణికమైన తెలుగు (వాడుక) భాషలో ఉన్నపాటి వైవిధ్యం ప్రామాణికమైన ఇంగ్లిష్ భాషలో కూడా ఉందన్నారు. "పండితుడి నిరంకుశత్వం వల్లనే తెలుగులోకి విజ్ఞానం రాకుండా పోయింది", అని బాధపడ్డారు.

చివరికి, తెలుగుబోధన సామాన్యమూ, ఐచ్ఛికమూఅంటూ రెండు విధాలుగా ఉండాలనీ, 'ఐచ్ఛికం' కేవలం ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యదలుచుకున్న వాళ్లకి చాలుననీ 'సామాన్యం' విద్యార్థులందరికీ నిర్బంధంగా బోధించాలనీ సూచించారు. 'సామాన్యం' ఆధునిక భాషలోనే ఉండాలి. చరిత్ర, పౌరశాస్త్రం, భూగోళశాస్త్రం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ఈ శాస్త్రాలు నేర్పే ఉపాధ్యాయుడే

వివిధ విషయాలమీద తెలుగులో కాంపోజిషన్ రాయిస్తాడు. ఆ విధంగా ఆధునిక భాషకు అర్హమైన స్థానం ఇచ్చినవాళ్ళమవుతామని రామమూర్తి తమ వాదం ముగిస్తూ చివర రెండు అనుబంధాలు చేర్చారు.

తెలుగువారి ఉచ్చారణలో వచ్చిన ధ్వని విపరిణామాల తీరు తెన్నులు, పద స్వరూప నిర్ణయంలో కావ్యభాషావాదుల్లో కనిపిస్తున్న గందరగోళం, కాలగతిలో ప్రాచీన, ఆధునిక రూపాలమధ్యా, అర్థాల మధ్యా ఏర్పడ్డ అంతరం ఉదాహరణలతో వివరించడం జరిగింది.

ఈ అనుబంధంలోనే 'పడు' అనుయోగ క్రియతో ఛాందస పండితులు ఒక్క పేజీలోనే డజనుకు పైగా కృతమైన 'పాసివ్ ఫామ్స్' ఎలా ప్రయోగిస్తూ ఉంటారో గిడుగువారు చూపించారు. అవి నిజానికి 'పాసివ్ పామ్స్' కావు. పూర్వ కవులు అలాంటివి చాల అరుదుగానే ప్రయోగించారు. కేతన 'దశకుమార చరిత్రం' మొత్తంలో ఒకే ఒక్క రూపముంది. తెలుగు భారతంలో పర్వానికొకటి తప్ప ఉండదు. "It is grammatically wrong to call such forms 'Passive'. Genuine Telugu has no passive voice. It does not require it. It employs other devices which serve the same purpose for which the passive is used in other languages, e.g. Sans, శ్రుతాయం; Tel. విను(ము); భగ్నం; Tel. విరిగినది, 'It is torn' అది చిరిగినది", అంటూ స్పష్టం చేశారు.

రెండో అనుబంధంలో మద్రాసులో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశంలో పండితులు చేసిన తీర్మానాలు (1912లో కృష్ణా పత్రికలో అచ్చయినవి) తీసుకొని ఒక్కొక్క తీర్మానాన్నే సహేతుకంగా ఖండిస్తూ వచ్చారు గిడుగువారు. ముఖ్యంగా విద్యార్థుల వాచక పుస్తకాల్లో శృంగార రస ప్రధానమైన కావ్య భాగాలు ఎంపికచేసే విషయమై పండితులు వెల్లడించిన అభిప్రాయాన్ని గట్టిగా విమర్శించారు." (మరోసారి గిడుగు రామమూర్తి వ్యాసాలూ – లేఖలు. పేజి. 129 – 130)

పై అంశాలన్నీ గిడుగుకు భాష విషయంలో ఉన్న స్పష్టతను శాస్త్రీయ దృష్టిని తెలియజేస్తాయి.

## 3. వాడుక భాషా ఉద్యమం – వాదం, వివాదం

1857లో బ్రిటీష్ ప్రభుత్వం భారతీయుల్లో విద్యావ్యాప్తిని పెంపొందించడానికి కలకత్తా, ముంబాయి, మద్రాసు నగరాల్లో మూడు విశ్వవిద్యాలయాలను స్థాపించింది. చదువుకోవడం ద్వారా ప్రజల దృక్పథంలో మార్పు తీసుకుకోని రాగలమని బ్రిటీషువారు భావించారు. అర్థ శతాబ్దం గడచిన తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ప్రజల జీవన ప్రమాణంలోకాని, సామాజిక దృక్పథంలో కాని, ఎలాంటి మార్పు కన్పించడంలేదు. ఈ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న పట్టభద్రులకు దేశ భాషల విషయంలో ఏ మాత్రం శ్రద్ధ లేదనే విషయాన్ని బ్రిటీష్ వారు గ్రహించారు. ప్రజల్లో అక్షరాస్యత పెరగకపోవడానికి విద్య సామాన్య

జనానికి అందుబాటులో రాలేదన్న విషయాన్ని గ్రహించారు. ఇందుకు కారణాలను అన్వేషించడానికి, కర్జన్ సిమ్లాలో ఒక విద్యావిషయక సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాలనుంచి విశ్వవిద్యాలయ స్థాయివరకు భారతీయ విద్యావిధానం ఎలావుందనే విషయంపై పదిహేను రోజులపాటు చర్చించారు.

పై సమావేశంలో 150 ప్రతిపాదనలు వచ్చాయి. "the government resolutions of 1904 said, if the educated classes neglect in cultivation of their own languages these will assuredly sink to the level of mere colloquial dialects...and no progress will be possible in giving effect to the principles affirmed in the despatch of 1854 that European knowledge should gradually be brought by means of Indian vernaculars with in the reach of all classes of the people" (గిడుగు రామమూర్తి జీవితం ఉద్యమం, పుట. 52)

అంటే; ఈ విశ్వవిద్యాలయాల నుంచి పట్టభద్రులనవారు తమ భావాలను ఇంగ్లీష్‌లో సులభంగా వ్యక్తం చేయగలరేమోకాని, వాళ్ళ మాతృభాషల్లో మాత్రం చెయ్యలేరని తెలిసిపోయింది. అందువల్ల విశ్వవిద్యాలయ స్థాపనోద్దేశమే దెబ్బతిన్నది అన్నది ఈ తీర్మానాల్లో ఒకటి. దేశ భాషల్లో ఆధునిక విజ్ఞానం విస్తరించకపోవడానికి ఆ భావాలను తెలియజేసే శక్తి, పదాలు ఆ భాషల్లో లేవు. అలాంటి పదజాలాన్ని విద్యావంతులు సృష్టించలేకపోయారు. దానికి కారణం దేశ భాషలను విద్యావంతులు నిర్లక్ష్యం చేయడమే. దీనిని నివారించాలి అంటే, దేశ భాషలపట్లా శ్రద్ధ వహించాలని శాస్త్రీయ విజ్ఞానాన్ని ఆధునిక భావాలను దేశ భాషల్లో రాయగలిగిన వాళ్ళను ప్రోత్సహించాలని అలాంటి పుస్తకాలను రాయించాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంలో ఆ గ్రంథాలు రాయడానికి ఉపయోగించాల్సిన శైలిని గురించిన ప్రస్తావన వచ్చింది. అలా ఆధునిక ప్రామాణిక భాషను రచనా రంగంలోకి తీసుకురావడానికి ప్రాతిపదిక ఏర్పడింది. ఇది జరిగిన ఏడాదికే 1906లో గంజాం, విశాఖపట్నం గోదావరి జిల్లాల పాఠశాల పరీక్షాధికారిగా జె. ఎ. ఏట్స్ నియమితులయ్యారు. పాఠశాలలో బోధించే తెలుగుకు, ప్రజలు ఉపయోగించే తెలుగుకు భేదం ఉన్నట్లు ఆయన గ్రహించాడు. ఈ భేదానికి కారణం ఏమిటి? అన్న విషయాన్ని ఆయన విశాఖపట్నం ఎ. వి. యన్. కళాశాల ప్రిన్సిపల్ పి. టి. శ్రీనివాస అయ్యంగార్‌ని అడిగారు. ఆయన ఈ విషయంపై సరియైన అవగాహన ఉన్నవాళ్ళలో విజయనగరంలోని గురజాడ అప్పారావు, పర్లాకిమిడిలోని గిడుగు రామమూర్తి అని వాళ్ళ పేర్లు చెప్పారు.

ఏట్స్ విజయనగరం వెళ్ళినప్పుడు గురజాడ అప్పారావును ఈ విషయం గురించి అడిగారు. గురజాడకు ఈ విషయం తెలిసినా మరింత స్పష్టత కోసం గిడుగు పేరును సూచించారు. ఏట్స్ గిడుగుతో

ఈ విషయాన్ని ప్రస్తావించగా, దీనిని గురించి వివరించడానికి తనకు కొంత సమయం అవసరమని గిడుగు చెప్పారు. ఏట్సు ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ వార్షిక సమావేశం ఏర్పాటుజేసి, బోధనా పద్ధతులను గురించి ఉపన్యాసాలిప్పించిడం చర్చలు చేయడం మొదలు పెట్టారు. దీంతో గురజాడ, గిడుగు లాంటి వాళ్ళలో అప్పటికే వాడుక భాషపైన, దాని ప్రయోజనం పైన ఉన్న అవగాహనకు మరింత పదును పెట్టినట్టయ్యింది. 1907 నుంచి 1910 వరకు ఉపాధ్యాయ వార్షిక సమావేశాలో పాల్గొన్న గిడుగు జీవద్భాష ప్రాశస్త్యాన్ని తెలియజెప్పుతూ వచ్చారు. అయితే, పండితులు మాత్రం దాన్ని అంగీకరించలేదు. 1911లో స్కూల్ ఫైనల్ పరీక్షకు శెట్టి లక్ష్మీనరసింహం రాసిన గ్రీకు పురాణ గాథలు అన్న గ్రంథాన్ని పాఠ్య గ్రంథంగా నిర్ణయించారు. అప్పటికే బ్రిటీష్ ప్రభుత్వం వల్ల సంస్కృతీ సంప్రదాయాలు మట్టి కలిసి పోయాయని ఆందోళన పడుతున్న పండితులు వాడుక భాష పేరుతో భాషను కూడా భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

గ్రాంథిక వాదం రోజు రోజుకు ఉద్ధృతమై చివరకు వాడుక భాషలో రాయడానికి విద్యాశాఖ ఇచ్చిన అనుమతి ఉపసంహరించుకోవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషను, దాని నిర్మాణాన్ని, శైలిని బాగా అధ్యయనం చేసి, దానివల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేయడం మొదలు పెట్టారు. అదే సమయంలో గ్రాంథిక భాష వల్ల కలిగే నష్టాలకు, పండితులు కూడా గ్రాంథిక భాషను సరిగా రాయలేకపోవడాన్ని ఆయన ఎత్తి చూపారు. గ్రాంథిక-వ్యవహారిక వాదుల వాదనలు తీవ్ర స్థాయికి చేరి, చివరకు వ్యావహారికవాదం ఒక ఉద్యమంగా మారింది. ఆ ఉద్యమానికి నాయకుడు గిడుగు రామమూర్తి. 1909-10లో మొదలైన ఈ ఉద్యమాన్ని గిడుగు అస్తమించే వరకు కొనసాగించాడు. గిడుగు ఉద్యమానికి రెండు పక్కలా పదునే. ఆయన ఒక పక్క వ్యవహారిక భాష అవసరాన్ని చెబుతూ వ్యవహారిక భాషన్నది భ్రష్టు పట్టిన భాష కాదని శిష్టుల మాట్లాడే భాషే వ్యవహారికమని, వ్యాకరణానికి అనుగుణంగా లేనంత మాత్రాన అది గ్రామ్యం కాదని తన వాదనను ఉపపత్తులతో సహా నిరూపించేవాడు. అదే సమయంలో మహా మహా పండితులు రాసిన గ్రాంథిక భాషలో ఎన్ని వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలున్నాయో చూపించేవాడు.

ప్రాచీన కావ్యాల్లో కవులు వాడుక భాషా పదాల్ని ఏవిధంగా తమ రచనల్లో ఉపయోగించారో కూడా ఉదాహరణాలతో చూపించేవాడు. గ్రాంథిక వాదాన్ని సమర్థించే పండితుల రచనల్లోని శాబ్దిక దోషాలను ఎత్తిచూపి వాళ్ళ కంటిని వాళ్ళ వేలితోనే పొడిచాడు. "పూర్వ అర్వాచీన లాక్షణికులు, పండితులు తప్పులున్న పద ప్రయోగాలెన్నిటినో రామమూర్తి పంతులుగారు పూర్వకవి ప్రయోగాల ద్వారానే సమర్థించి చూపారు. ముఖ్యంగా భారత కవుల ప్రయోగాలను ఎవరు కాదనలేరు కదా! యతిప్రాస స్థానాల్లో నిర్ధారితమైనవే మనకు కావాలని పండితులు మొండిపట్టు పట్టుకుని కూచుంటారు. కాబట్టి సాధ్యమైనంత వరకు అటువంటి ప్రయోగాలే చూపారు. తమ బాలకవి శరణ్యంలో సుమారు నూట అరవై పూర్వ కావ్యాల నుంచి భారతం మొదలుకొని గోపినాథ వేంకటకవి రచనల వరకు ఆయా ప్రయోగాలను చూపి లక్షణ

గ్రంథాల అసమగ్రతను వివరించారు. ఆధునిక కవుల ప్రయోగాలను బట్టి భాష ఎటువంటి మార్పులకు లోనవుతూ వచ్చిందో శాస్త్రీయంగా నిరూపించారు." (గిడుగు రామమూర్తి జీవితం – ఉద్యమం. పుట. 71. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2006)

భాషను గురించి గిడుగుకి నిర్దిష్టమైన అభిప్రాయం ఉంది. అందుకే ఆయన వాడుక భాష ఉద్యమాన్ని అర్థం చేసుకోలేని గ్రాంథిక వాదులు గురించి ఇలా అన్నారు. "భాషాతత్వ జిజ్ఞాస, భాషా చరిత్ర జిజ్ఞాస మన ఆంధ్ర పండితులకు లేనే లేదు. లోకములోని శిష్టుల వాడుకను బట్టి, లౌకిక భాషకు అనుశాసనమేర్పడవలేనని అనేకులకు తెలియదు. కనుక మన తెలుగు భాషకు తెలుగు గ్రంథములకు ఇట్టి దౌర్భాగ్యము పట్టినది. ఉపదేశకులు, మార్గదర్శకులు, ఆచార్యులు, తత్త్వదూరులయినప్పుడు లోకమునకు అపరిమితమైన హానికలుగునని మనము జ్ఞప్తియందుంచుకోవలెను. భాషా తత్త్వ మెరుగని వారు భాషా పండితుల కాజాలరు. అట్టివారు తాము మోసపోయి ఇతరులను మోసపుచ్చి లోకమునకు చాలా కీడు చేస్తున్నారు. దుర్బుద్ధి చేత కాదు, అజ్ఞానము చేత".(ఆంధ్రపండితుల భిషక్కుల భాషా భేషజం, పుట. 121)

ఈ శతాబ్దంలో తెలుగు భాష విషయమై తెలుగు సాహిత్య విషయమై స్వరతత్వ, శబ్దతత్వ నిరూపణ పూర్వకంగా కృషి చేసిన పండితులలో ఆయన అగ్రగణ్యుడు. సుమారు ముప్పై సంవత్సరాలు ఆయన ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. ముప్పై సంవత్సరాల కాలం అపండితులతో సిద్ధాంత చర్చలు చేస్తూ, ఆయన సమాధానాలు చెప్పవలసి వచ్చింది. (గిడుగు రామమూర్తి జీవితం – ఉద్యమం, పుట. 72)

ప్రజలను చైతన్య వంతుల్ని చేయడమే భాషకున్న ప్రధాన లక్ష్యమని గిడుగు భావించారు. "అందువల్లే బలాత్కారముగానయినా ప్రజలందరికి చదువు వచ్చేటట్టు చేస్తేనే కాని, స్వరాజ్య వ్యవహారము సాగదు. ప్రజలందరూ గ్రాంథికాంధ్ర భాషా పండితులు కాలేరు. వాడుక భాష వారికి నేర్పితేచాలును. వాడుక భాషలోనే అన్ని విషయములను గురించి కావలిసినంత జ్ఞానము సంపాదించ వచ్చును." (గిడుగు రామమూర్తి జీవితం – ఉద్యమం, పుట. 74)

ఆంధ్రులను విద్యావంతులను చేయడానికి నా మతము అంగీకరించేట్లయితే ఒక మాసము రోజులలో సాధ్యమవుతుంది. ముందుగా వ్యవహారిక భాషలో మీ కర పత్రాలన్నింటిని అచ్చొత్తించండి. ఆ తరువాత తెలుగు అక్షరాలూ, గుణింతములు ప్రతివారికి నేర్పడానికి గ్రామానికొక ప్రచారకుణ్ణి ఏర్పాటు చెయ్యండి. అక్షరాలూ గుణింతములు మామూలు తెలివితేటలుగలవాడు నేర్చుకోవడానికి వారము పది రోజుల కన్నా ఎక్కువ పట్టదు. ఎప్పుడైతే అక్షరాలూ గుణింతములు వచ్చాయో ఆ క్షణము నుండి మీ కర

పత్రాలు మొదలైనవి చదువుకోగల్గుతారు. ఇంతకన్నా, దేశములో విద్య వ్యాపింపజేయడానికి సులభ మార్గం లేదు. మీరీ పనికి పూనుకోనవలెను. ఈ విధముగా బాల్కను రాష్ట్రాలలో యుద్ధము అయిపోయిన తర్వాత చేసినారు. నేను ఈ విషయమంతా చదివాను. బాల్కను రాష్ట్రాలలో ఆరు మాసాలలో విద్యా శూన్యత అంటా తొలిగిపోయింది." (గిడుగు రామమూర్తి జీవితం – ఉద్యమం. పుట. 74–75)

దీనిని బట్టి గిడుగు భాష దృక్పథం ఎంత ప్రజాసామ్యమైందో, ఎంత ప్రజాహితమైందో అర్థం చేసుకోవచ్చు. ఆయన భాష ద్వారా సామాజిక విప్లవాన్ని తీసుకురావాలని ప్రయత్నం చేశాడు. ఇప్పటికీ మనం అందుకోలేని ఎత్తుకు ఆయన అప్పుడే ఎదిగిపోయాడు. ఆయన నడిపిన భాషా ఉద్యమం వల్ల, మహా మహా గ్రాంథిక పండితులైన వేదం వెంకటరాయ శాస్త్రి. చెళ్ళ పిళ్ళ, వేటూరి ప్రభాకర శాస్త్రి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం, మల్లాది, వేలూరి, శ్రీపాద, వీరేశలింగం మొదలైన వాళ్ళంతా వ్యవహారిక భాష వైపు మొగ్గారు. ఆయన అహర్నిశలు పడిన శ్రమకు ఫలితంగా ఈ రోజు రచనా వ్యాసంగమంతా వాడుక భాషలో నడుస్తోంది. అది ఆయన సాధించిన విజయం.

## **4.** గిడుగు – రచనా వ్యాసంగం

గిడుగు రామమూర్తి భాషా దృక్పథాన్ని ఆయన రచనల ద్వారా కూడాగ్రహించవచ్చు. గిడుగు రామమూర్తి సృజనాత్మక సాహిత్యానికన్న విమర్శనాత్మక సాహిత్యాన్ని ఎక్కువగా సృష్టించారు. ఆయన రచనలన్నీ భాషా పరమైనవే! సవరలకు భాష నేర్పించడానికి వాచకాలు, నిఘంటువులు తయారుచేస్తే, వ్యవహారిక భాషా ఉద్యమం ప్రారంభమైన తరువాత ఆయన రచనా వ్యాసంగం పూర్తిగా భాషకే పరిమితమైపోయింది.

తెలుగు పత్రికలో ఆయన ప్రచురించిన పెద్ద పెద్ద వ్యాసాలు, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం పేరుతో గ్రంథ రూపంలో వచ్చాయి. ఇది ఆద్యంతం భాషా విషయాలతో కూడుకున్నదే. ఆయన రాసిన బాలకవి శరణ్యం లక్షణ గ్రంథం. గ్రాంథిక వాదులు అపప్రయోగాలని నిరసించిన ప్రయోగాలకు ప్రాచీన కావ్యాల నుంచి ఉపపత్తులు చూపిస్తూ, ఆ ప్రయోగాలు ఎందుకు సరైనవో నిరూపించే లక్షణ గ్రంథం అది. గిడుగు వాడుక భాషావాదాన్ని సమర్థిస్తూ రాసిన వివిధ వ్యాసాలూ వ్యాసావళిగా ప్రచురితమైంది. అది కూడా భాషకు సంబంధించినదే. ఇంకా సూర్యరాయాంధ్ర నిఘంటువు, విమర్శనా గద్య చింతామణి, ఆయన భాషా దృక్పథానికి నిలువుటద్దంగా నిలుస్తాయి.

ఆయన జీవితాంతం భాషా దృక్పథంతో కృషి చేసారు తప్ప, వేరే వ్యాసంగాలకు దిగలేదు. టేకుమళ్ళ కామేశ్వరరావు కథల సంపుటి 'రోజానూ' గిడుగు రామమూర్తికి అంకితం ఇచ్చారు. ఆ కథలను చదివిన తర్వాత "చూడు కామేశ్వరరావు! నేను ఏది చదివినా, ఆఖరుకు వార్తా పత్రిక చదివినా రంగు

పెన్సిలుతో గుర్తులు పెట్టుకోండే ముందుకుపోను. అదినాకు బాగా అలవాటైపోయింది. విలక్షణమైన ప్రయోగాలు, శాబ్దిక దోషాలు ముందుగా నాకంట పడుతాయి. అటువంటిది నీ కథ చదువుతుంటే అలాగ్రీగీట్లు పెట్టటమనేమాట మరచిపోయాను. పూర్తిగా లీనమైపోయాను. నేను ఇన్నేళ్ళ నుంచి భాషా రంగంలో ఇంత పని చేస్తున్నాను కదా! ఇలాంటి కథ ఒకటి రాయగలిగినా, రాయగలిగితే ఎంత బాగుండేది. ధన్యుణ్ణిగా ఎంచుకునే వాణ్ణి కదా–" అన్నారట. (గిడుగు రామమూర్తి జీవితం – ఉద్యమం, పుట. 119– 120).

దీన్ని బట్టి చూస్తే, ఆయన సృజనాత్మక రచయితగా పేరు తెచ్చుకోవడం కన్నా, ప్రజోపయోగకరమైన భాషోద్ధరణ ఆయనకు ముఖ్యంగా తోచినట్టు కనిపిస్తుంది. భాష కోసమే పుట్టి, భాషలోనే తిరిగి, భాష కోసమే జీవించి భాషా యుద్ధంలోనే మరణించిన గిడుగు భాషా దృక్పథమే అందరికి శిరోధార్యం.

>>>><<<<

# గిడుగు రామమూర్తి భాష, సాహిత్యం, సామాజిక దృక్పథం

## `Gidugu's' perception on Language, Literature and Society

– Dr. Darla Venkateswara Rao,
Asst. Professor, Dept. of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.
vrdarla@gmail.com

## 0. ప్రస్తావన

గిడుగు వేంకట రామమూర్తి పేరు చెప్పగానే తెలుగు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపిన వాళ్ళలో ఆయన ఒక ప్రముఖుడిగా, సవర భాషా సంస్కృతులపై విశేషమైన కృషి చేసిన వ్యక్తిగా గుర్తుకొస్తాడు. అయితే, ఆనాడు గ్రాంథిక భాష ప్రాచుర్యంలో ఉండగా వ్యావహారిక భాష కావాలని వాదించడంలో గల సామాజిక పరిస్థితులు, ఆయనపై చూపిన ప్రభావాలను గుర్తించాల్సి ఉంది. అలాగే ఆయన బ్రాహ్మణ కులంలో పుట్టి పెరిగినా, సవరల గురించి పరిశోధనలు కొనసాగించడంలో గల ఆంతర్యాన్నీ తెలుసుకోవాలనిపిస్తుంది. అసలు ఆయన ప్రాపంచిక దృక్పథం ఏమిటి? ఆయన భాషకే పరిమితమైయ్యారా? లేక సృజనాత్మక సాహిత్యం కూడా రాశారా? సాహిత్యం పట్ల ఆయన అభిప్రాయలేమిటి? ఆయన రాసిన సాహిత్యంలో కనిపించే సమాజం ఎవరిది? మొదలైన ప్రశ్నలకు కొన్ని సమాధానాల్ని అన్వేషించేదిశగా ఈ పత్రం కొనసాగుతోంది.

## 1. గిడుగు జీవితం – దృక్పథం

గిడుగు రామమూర్తిగారి కొడుకు (గిడుగు సీతాపతి) రాసుకున్న *'స్వీయ చరిత్ర'* (1962), ఆయనే రాసిన *'గతకాలపు స్మృతులు'* వ్యాసం(1964), గిడుగు వారి స్మారక సంచిక *'ప్రతిభ''* (1940), *భారతి,* కృష్ణాపత్రిక తదితర పత్రికల్లో వచ్చిన వ్యాసాలు, సవర భాషపైనా, వ్యావహారిక వాదాల సందర్భంగా రాసిన వ్యాసాలు, వీటిపైనే ఆధారపడి ఇతరులు రాసిన మరికొన్ని వ్యాసాలు, ఉత్తరాలు, చేకూరి రామారావు, నడుపల్లి శ్రీరామరాజులు సంకలనం చేసి సంపాదకత్వం వహించి డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ (2005) ప్రచురించిన *''మరోసారి గిడుగు రామమూర్తి''* (వ్యాసాలు, లేఖలు) పుస్తకం ప్రధానంగా గిడుగు వారి జీవితాన్ని, ఆయన దృక్పథాన్ని తెలుసుకోవడానికి ఆధారాలుగా కనిపిస్తున్నాయి.

గిడుగు రామమూర్తి గారి పూర్వీకులు నేటి తూర్పు గోదావరి జిల్లా అమలాపురం దగ్గర్లోని 'ఇందుపల్లి' వాస్తవ్యులు. తర్వాత కాలంలో విజయనగరం దగ్గర్లోని పర్వతాల పేటకు వలస వెళ్ళారు. అక్కడే వెంకమ్మ, వీర్రాజులకు ఆగస్టు 29, 1863లో రామమూర్తి జన్మించారు.[i] నేటికీ ఇందుపల్లి ప్రాంతంలో వీరి కొబ్బరితోటలు ఉన్నాయని రామమూర్తిగారి కొడుకు సీతాపతి ఒక వ్యాసంలో ప్రకటించారు[ii]. ఆయన పుట్టి పెరిగింది బ్రాహ్మణ కుటుంబంలోనే. అంతేకాకుండా ఆయనకు దైవం పట్ల నమ్మకం ఉందని వీరేశలింగంగారికి రాసిన లేఖను బట్టి తెలుస్తుంది.[iii] కాబట్టి భావవాదమే ఆయన ప్రాపంచిక దృక్పథమైనా భాషా వ్యవహారంలో మాత్రం సామాజిక వాస్తవాన్ని గుర్తించగలిగిన వ్యక్తిగా కనిపిస్తున్నారు. ఎందుకంటే, ఉద్యోగరీత్యా సవరలు అధికంగా నివసించే పర్లాకిమిడి ప్రాంతంలో తన జీవితాన్ని అంతటినీ గడిపారు. ఆ అవసరాలు, అప్పటికే సంస్కరణవాది అయిన గురజాడ అప్పారావుగారితో పరిచయం ఉండటం వంటివన్నీ భాష పట్ల ఆయనకు ఒక సామాజిక దృక్పథాన్ని కలిగించి ఉండొచ్చు.

ప్రాచీన కావ్యాల్లో కూడా వ్యావహారిక భాషను చూపించే ప్రయత్నం చేసి, ప్రజల వాడుకలో ఉంటేనే భాష నిలుస్తుందనేది ఆయన వాదం. మనం మాట్లాడుకునే భాషలోనే రచనలు కూడా వస్తే బాగుంటుందనీ, ఎక్కువమందికి విజ్ఞానం అందుబాటులోకి వస్తుందనేది ఆయన ఆశయం. అందుకోసం ఆయన చాలా ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాలను అతిశయోక్తితో పొగిడేసినవాళ్ళున్నారు. *"గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషావాదం లేవనెత్తడంతో తెలుగు కావ్యభాషాస్వరూపం మారిపోయింది"* అని శ్రీశ్రీ అన్నారు. నిజానికి గిడుగు వారు వ్యావహారిక భాషావాదానికి కృషి చేసినా, ఆయన జీవించిన కాలంలోనే అది సంపూర్ణంగా విజయవంతం కాలేదు.[iv] ఆ విషయాన్ని గిడుగు వారే స్వయంగా చెప్పుకున్నారు కూడా. కానీ, ఆ ప్రయత్నాలు తర్వాత కాలంలో విజయవంతం కావడానికి తోడ్పడ్డాయనుకోవచ్చు. ఇవన్నీ పరిశీలించినప్పుడు ఆధునిక వ్యావహారిక భాషను పరీక్షల్లో రాయగలిగే అవకాశం ఉంటే సామాన్య, మధ్యతరగతి వారికి కూడా విద్యావకాశాలకు అవకాశం కలుగుతుందనేది భాషా వ్యవహారానికి సంబంధించిన ఆయన దృక్పథమని గుర్తించవచ్చు.

సవరలను అత్యంత దగ్గరగా పరిశీలించడంతో వారి గురించి లోకానికి తాను గమనించిన వాస్తవాల్ని తెలపాలనే జిజ్ఞాసే ఆయనను సవరలపై పరిశోధనకు పురిగొల్పి ఉంటుంది. అయితే, సవరలపై పరిశోధన చేయడానికి ఆయనకున్న మానవతాదృష్టే ప్రధానకారణంగా చేకూరి రామారావు వ్యాఖ్యానించారు.[v] సవర భాష నేర్చుకుంటేనే, వారితో బాగా కలిసిపోవచ్చు అనుకున్నారు[vi]. *'హరిజనోద్ధరణ జరగడానికి 40 సంవత్సరాల ముందే 1894 ప్రాంతంలోనే గిరిజనులైన సవరలు ( శబరులు) వాళ్ళలో మళ్ళీ అంటరానివాళ్ళని తన ఇంటి దగ్గర పెట్టుకొని, దగ్గరగా కూర్చొని సవరభాష నేర్చుకున్నారు"*[vii] అని సంస్కర్తగా గిడుగువారిని

అడపా రామకృష్ణారావు అంచెనా వేశారు. ఇవన్నీ పరిశీలించినప్పుడు గిడుగు రామమూర్తి అగ్రస్థానంలో సామాజిక గౌరవానికి నోచుకున్న వర్గం నుండి వచ్చినప్పటికీ, తన జీవితావసరాల రీత్యా సమాజంలో అట్టడుగు వర్గాల వారితో జీవించాల్సిన పరిస్థితుల్లో ఆయన జీవిత దృక్పథంలో మార్పు వచ్చిందని అనుకోవచ్చు. అదే ఆయన భాషాదృక్పథాన్నీ ప్రభావితం చేసి ఉంటుంది. *"పేదవాళ్ళకి, పసిపిల్లలకు, స్త్రీలకు వాళ్ళకు అర్థమైన భాషలో విజ్ఞాన బోధ రామమూర్తిగారికి వ్యావహారిక భాషా వాదానికి లక్ష్యం. అదే ఆయన జీవితాశయం"* ఆయన భాషా దృక్పథం ప్రధానంగా " A memorandum on Modern Telugu" (1913) లో కనిపిస్తుంది. గురజాడ వారు మద్రాసు విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన 'డిసెంటు పత్రం'( అసమ్మతి పత్రం)లో ఉన్నటు వంటి వాదనే గిడుగు వారి వాదనలోనూ కనిపిస్తుందని భాషావేత్తల అభిప్రాయం[viii]

## 2. సాహిత్య, సామాజిక దృక్పథాలు

కవిత్రయమహాభారతం అంటే గిడుగు వారికి చాలా ఇష్టం. కథలు కూడా చదివే వారు. వాటి గురించి నిర్మొహమాటంగా మాట్లాడేవారు. యీసఫ్ కథలను సవరభాషలోకి అనువాదం చేశారు.[ix] 1919లో 'తెలుగు' పత్రికను స్థాపించి, కేవలం భాషకు సంబంధించినవే కాకుండా సృజనాత్మక సాహిత్యానికి కూడా ప్రాధాన్యాన్నిచ్చేవారు. గ్రాంథిక వాదుల ఆక్షేపణలను తిప్పికొట్టాలని ఈ పత్రికను నడిపారు. 1914లో 'నిజమైన సంప్రదాయం' పేరుతో చిన్న పుస్తకాన్ని రాశారు. వచన సాహిత్యం వ్యావహారిక భాషలో రాయడమే నిజమైన సంప్రదాయం'అని వాదించడమే ఈ రచన లక్ష్యం.

1932లో *'అప్పకవీయ విమర్శనము'* తాళపత్రకావ్యాలను పరిశీలించి రాసిన గ్రంథాన్ని బట్టి సాహిత్యాధ్యయనం విస్తృతంగానే చేసేవారని తెలుస్తుంది. చిన్నయసూరి *'నీతిచంద్రిక'* రెండవ ముద్రణను రామమూర్తిగారే ప్రచురించడం వల్ల సాహిత్యం ద్వారా భాషావ్యాప్తి కలుగుతుందని భావించారు. 'ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజం'; బాల కవిశరణ్యం' పుస్తకాల్లోని భావాలను ముందుగా 'తెలుగు' పత్రికలోనే ప్రచురించారు. *"వ్యావహారిక భాషలో వ్రాసినపుడు కావ్యమెంత రసవంతంగా వుంటుందో నీకు అనుభవం మీద కాని తెలియదు. ఏదీ నీ కలాన్ని ఒక్కసారి అటువైపు తిప్పు"* అని పర్లాకిమిడి పాఠశాలలో పనిచేసేటప్పుడు యల్లాపంతుల జగన్నాథం గారితో చెప్పడం వంటివన్నీ చూస్తే, సాహిత్యం వ్యాప్తికి కూడా వ్యావహారిక భాషను ఒక సాధనంగా వాడుకున్నారని తెలుస్తుంది. ఆ తర్వాత జగన్నాథం రాసిన *" గాదెల గండడు"* అనే బొబ్బిలిపాట వరుసలో రాసిన గేయప్రబంధానికి 'పీఠిక' కూడా రాశారు. 'ముఖలింగ క్షేత్రమాహాత్మ్యం' కావ్యం ఆధారంగాను, శాసనాల ఆధారంగాను 'ముఖలింగనగర ప్రాచీనత'ను గుర్తించారు. ముఖలింగక్షేత్రం 'బెనారస్' లాంటిదని క్షేత్రమాహాత్మ్యం వర్ణించిందని, ఆ ఆధారంతో పరిశోధించి దీన్నే ప్రాచీనకాలంలో

‘‘జయంతి పురం’’ అని పిలిచేవారని నిరూపించారు. నేటి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం దగ్గర్లోని కొంకుదురు గ్రామంలో కొన్ని శాసనాలు దొరికాయి. దానిలో ఒకటి కొంకుదురు శాసనం. అది 1887 లో దొరికింది. దాన్ని మద్రాసు మ్యూజియంలో భద్రపరిచారు. వాటిని పరిష్కరించడానికి రామమూర్తిగారికి పంపితే, దానిలో పేర్కొన్న అంశాలను శ్రీనాథుని ‘భీమఖండం’ ఆధారంగా పరిశీలించారు. అందులోని అంశాలు అమలాపురం దగ్గర్లోని వెదిరేశ్వరం, పలివెల, ముమ్మిడివరం అనే గ్రామాలకు చెందినవని గుర్తించారు. నాటి సామాజిక స్థితినీ, దానవిశేషాల్ని కావ్యవిశేషాలతో పోల్చి చెప్పారు.

సవరలకు సంబంధించిన ‘సవరపాటలు’ సేకరించారు. దీనిలో 32 పాటలున్నాయి. వాటిలో 30 పాటల్ని సేకరించారు. 20 స్వయంగా రాశారు[x]. సవరల పాటల సేకరణకు చాలా కష్టడ్డారు. వాళ్ళ సంస్కృతిని రక్షించే ప్రయత్నం చేశారంటే, కింది వర్గాల సంస్కృతి పట్ల ఆయనకున్న గౌరవం వ్యక్తమవుతుంది.సవరలపై పరిశోధన చేయాలనుకోవడమే ఆయన సామాజిక దృక్పథాన్ని తెలుపుతుంది.ఆయన రాయాల్సిన విషయాలన్నీ ఆయన కుమారుడు సీతాపతి వ్యాసంగా రాశారు. సవరలను నేడు గిరిజనులుగా గుర్తిస్తున్నారు. వారి గురించి ఐతరేయబ్రాహ్మణం నుండి అనేక కావ్యాల్లో పేర్కొన్న అంశాలను, సమాజంలో ఉన్న వాస్తవస్థితిగతుల్ని వివరిస్తూ గొప్ప పరిశోధన చేశారు.సవరలు గంజాం, విశాఖజిల్లాల్లోను, ఒరిస్సా, బెంగాల్, సంబల్ పూర్ మొదలైన ప్రాంతాల్లో ఉండేవారని పేర్కొన్నారు. మహాభారతం, శాంతిపర్వంలో వీరి ప్రస్తావన కనిపిస్తుంది. విశ్వామిత్రుడు శపించిన వారిలో ఒకరిగా పేర్కొన్నారు. రామాయణంలో శబరి నేటి సవరలకు సంబంధించిందే అన్నారు. భారతం, హరివంశం మొదలైన కావ్యాల్లో వీరి గురించి ఉన్న విషయాల్ని పేర్కొన్నారు. యజ్ఞంలో నరబలి ఉండేదట. రామాయణం ( బాల 62 సర్గ) లో...అంబరీషుడు యజ్ఞం చేయడం– పశువు పారిపోవడం, దాన్ని వెతుక్కొంటూ రుచీకుడనే మునిదగ్గరకు వెళతాడు. యజ్ఞ పశువుగా రుచీకుని రెండవ కొడుకుని కొనడం, అప్పుడు ఆ రుచీకుడు విశ్వామిత్రుడి దగ్గరకు వెళ్ళి శరణుకోరతాడు.విశ్వామిత్రుడు తన కొడుకుల్ని యజ్ఞ పశువులుగా వెళ్ళమంటే వాళ్ళు నిరాకరించడం, అప్పుడు శపించడం వంటివన్నీ సవరులను ఆర్యులుగా తెలిపే కథనాలు. శబరులు వేటలో ప్రవీణులనీ, స్వతంత్రజీవనాన్ని కొనసాగించారని తెలిపారు. ఇలా అనేక అంశాలను పరిశోధించారు.

గిడుగు వారి పరిశోధనను నడుపల్లి శ్రీరామరాజుగారి అభిప్రాయంతో ముగించడం సముచితంగా ఉంటుందనిపిస్తుంది. ‘‘*తెలుగు సవర భాషల మీద ఆయన చేసిన అద్భుతమైన పరిశోధనల కంటే, వారు చేసిన అమూల్యమైన శాసన పరిశోధనల కంటే,రచనలలో వాడుక భాషా వ్యాప్తికి వారు చేసిన కృషి కంటే, వారి వ్యక్తిత్వం గొప్పది*’’.[xi] మొత్తం మీద కింది వర్గాల పట్ల, వారి సంస్కృతి–చరిత్రల పట్ల గౌరవభావాన్ని ప్రకటించిన విశిష్ట వ్యక్తిత్వం గిడుగు వారిదని సవరలపై ఆయన చేసిన మొత్తం పరిశోధన కృషి తెలుపుతుంది.

వ్యావహారిక భాషోద్యమంలో ఆయన చేసిన వాదాలు, ఉద్యమాలు  భాషలోని శక్తిని అందరికీ అందేలా చేసిన ప్రయత్నంగా స్పష్టమవుతుంది. ఇవన్నీ  ఆయన సామాజిక దృక్పథాన్నీ తెలియజేస్తున్నాయి.

## పత్రాంత సూచికలు

---

[i] గిడుగు రామమూర్తి పుట్టిన తేదీ విషయంలో వివాదాలు ఉన్నాయి. 1862లో పుట్టినట్లు ఆరుద్ర (శాసన పరిశోధకుడుగా గిడుగు–గురజాడ''' ''వ్యాసం)లో చెప్పగా జి.వి.రామమూర్తి 1863 ఆగస్టు 29 అని రాశారు. గిడుగు సీతాపతి ఒకచోట 1862 గాను, మరో చోట 1863గానూ పేర్కొన్నారు. వీటన్నింటినీ పరిశీలించి ఆగస్టు 29, 1863 అని గిడుగు రామమూర్తి జీవితం–రచనలపై పరిశోధన చేసిన డా.దాశరథుల నర్సయ్య ( 2009: 2) నిరూపించారు.

[ii] సీతాపతి,గిడుగు. ‘ రామమూర్తి పంతులుగారి జీవిత చరిత్రలోని చిత్ర విచిత్ర ఘట్టాలు’ (వ్యాసం), మరోసారి గిడుగు రామమూర్తి,సంపాదకులు: చేకూరి రామారావు, నడుపల్లి శ్రీరామరాజు, డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ బ్లూమ్ ఫీల్డ్ హిల్స్ , మిషిగన్ ప్రచురణ: 2005 : 2

[iii] వీరేశలింగంగారికి 10–4–1917లో రాసిన లేఖలో “ తమకు పరమేశ్వరుడాయుస్సు ఆరోగ్యముతో కూడా ఇచ్చుగాక అని త్రికరణశుద్ధిగా నేను ప్రార్థించుచున్నాను'' అని గిడుగు వారు కోరుకున్నారు.

[iv] చిలుకూరి నారాయణరావు ‘ నాగురువుగారు’ (వ్యాసం, ప్రతిభ, సంపుటి, 4. 1940) లో“ *ప్రభుత్వ విద్యాశాఖలలోను, యూనివర్సిటీలలోను ఆయన ఉద్దేశము సరిగా కొనసాగడానికి ఆయన జీవిత కాలములో అవకాశము చిక్కలేదు''* అని రాశారు.

[v] రామారావు, చేకూరి. ‘రామమూర్తిగారు వ్యావహారిక భాషావాది ఎందుకయ్యారు?’( వ్యాసం), మరోసారి గిడుగు రామమూర్తి, పుట: 103.

[vi] నర్సయ్య, డి. గిడుగు రామమూర్తి జీవితం–రచనలు, పుట: 12

[vii] రామకృష్ణారావు, అడపా. సంఘసంస్కర్తగా గిడుగు’ పుట:112

[viii] దక్షిణామూర్తి, పోరంకి.గిడుగు మెమొరాండం: గురజాడ డిసెంటు పత్రం (వ్యాసం), మరోసారి గిడుగు రామమూర్తి, పుటలు: 129, 133.

[ix] నర్సయ్య, డి. గిడుగు రామమూర్తి జీవితం–రచనలు, పుట: 15

[x] పైదే: . పు: 63

[xi] శ్రీరామరాజు, నడుపల్లి.‘బహుముఖ ప్రతిభాశాలి, మానవతావాది గిడుగు రామమూర్తి’ (వ్యాసం),  మరోసారి గిడుగు రామమూర్తి, పుట:   282

# ఆధునిక భాషగా తెలుగు – గిడుగు ఆలోచనలు

## Telugu as a Modern Language – `Gidugu's' Views

Dr. D. Vijayalakshmi,
Asst. Professor, Dept. of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.

మహాకవి తిక్కన అనువదించిన శ్రీ మదాంధ్ర మహాభారతం నాటి తెలుగు వాడుకకు ఊపిరై నిలిచింది. వేమన పద్యాలు ప్రజలభాషగా ఆనాటి తెలుగుకు పట్టంకట్టాయి. తర్వాతి కాలంలో భావసంకెళ్ళను బిగించిన ఫ్యూడల్ (పండిత)వ్యవస్థలో తెలుగు భాష మగ్గసాగింది. గిడుగురామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమం జరిపి భాషను ప్రజాస్వామ్య బద్ధమైన ఆధునికంవైపు పరుగులు తీయించాలనుకున్నారు. శాస్త్రబద్ధమైన శాస్త్రజ్ఞులదగ్గర భాషాశాస్త్రం అధ్యయనంచేసి భాషాతత్వాన్ని సమగ్రంగా ఆకళింపు చేసుకున్న మహనీయులు గిడుగు. అధ్యాపక వృత్తిలోని అధ్యయన రీతుల్లో అనువర్తిత విధానాన్ని అనుసరించాలనుకునే తపనగల వ్యక్తి గిడుగు. మూసపోసిన విద్యకన్నా లౌకికసంప్రదాయాలను అనుసరించి అనువర్తన చేసి విద్య బోధించడంద్వారా విద్యార్థి పొందే జ్ఞానం ఆధునికమని నమ్మిన సిద్ధాంతి గిడుగు. ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేని అనుసరణ శాస్త్రజ్ఞులకు పిడుగైయ్యాడు గిడుగు.

అనుసరణశాస్త్ర పండితుల అధ్యయన విధానాల ఫలితాలకి, సహజస్థితితో భాషను అధ్యయనం చేసే ఉపాధ్యాయుల అధ్యయన విధానాల ఫలితాలకి, మధ్య గల తేడాలను ఎన్నోసార్లు ఎన్నో ఉదాహరణలతో ఉటంకించి చెప్పినా అనుసరణ అధ్యయనాభిలాషా ప్రియులకు గిడుగు చెప్పిన సహజ భాషాతత్వఫలితం బోధపడలేదు. ఏది ఏమైనా తెలుగుభాషకు గ్రాంథికవాదం పేరుతో బిగించిన దాస్యశృంఖలాల ఉచ్చు భాషకు తీరనినష్టం చేకూర్చిందన్నది గిడుగురామమూర్తిపంతులుగారి వాదన. నూటికిపైగా కృతక గ్రాంథికాంధ్ర రచయితలు తమ రచనల్లో కృతకంగా సృష్టించి తెలుగు భాషపై రుద్దిన రూపాలను ఎత్తిచూపారు. చిన్నయసూరి మొదలుకొని చిలకమర్తి లక్ష్మీనరసింహంవరకున్న రచయితలల్లో వేదంవెంకటరాయశాస్త్రి, పురాణపండ మల్లయశాస్త్రి, నేతి సుబ్బరాయశాస్త్రి, మల్లాది సూర్యనారాయణ శాస్త్రివంటి పేరెన్నికగన్న పండితోత్తములు, వడ్డాది సుబ్బరాయకవివంటి కవులు, కొమర్రాజు లక్ష్మణరావు, వంగూరిసుబ్బారావు, చెలికాని లచ్చారావు, జయంతిరామయ్య, చిలుకూరి వీరభద్రరావువంటి విమర్శకులు, పానుగంటి లక్ష్మీనరసింహంవంటి నాటక నిర్మాతలు రచించిన గ్రంథాలను గిడుగు పరిశీలించారు. వారి రచనల్లోని

అపశబ్దాల కింద గీట్లుగీసి వాటన్నింటిని ఉటంకించి వ్యాసరూపంలో ప్రకటించారు. వాడుకభాషను దూషిస్తూ అపరిచితమైన ప్రాచీనాంధ్రంలో రచించేవారిలో చాలామంది భాషాతత్వం బోధపడని వారేనని నిరూపించారు.

అంతేకాదు కవిప్రయోగాలకే ప్రాధాన్యతనిచ్చి తయారుచేసిన శబ్దరత్నాకరం నిఘంటువులో కూర్చిన శబ్దార్థాల వ్యుత్పత్తులలో దోషాలు వేయికి పైబడి ఉన్నాయని వివరించి చూపారు. ఇది చెప్పి వందసంవత్సరాలు అయింది. శబ్దరత్నాకరం నిఘంటువు అనేక పునర్ముద్రణలు పొందిందిగానీ దోషనివృత్తి జరగలేదు. బహుజనపల్లి సీతారామాచార్యులకు ముందున్న నిఘంటునిర్మాతలు ప్రాచీనాంధ్ర శబ్దాలకు వర్తమాన వ్యావహారికాంధ్రంలో అర్థం చెప్పారు. పరవస్తు శ్రీనివాసాచార్యులుగారి సర్వశబ్దసంబోధినిలో సంస్కృత పదాలకు తెలుగు వాడుక మాటలతో అర్థం చెప్పారు. మామిడివెంకయ్యగారి ఆంధ్రదీపికకూడా అట్లే కూర్చారు. సంస్కృత కావ్యాలకు టీకలు రచించిన పండితులు వ్యావహారికమే వాడారు. బ్రౌణ్య నిఘంటువుకూడా ఆ సంప్రదాయాన్ని అనుసరించింది. 1950లో చిన్నయసూరి బాలవ్యాకరణం రచించిన తర్వాతనే తెలుగుసమాజంలో భాష విషయంలో గందరగోళం ప్రారంభమయింది. 20వ శతాబ్దంలోని పండితులలో చాలామందికి అటు సంస్కృతం మీదా ఇటు ప్రాచీనాంధ్రం మీదా పట్టులేదు. "వాడుక మాటలు మార్చి, మసిపూసి మారేడుకాయ చేసినట్లు, గ్రాంథికీకరణం చేసేశారు" అన్నారు గిడుగు తమ లేఖల్లో.

ఆధునికం అంటే ప్రస్తుతం అని అర్థం తీసుకుంటే అది ఏ కాలానికైనా వర్తిస్తుంది. తెలుగు సాహిత్య సృజనలో 20వ శతాబ్దంలోని ఏడుపదుల కాలంవరకు భాష విషయంలో చాలామంది కవులు రచయితలు ఆధునికతను సాధించలేదు. ప్రాచీనానికి ప్రాధాన్యమిస్తూ చాలామంది ప్రాచీన అర్వాచీన కవులు ప్రథములతో పోటీపడ్డారే తప్ప నిజస్థితిని గ్రహించలేకపోయారు. ఆధునికతనుగ్రహించి రచనలు చేసిన కొంతమందిని దేశికవులుగాను, అపండితులుగాను, భాషమీద పట్టులేని వారుగాను ముద్ర వేశారే తప్ప వారు చూపిన వాస్తవిక మార్గాన్ని అనుసరించలేదు. ఇది అనుసరణీయ విధానాన్ని అనుశ్రుతం చేసుకున్న లక్షణంలోని పొరపాటే తప్ప ఆధునికత్వంలోని లోపంకాదు. నేటికీ మన విద్యావిధానంలో భాష విషయంలో అదే పోకడ కన్పిస్తుంది. నూతనత్వాన్ని అంగీకరించే గుణంలోకి విద్యార్థుల్ని తీసుకెళ్లడంలేదు. ఎక్కడో ఒకరిద్దరు అధ్యాపకులు ఇలా ప్రయోగాత్మక అనువర్తిత విధానాలను విద్యార్థులకు బోధనలో భాగం చేస్తుంటే పనిగట్టుకుని ఆక్షేపణలు చేస్తున్న సహవ్రతుల ఆధిక్యం అంతా ఇంతాకాదు.

గిడుగు రామమూర్తిపంతులు 1906లో ఏట్స్ తో పంచుకున్న ఆలోచనల పర్యవసానమే వ్యావహారికోద్యమం. సామ దాన భేద దండోపాయాలతో సాగిన ఈ ఉద్యమం నేటికీ నిశ్శబ్దంగా కొనసాగుతూనే ఉంది. వ్యవహారికం, దేశ్యం, వాడుకభాష, మాండలికం ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడిన అంశాలే. ఇవన్నీ ఒక భాషా సమాజంలో అంతర్లీనంగా ముడిపడిన సహజాలు. వీటిలో ఏదైనా

ఫరవాలేదు. రచనలో అధికాధికంగా వినియోగింపబడితే చాలు. అదే వ్యవహారికోద్యమ ఫలితం. దీనిని సాధించాలనే గిడుగు ఆశించారు. సృజనాత్మక రచనల్లో అందులోనూ వచనరచనల్లో వ్యావహారికాన్ని సాధించారు. అందుకే ప్రస్తుతయుగంలో తెలుగు మాతృభాష వర్గీయులకి వచన సాహిత్యం చేరువయ్యింది. కథ నవల నాటకం పాట వ్యాసం వార్త ఇవన్నీ నేడు ప్రజల వ్యవహారశైలికి దగ్గరగా వచ్చాయి. భాషలో సాధించిన నవ్యత **సమా**జాన్ని ఆధునికంవైపు పయణింపచేసింది. ప్రజాస్వామ్యయుతమైన భాష ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎదగడం అభివృద్ధి సూచకం. **ఆ**ధునికతను అందించే రచనల్లోని పదాలు, ప్రత్యయాలు, పదబంధాలు, వాక్యనిర్మాణాలపై శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనాలు రావలసిఉంది. సహజ భాషలోని పదప్రత్యయ సంయోజనాలను, సంధిస్వరూపాన్నీ, సమాసవిస్తృతిని అర్థంచేసుకోవడంలో శాస్త్రీయత చేకూర్చ**వల**సిన అవసరమూ ఉంది. భా**షా**శాస్త్ర దృక్పథంతో భాషకు శాస్త్రీయతను చేకూర్చగలిగే చేవగల్గిన శాస్త్రజ్ఞులు అరుదుగా ఉన్నారు. వీరు విద్యార్థులకి శాస్త్రదృష్టితో జీవద్భాషను అధ్యయనం చేసే అనువర్తిత విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇపుడిపుడే విద్యార్థుల్లో కొందరు ఆ విషయాలను ఆకళింపు చేసుకుంటున్నారు. వారిని మనస్ఫూర్తిగా ఆహ్వానించే గుణం అధ్యాపక వర్గంలో రావాలి. భాష విస్తృత పరిధి కలది. భాషపై పరిశోధనలకు ఊతమివ్వాలి. అపుడే జీవద్భాషలోని లక్ష్యానికి లక్షణాలు వెలుగులోకి వస్తాయి. జీవద్భాష అంటే ఆయా కాలాలల్లోని వాడుక భాష.

వ్యావహారిక భాష ప్రయోజనం విస్తృతం. గ్రాంధికభాష ప్రయోజనం పరిమితం అని ఎలిగెత్తి గిడుగు అరిచినా గ్రాంథికభాష ప్రమాణపూరితమని నమ్మపలికిన ఊకదంపుడు ధోరణివల్ల చాలామంది సాధారణీకుల్లో భాష భయోత్పాతాన్ని సృష్టించిందనడం వాస్తవం. ఆధునిక అవసరాలకు అనుగుణంగా మలచుకోగలిగిన చేవగల వ్యావహారికాన్ని పనిగట్టుకుని నిరసించేవాళ్లు ఎద్దేవా చేసేవాళ్లు నాడు అధికం. నేటికీ తక్కువేమీకాదు. సహజ భాషలో విద్యాబోధన సాగించడంద్వారా విషయగ్రహణ శక్తి విద్యార్థుల్లో తనంత తానుగా పెరుగుతుంది. అంతేకాక తెలుగు వినియోగం సాహిత్య సృజనకి, తెలుగు పాఠాలు బోధించడానికి పరిమితం అన్న దశనుండి చాలా దూరం పయనించింది. గత అర్థశతాబ్దకాలంగా తెలుగు వినియోగం శాఖోపశాఖలుగా అనేక రంగాలకు విస్తరించింది. విస్తరించిన రంగాలకు అవసరమైన తెలుగు పదసంపదను అందుకోడానికి కావలసిన పరికరాలు తెలుగులో వెలువడకపోవడం పెద్దవెలితి. ఈ వెలితినే గిడుగుగారు పదేపదే వివరించిచెప్పారు. పై వెలితిని పూడ్చుకోడానికి వ్యవహార స్వరూపంలో ఉన్న భాష అనేక రీతులుగా ఉపయోగపడుతుందని చెప్పారు. మనసుకి ఎక్కించుకున్నవారు తమ మతం మార్చుకుని వ్యావహారిక భాషలో రచనలు చేశారు. చేసిన రచనల్లోని పదసంపదను నిఘంటువులకు ఎక్కించడంలో నిఘంటుకారులు వెనకబడ్డారు. వ్యావహారిక భాషలో వచ్చిన రచనలలోని వ్యాకరణాంశాలపై సమగ్ర చర్చచేసి వ్యాకరణం రచించడంలో లాక్షణికులు ఉత్సుకత చూపలేదు. అందుచేత ఆధునిక తెలుగు రచనలకు మాత్రమే పరిమితం

అయిందే తప్ప నిఘంటువులకు, వ్యాకరణ సూత్రాలకు నోచుకోలేదు. ఒకటి రెండు ప్రమాణ గ్రంథాలు వచ్చినా అవి ఆంగ్లంలో ఉన్నాయేగాని తెలుగులో రాలేదు.

ప్రాచీన భాషపట్ల మక్కువ ప్రదర్శించే వాళ్లు వ్యావహారికభాషను ఎందుకు నిరసిస్తున్నారో అర్థంకాదు. ఎందుకు నిరసిస్తున్నారు అని ప్రశ్నిస్తే వ్యవహార స్వరూపానికి ప్రమాణత్వం చూపే సూత్రీకరణలు ఎక్కడ? అని ఎదురాడుతారు. భాషకు వైయక్తికతను, ప్రాదేశికతను, ప్రాంతీయతను, సాంఘికతను జోడించి మరీ ప్రశ్నిస్తారు. ప్రశ్నించిన వాళ్లకు సమాధానాలు తయారుచేసే సత్తా ఉంటుంది. సహజ భాషలో జరిగే ప్రతి పరిణామానికీ నిబద్ధత ఉంటుంది. ఎటుపడితే అటు భాష చెదరదు. ఉచ్చారణా సౌలభ్యమే మాతృభాషీయులకి ప్రధానం. అందుచేత ఉచ్చారణకోసం జరిగిన పరిణామం లక్షణ బద్ధంగానే ఉంటుంది. మార్పు జరిగిన పరిణతిని అందిపుచ్చుకునే లాఘవం లాక్షణికులకు అరచేతిలో వెన్నముద్ద. కానీ ప్రాచీన సంప్రదాయ విధానాలకు అంటగాగిన తనంతో మూసపోసిన పాతపద్ధతులకి ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక వ్యవహార స్వరూపాలపట్ల సరైన దృష్టి పెట్టడంలేదు. కొత్తదనానికి ప్రాముఖ్యత చేకూర్చడానికి, సూత్రీకరించడానికి మనస్ఫూర్తిగా పూనుకొనడంలేదు.

కావ్య ప్రయోగాలను చూపి ఇవే సాధురూపాలని పండితులు రాసిన లక్ష్యమే లక్షణ ప్రమాణమని జనవ్యవహార రూపాలు చాలామటుకు గ్రామ్యాలని ఇష్టమొచ్చినట్లు భాషను విభజించేశారు. గ్రాంధికమని గ్రామ్యమని, సాధురూపాలని అసాధు రూపాలని, సిద్ధరూపాలని సాధ్యరూపాలని విభజించేశారు. "పండితులు తాము రాసింది ఇతర పండితులకు అర్థం కావాలనుకోగూడదనే నిబంధన పెట్టుకున్నారనిపిస్తుంది. చివరకు పనిగట్టుకొని పసిపిల్లలకోసమని రాసిన పుస్తకాల్లో కూడా ఒకే వాక్యంలో పాతకాలపు మాటల సరసనే నేటి కాలపు మాటలు దొర్లుతుంటే వాటిమధ్య సమన్వయం లేక అవి కర్ణకఠోరంగా ఉంటున్నాయి. చిన్నపిల్లలకు ఉద్దేశించిన తమ "ఈసప్ కథ" ల్లో రావ్ బహదూర్ కె. వీరేశలింగం పంతులుగారు కూడా ప్రాచీన ప్రయోగాలను పరిహరించాలని భావించలేదు. వాస్తవంలో గిడుగు వారు చాలా తెలుగు పుస్తకాలను కళ్ళలో వత్తులు పెట్టుకొని చూసి, ఎనిమిదేళ్ళ పిల్లవాడు ఉపాధ్యాయుడి సహాయం లేకుండా చదివి అర్థం చేసుకోగల కథల పుస్తకం ఒక్కటీ లేదనీ" నేటి తెలుగు నివేదికలో వాపోయారు.

విద్యార్థులను తికమక పెట్టి అయోమయానికి గురిచేస్తున్న విషయాలను ఎన్నింటినో గిడుగు రామమూర్తి పంతులుగారు తమ బాలకవి శరణ్యంలో విస్తృతంగా చర్చించారు. అంతేగాదు వ్యవహారంలోని వాడుకభాషను జీవద్భాషగా వివరించారు. ఉదాహరణకి కూతురిని, కూతురికి, (కూతుంద్రు), కూతుళ్లు అనే అంశంపై చేసిన చర్చలో ఇలా అంటారు. "ఎవరి యిష్టము వచ్చినట్లు వారు కావ్యభాషను తారుమారు

చేస్తే అదే సాధుభాష అని భ్రమపడుతున్నారు. పండితులు పుస్తకాలు ఏ భాషలో వ్రాసినా శాస్త్రాలు ఏలాగు కల్పించుకొన్నా లౌకిక భాషను నిర్మూలనం చేయలేరు. అది వారి నోట్లోనే కాపురముంటుంది, నాలుకలమీద నాట్యమాడుతూ ఉంటుంది, సలక్షణముగా వృద్ధి పొందుతుంది''అని బాలకవిశరణ్యం లో వివరించారు. లౌకిక భాష అంటే జన వ్యవహార భాషఅని పదేపదే వివరించారు.

వ్యావహారిక భాషలోని మాటలన్నీ సిద్ధరూపాలుగా గ్రహించి వాటికి లక్షణం చేకూర్చాలేగాని వాటిని అసాధు రూపాలుగా భావించరాదు. వ్యావహారిక భాషలోని మాటలు లోకుల వ్యవహారం నుండి పుట్టిన సహజాలు. కవులు పనిగట్టుకుని రాసిన కృతకాలు కావు. లోకవ్యవహారంలోని సిద్ధ రూపాలే శబ్దానుశాసనాలు కావాలి గాని కవి ఛందస్సుకోసం చేసిన కృతకరూపాలకు శబ్దానుశాసనాలు తయారుచేసి వాటిని విద్యార్థులకు ఆధునికయుగంలో వంటపట్టించడంకోసం మూర్ఖంగా ప్రవర్తించడం అవివేకమని తెలిపారు. లోకవ్యవహారంలో లేని కవి ప్రయోగాలకు ప్రాధాన్యమిచ్చి చేసే భాషాశాసనం శాసనంగా చిరకాలం నిలవదని గిడుగు రామమూర్తి పంతులుగారు ఎడనెడ తమ రచనల్లో ఉపన్యాసాలల్లో పత్రికల్లో నొక్కి నొక్కిచెప్పారు.

తెలుగు భాషలోని దేశ్య రూపాలను కాదని వాటి స్థానంలో పాండిత్య ప్రకర్షకోసం ఔచిత్యానౌచిత్యాలు ఆలోచించకుండా ఇతరేతర భాషారూపాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంవల్ల తెలుగు భాషకు పట్టిన చీడను వదిలించడానికి గిడుగు చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు. ఎన్నో సార్లు తమ ఉత్తరాలద్వారా నివేదన చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. సాహిత్య సృజనలో ప్రాచీన పోకడలను పోగొట్టి ఆధునికతను పంచాలని బ్రిటీష్ విద్యావేత్తలైన అధికారులు ఎందరో ఆశించారు. వారి ఆశయాలను అందిపుచ్చుకున్న స్వదేశీయులు ఆధునిక పోకడలతో సాహిత్య సృజన చేయసాగారు. వీరిలో కొంత మంది సాహిత్య వస్తువులో సమకాలీన సమాజ స్థితిగతులు, రచనా భాషలో ప్రజల వాడుక భాష, రూపనిర్మాణశిల్పంలో పాశ్చాత్యుల అనుకరణను స్వదేశీ పండితులు పాటించారు. ఇలా కొత్తపోకడలతో ఆధునిక రచనలు చేసిన వారిని సంప్రదాయులు సొంత భూమిలో ప్రవేశించిన దొంగలతో సమానంగా పరిగణించారు. అప్పటినుండి ప్రాచీన అర్వాచీనుల మధ్య సాహిత్య భాషపై చిచ్చురేగింది.

ఈ విషయాన్నే నేటి తెలుగు-నివేదికలో గిడుగు "పాతకాలపు పండితులుకూ ఆధునిక విద్యావేత్తలకూ మధ్యగల వివాదాంశాలు తీసిపారేయదగినవి కావు. అవి కీలక ప్రాధాన్యం కలవి. మొట్టమొదటగా పాతకాలపు పండితులు తమ సమస్త సాహిత్యాదర్శాలనూ వ్యక్తీకరించటానికి వాడాలని పట్టుబట్టే భాష తామే రాయలేని, తమకు పూర్తిగా అర్థంకాని భాష. ప్రస్తుతం వాడుకలో లేని భాష సాహిత్య ప్రయోజనాలకు పనికిరాదని ఆధునిక రచయితలంటారు. అటువంటి భాషలో రాసిన సాహిత్య గ్రంథం ప్రజలను ఆకర్షించలేదు కాబట్టి

నిరుపయోగం. సామాన్య జనాలు సంస్కృతం, ప్రాకృతం, ప్రాచీనాంధ్ర పదాలూ నేర్చుకోవాలనుకోలేం. కానీ వాళ్ళకు జ్ఞానం బోధించే వినోదం కల్పించే గ్రంథాలు అవసరమే. అలాగే పిల్లల విషయంలోనూ. ఈ కాలంలో మర్యాద పూర్వకమైన సామాజిక సంబంధాల అవసరాలన్నీ తీర్చే భాషే సాహిత్య ప్రయోజన సాధనకు కూడా సర్వోత్తమం. ఇటువంటి భాష ఇప్పటికే తగినంత సంస్కారం పొంది వుండకపోతే వ్యవహారంలో కాలక్రమేణ సంస్కృతమవుతుంది. ఇంతకాలం ఈ భాషను అశ్రద్ధ చేయటమే తప్పు. మరికొంతకాలం ఇదే అశ్రద్ధ చూపటం నేరం. తన అజ్ఞానంవల్ల పండితుడు తన మాతృభాషనే గ్రామ్యభాషఅని, అందులోని రూపాలను వ్యాకరణ విరుద్ధాలని నిందిస్తున్నాడు'' అని వెలిగక్కారు.

భాషకు పరిమితులేమిటి. వాడుకలో ఉన్న రూపాలకు సాహిత్య గౌరవం కల్పించాలన్నది అతిసామన్యమైన భాషా సూత్రం. దీన్ని ఎవరూ ఎవరిమీదా బలవంతంగా రుద్దాల్సిన అవసరం లేదు. ఇది సహజంగా అందరూ అంగీకరించాల్సిన అంశం. ప్రాచీన కవులు సంస్కృత నిఘంటువులను ఔపోశనపట్టి కావ్యాలు రాసి ఉంటే ఉండవచ్చు. అది నాటి అవసరం. కానీ నేడు భాషాజాతీయుల్లోని విద్యావేత్తలు, రచయితలు తమ భాషలోని నిజస్థితిని గ్రహించి వాడుక భాషాలోని తమవైన మాటలకు రచనల్లో స్థానాన్ని కల్పించడం చాలా అవసరం. ప్రజల వాడుక భాషలోని పదాలను సేకరించి ప్రాదేశిక, ప్రాంతీయ, సాంఘిక వర్గీకరణలతో పదకోశాలు తయారుకావాలి అప్పుడే తెలుగు పదసంపద నిండుగా వెలుగు చూడగలదు. తెలుగు పదసంపదలోని రూపాంతరతను మాండలిక దృష్టితో చూడాలి. ఒక మాటకున్న అనేక రూపాలను, రూపాంతరాలను ప్రాంతీయ. చారిత్రక, సాంఘిక మాండలికం దృక్పథంతో దర్శించినపుడు మాత్రమే సహజ భాష నిర్మాణ వ్యవస్థ తెలుస్తుంది.

ఈ విషయాన్నే గిడుగు "మాండలిక భేదకారణంగా గాని, భిన్న కాలాల్లో ఆయా పదాలు మార్పులకు గురి అయినందువల్ల గాని గ్రాంథికాంధ్రంలో కొన్ని పదాలకు అనేక రూపాంతరాలున్నాయి. ఉదా. 1.ఊయేల; ఊయల, ఉయాల, ఉయ్యేల, ఉయ్యెల, ఉయ్యాల మొదలైనవన్నీ సమానార్థకాలే. 2. ఒకరిత, ఒకర్త, ఒకర్తు, ఒకర్తుక, ఒకత, ఒకతుక, ఒకరిత, ఒకొర్త, ఒకర్తు, ఒకర్తుక, ఒకొత, ఒక్కరిత, ఒక్కొర్త, ఒక్కొరుత, ఒక్కొర్తుక, ఒక్కత, ఒక్కొతుక, ఒకరితి, ఒక్కరితి, ఒకర్తి, ఒకతి, ఒకొరిత, ఒకొర్తి, ఒకొతి,ఒక్కర్తి, ఒక్కతి, ఒక్కొరితి, ఒక్కోర్తి, ఒక్కొతి, ఒకరితె, ఒకర్తె, ఒకతె, ఒకొరితె, ఒకొర్తె, ఒకొతె, ఒక్కరితె, ఒక్కర్తె, ఒక్కతె, ఒక్కొరితె, ఒక్కొర్తె, ఒక్కొతె, ఒర్తి, ఒర్తు, ఒర్తె, ఒర్తుక –అన్నీ మహతీవాచకమైన "ఒక స్త్రీ'ని సూచించేవే. ఒకే పదానికి ఎన్నో రూపాంతరాలను అంగీకరించగల విశాలహృదయంగల మన ప్రాచీన పండితులవారసులు ఆధునిక వ్యవహారంలోని మాటల సహజ భాషాయోగ్యతను గుర్తించటానికి నిరాకరిస్తున్నారు''.

ప్రాచీన కవుల రూపాంతరాలను నిఘంటుకారులు ఛందస్సు అవసరాలతో సరిపోల్చి సహజ రూపాలు కాని వాటిని పరిహరించి తక్కినవాటికి నిఘంటువుల్లో స్థానం కల్పించాలి. అలాంటివాటినే వ్యాకరణాంశాలుగా చర్చించాలి. ఆ రీతుల్లో భాషను అధ్యయనం చేసినపుడే భాషలో ఆధునికతను సాధించి సహజభాషకు న్యాయం చేకూర్చగలం అంటారు గిడుగు.

నేటి ప్రజల వ్యవహృత భాషలోని వ్యాకరణాంశాలను, ఆధునిక యుగంలో వ్యావహారిక భాషలో వెలిసిన రచనల్లోని వ్యాకరణాంశాలనూ లక్షణీకరించడంలో లాక్షణికులు ముందుకు రావాలి. అప్పుడే తిరుపతి వెంకట కవులు చెప్పిన "తెలుగుకు వ్యాకరణ దీపం చిన్నది' అన్న అపవాదు తీరగలదు. లాక్షణికులు తమ గిరులను దాటి భాషా శాస్త్ర రీతులను అనుసరించాల్సిన అవసరం ఎంతో ఉంది. అంతేకాదు ఇక్కడ గమనించాల్సిన విషయం మరొకటి ఏమిటంటే తెలుగు భాషనుగురించి ఆలోచించే వారికి ద్రావిడ భాషల్లోని పదవిజ్ఞానంపైన, పదప్రత్యయ నిర్మాణాలపైన తప్పనిసరి అవగాహన ఉండాలి. అప్పుడే తెలుగుమాటలకు వ్యాకరణాంశాల నిర్మాణ రీతులు సంపూర్ణంగా అర్థం కాగలవు. అప్పుడే జీవద్భాషకు సహజ వ్యాకరణం రచించగలరు. ఎప్పుడో రాసిన భాషకు రచించిన వర్ణనాత్మక వ్యాకరణాన్నే ఎప్పటికీ ప్రమాణమనుకుని తెలుగు భాషకంతటికీ భాషకు అదే శాసనం అని ప్రవర్తిల్లడం ఆధునిక లక్షణం అన్పించుకోదు. భాషలో వస్తున్న మార్పులను చేర్పులను వార్పులను కూర్పులను సహేతుకంగా వివరించి చూపేలా ఎప్పటి కప్పుడు లాక్షణికులు వ్యాకరణ గ్రంథాలను నవీకరిస్తూ ఉండాలి. అప్పుడే భాషలో సహజంగా మారుతున్న మార్పులను సూత్రీకరించగలం.

ఈ విషయాలనే గిడుగురామమూర్తి పంతులుగారు "ఉచ్చరిత ధ్వనుల ఉచ్చారణలోని మార్పుకు ఆ సమాజ వ్యవహార ప్రవృత్తిలోని మార్పే కారణం. ఈ మార్పే సమీకరణలో, సంధిలో, నియతిలో, అస్పష్టీకరణంలో, కొన్ని అక్షరాలు లోపించటంలో ప్రాచీనాధునాతన విధానాల మధ్యగల భేదాన్ని తెలుపుతుంది. ఉదాః వలవదు–వలదు–వద్దు;వలయును–వలెను; ముదుసలి–ముసలి; ఇచ్చినవాడను–ఇచ్చినాను; అనియెడునవి–అనేవి; ఉనిచికొనుము–ఉంచుకో, మంఽ్రె–మనుదురె'' అని తెలిపారు.

"ఊనిక పదమధ్యం నుంచి పదాదికి మారినందువల్ల అనేక పదాల ఉచ్చారణతో బాటు రూపాలు కూడా ప్రభావితమైనాయి. ప్రాచీనాంధ్రంలోని "గుణ్టమ్మునకు" అనేది "గుఽ్రానికి" అని మారింది. ప్రాచీనాంధ్రంలో ఊనిక పదాంతానికి దగ్గరలో ఉండేది బహుశా ఈ గుణమే పదాద్యచ్చులు విచిత్రంగా లోపించటం, పదమధ్యాచ్చులు గాని తరవాతి హల్లుగాని దీర్ఘం కావటం అనే పర్యవసానాలకు దారితీసింది. ఉదాః ఆనక – అనాక ...కానీ ఈ స్వభావం ఊనిక మార్పుతో లోపించింది. చాదస్తపు రచయితలు

"ఎండనాక, వాననాక' వంటి పాత పదబంధాలంటే ఇష్టపడతారు.......పండితులు తెలుగులో పరుష సరళధ్వనుల ప్రయోగ విషయంలో ఉన్న అయోమయం తక్కువదేమీ కాదు.

ధ్వనిశాస్త్రంతో భాషాతత్వంతో ఏపాటి పరిచయమున్నా అటు ప్రాచీన భాషలోగాని ఇటు నవీన భాషలోగాని వాటిని స్పష్టంగా గుర్తించి చెప్పవచ్చు. కానీ పండిత ప్రయోగాలు మాత్రం వ్యాఖ్యానాలకు అందవు. "చితుకు, చిదుగు, చిదుకు, చితుగు' వంటి పదాలు వేలసంఖ్యలో ఉన్నాయి. .... ఈ రహస్యం తేలక పాపం బ్రౌన్ గందరగోళంలో పడటం అతడి తప్పుకాదు. "కడప, గడప; వెతకు, వెదకు' ఏది ...శుద్ధశబ్దం. ఏ పండితుడయినా "తురపిల్లు' ఎందుకు తప్పో "దురపిల్లు' ఎందుకు ఒప్పో చెప్పగలడా? "కంపు – గబ్బు, ఇంపు – ఇంబు" లు భేదంలేని మాటల్ని తెలుసుకొంటే తమిళంలోని "కుత్తు', తెలుగులోని "గుద్దు' అలాగే ఒకే పదమని తెలుసుకొంటే, నేటి తెలుగు శబ్దాల ఉచ్చారణలోని మార్పులను గురించి వాదులాటే ఉండదు" అంటారు గిడుగు.

అనునిత్యం ఎదిగే భవిష్యత్ గల భాషను మృత్యు ఒడిలోకి చేర్చడం ఎంతవరకు సమంజసం? తనదిగాని తనాన్ని తనకు ఆపాదించుకుంటూ ఎంతకాలం మనుతుంది? సహజ భాషకు సజీవభాషకు ఒకరు శాసిస్తే శాసింపబడే గుణం ఎంతో కాలం ఉండదు. సమయం సందర్భం తనకు అనుకూలంగా వచ్చినపుడు తనదైన విశ్వరూపాన్ని చూపుతుంది. ఆ విశ్వరూపమే ఆయాకాలాలల్లో ఆధునికం అవుతుంది. ఈ విషయాన్ని గిడుగురామమూర్తి పంతులుగారు తమ సాహిత్యవ్యాసాలల్లో, బాలకవిశరణ్యంలోనూ, గిడుగులేఖల్లోనూ, నేటితెలుగు నివేదికలోనూ, ఆంధ్రపండితభిషక్కుల భాషా భేషజంలోనూ, తన సంపాదకత్వంలో వచ్చిన తెలుగు పత్రికలోనూ అనేకానేకసార్లు ప్రస్తావించారు.

ప్రజల భాష సాంస్కృతిక ప్రసరణల చిహ్నమని అది గతించిన తరాల విలువలను, ఆచార వ్యవహారాలను, జీవన శైలిని భవిష్యత్ తరాలకు అందించే వాహిక అనీ గ్రహించిన గిడుగు 1936లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రకటించిన కళాప్రపూర్ణ బిరుదుని ప్రజల భాషని గౌరవించే వ్యావహారిక భాషా వాదులందరికీ అంకితమిస్తున్నట్లు ప్రకటించి వ్యావహారిక భాషకు ఆధునిక గౌరవం చేకూర్చారు.

21 వ శతాబ్దంలోకి అడుగుపెట్టి 13 సంవత్సరాలు గడిచిపోతున్నా ఇంకా మనం భాషకు సాధుఅసాధు రూపాలు అని సంకెళ్లు వేసుకుంటూ పోవడం వల్ల, భాషాభివృద్ధి కుంటుపడి భాషకు తీరని నష్టం వాటిల్లిందన్న విషయంపై, మనకుసరైన అవగాహన కలగలేదంటే గిడుగు ఆత్మ ఎంత క్షోభిస్తుందో అర్థం చేసుకోవాలి. గిడుగు కోరిన ఆధునికంవైపు మన అడుగులు పడాలంటే నేటి తెలుగును మనం మనదైన రీతుల్లోకాకుండా భాషాశాస్త్రదృక్పథంతో భాషలోని వర్ణనిర్మాణం, రూపనిర్మాణం, సంధిస్వరూపం, పదబంధస్వరూపం, సమాసగతి, వాక్య నిర్మాణ రీతి మొదలైన వాటిని అధ్యయనం చేస్తూ ఆయా

కాలాలల్లోని రచనల నుండి నేటి వరకూ ఉన్న జీవద్భాషా స్వరూపాన్ని వర్ణనాత్మక వ్యాకరణ దృష్టితో పరిశీలించి తెలుగు భాషా స్వరూప విస్తృతిని అటు నిఘంటువుల రూపంలోగానీ వ్యాకరణగ్రంథాలరూపంలోగానీ వెలుగులోకి తీసుకురావాలి. అదే గిడుగుకు తెలుగువారు అర్పించే నివాళి.

## సంప్రదింపు గ్రంథాలు


1. వేంకట రామమూర్తి, గిడుగు, 1879(ప్ర.ము): ఆంధ్ర పండిత భిషక్కులభాషాభేషజం, విశాలాంధ్ర-ప్రచురణాలయం, విజయవాడ.
2. వేంకట రామమూర్తి, గిడుగు, 1991(ప్ర.ము): నేటి తెలుగుఃనివేదిక, విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
3. వేంకట రామమూర్తి, గిడుగు, 1992(తృ.ము): సాహిత్య వ్యాసాలు, విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
4. రాజు, ఎన్.ఎస్. 2001(ప్ర.ము): గిడుగు లేఖలు, విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాదు.
5. రామారావు, చేకూరి, 1986: మరోసారి గిడుగు రామమూర్తి, Hyderabad book Trust, Hyderabad
6. రమాపతిరావు, అక్కిరాజు, 1971(ప్ర.ము): వ్యావహారిక భాషా వికాసం – చరిత్ర, M.Seshachalam&co, మచిలీపట్టణం.
7. వేంకట రామమూర్తి, గిడుగు, 1933: బాలకవిశరణ్యం, ప్రకాశకులు – తెలికిచర్ల వెంకటరత్నం, గుంటూరు.

# భాషాశాస్త్రవేత్తగా 'గిడుగు'

## 'Gidugu' as a Linguist

Dr. B. Bhujanga Reddy,
Asst. Professor, Dept. of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.

''వాడిక గద మాట ప్రాణంబు మానంబు
వాడనట్టి మాట పాడు పడును
చెల్లుబడినిబట్టి చేకొంద్రు లోకులు
మాడలైనఁ గవుల మాటలైన''

–గిడుగు రామమూర్తి (బాలకవి శరణ్యము:14)

మహామహోపాధ్యాయ, రావుసాహెబ్, కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులుగారు (12.08.1863 – 22.01.1940) బహు భాషా వేత్త (తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, సవర, ఒరియా మొదలైన భాషలు బాగా తెలిసినవారు.), భాషాశాస్త్రవేత్త. బహు భాషలు మాట్లాడడం తెలియడం వేరు. బహు భాషల స్వరూప స్వభావాలు, వాటి నిర్మాణం, వాటి చరిత్ర, వాటి పరిణామ క్రమం తెలియడం వేరు. బహు భాషలు తెలిసినవారందరూ భాషాశాస్త్రవేత్తలు కాలేరు. కాని, గిడుగువారు మాత్రం బహు భాషావేత్త. భాషాశాస్త్రవేత్త కూడా. అయితే, అనేకమంది విమర్శకులు రామమూర్తిగారిని కేవలం వ్యావహారిక భాషా వాదిగానే గుర్తించారు. కొందరు ఆయనను భాషాశాస్త్రవేత్తగా గుర్తించినా దానికి తగినన్ని ఆధారాలు చూపించలేదు.

''భాషాశాస్త్ర అవసరాలు మాకు తెలిసినంతవరకు మొదటిసారిగా గుర్తించిన వారు గిడుగు రామమూర్తి పంతులుగారు. సవరభాషా వ్యాకరణ నిర్మాణం కోసం ఆయన తన కాలానికి అందుబాటులో ఉన్న శాస్త్ర విషయాల్ని అధ్యయనం చేశారు. తెలుగు భాషను గురించి కూడా ఆయన శాస్త్రపద్ధతిలో ఆలోచించారనడానికి ఆధారాలున్నాయి.... పై సంఘటనలవల్ల ఆయన్ని ప్రథమాంధ్ర భాషావిజ్ఞానిగా గుర్తించవలసి ఉంటుంది'' అని చేకూరి రామారావుగారు అన్నారు(రామారావు, 1972; 33). ''వ్యాకరణశాస్త్రకారుడు భాషా ప్రయోగంలో సాధు– అసాధు రూపాల్ని నిర్ధారిస్తాడు. భాషా విజ్ఞాని అలా

కాకుండా సాధు– అసాధు రూపాల వెనుకనున్న భాషా నిర్మాణ వైవిధ్యాన్ని, చారిత్రక పరిణామాన్ని వివరించే ప్రయత్నం చేస్తాడు. ఈ అర్థంలో గిడుగు రామమూర్తిగారు తొలి తెలుగు భాషా విజ్ఞాని'' (బ్రహ్మానంద 1965;46) అని హెచ్.ఎస్. బ్రహ్మానందగారు అన్నారు. ఎస్వీ. సత్యనారాయణగారు '' తొలి తెలుగు భాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తి'' (సత్యనారాయణ, 2008; 11–14) అనే వ్యాసంలో రామమూర్తిగారిని తొలి తెలుగు భాషాశాస్త్రవేత్తగా పేర్కొన్నారుగాని, అందుకు సరైన ప్రమాణాలు చూపించలేదు. గిడుగు రామమూర్తిగారిని తెలుగువాడైన తొలి భాషాశాస్త్రవేత్తగా సప్రమాణంగా నిరూపించడం ఈ ప్రతం ఉద్దేశం. గిడుగు వారు సవరభాషకు వ్యాకరణం, వాచకాలు, నిఘంటువులు రాయడానికీ, తన వ్యవహారిక భాషావాదాన్ని నెగ్గించుకోవడానికీ భాషాశాస్త్ర శాఖలైన ధ్వనిశాస్త్రం, పదనిర్మాణ శాస్త్రం, మాండలికశాస్త్రం, చారిత్రక భాషాశాస్త్రం, తులనాత్మక భాషాశాస్త్రం, నిఘంటు నిర్మాణశాస్త్రం మొదలైనవాటినిఆధారం చేసుకున్నారు. వాటిని ఈ పత్రంలో మచ్చుకు కొన్ని చూపించడం జరుగుతుంది.

## 1. ధ్వనిశాస్త్రం (Phonetics)

1913 లో డేనియల్ జోన్స్ అనే ప్రఖ్యాత ధ్వనిశాస్త్రజుడు మద్రాసులో కొన్ని ఉపన్యాసాలివ్వడానికి వచ్చినప్పుడు తెలుగు భాషలోని 'మేకు– మేక', 'గోదు–గోద' లాంటి జంట పదాల్లోని మొదటి అచ్చుకూ, రెండో అచ్చుకూ ఉచ్చారణ భేదం ఉందన్న అంశాన్ని రామమూర్తిగారు ఆయనతో చర్చించగా రామమూర్తిగారి పరిశీలన సరైనదేనని జోన్స్ అంగీకరించారట (రామారావు, 1972; 33). కొద్ది కాలం తరువాత విజయనగరంలో జరిగిన సదస్సులో రామమూర్తిగారు విలియం జోన్స్ పద్ధతిలో Telugu Phonetics పై ఉపన్యాసాలిచ్చారట (Shehagirirao, డిసెంబర్ 1986;227). తాటాకు, మట్టాకు (చూ. ఇత్వసంధి) శబ్దములలో మధ్యవర్ణముపై నున్న అచ్చు కేవలము అకారము కాదు. ఆ, ఏ లకు మధ్యస్థమైన స్వరము. తాలవ్యము. ఇంగ్లీషు భాషలో(manమాన్ అనే పదములోని అచ్చువంటిది....తెలుగు వారందరూ తరుచుగా ఉచ్చరిస్తూ ఉన్న ఈ స్వరము, దీనికి సరియైన అక్షరములేదని, విడిచిపెట్టుకోవడము వివేకము కాదు....గనుక కొత్త చిహ్నం ఒకటి కావలెను. పైని సూచించినట్లు తాటాకు అని టాపైని ఒక చుక్క పెడితే చాలును'' (రామమూర్తి, 1969; 250) అని తాలవ్య వివ తాచ్చును గుర్తించడమే గాక, దానికి ఒక లిఖిత చిహ్నాన్ని కూడా సూచించారు. తెలుగు భాషలోని ఈ ధ్వనిని గుర్తించిన మొదటి వ్యక్తి బహుశా గిడుగువారే కావచ్చు.

అలాగే, "A Manual of Sora Language" (1931) అనే ఈ వర్ణనాత్మక వ్యాకరణంలో సవర భాషలోని ధ్వనులనూ, సంధులనూ, సమాసాలనూ, వాక్యాలనూ భాషాశాస్త్ర పద్ధతిలో విశ్లేషించడం గమనించవచ్చు ''సవర భాషాపరంగానే కాక భాషాశాస్త్ర పరంగానూ రామమూర్తిగారు ఇందులో ఎన్నో

విశేషాంశాలను చర్చించియున్నారు. కాబట్టి ఆస్ట్రిక్ భాషా కుటుంబ చరిత్ర పఠనానికి ఇది అత్యంత ఉపయోగకరమైనది.'' (జానకి, మార్చి 1991; 41)

ఈ పుస్తకాన్నంతా అంతర్జాతీయ ధ్వని చిహ్నాల (International Phonetic Alphabets)తో రాయడం విశేషం. ''ప్రతియొక్క వ్యాకర్తకు **శబ్దశాస్త్రము**తో తప్పక పరిచయముండాలని, అది లేనినాడు వారి ప్రయత్నమంతా వ్యర్థమౌతుందని భావించారు. Phonetic laws are the basis of all linguist research. Any etymologist who ignores them would labourinvain'' (జానకి, మార్చి 1991; 111–112) అజాకర్షణ (vowel harmony)అనే ధ్వని పరిమాణాన్ని ఆయన వివరించిన తీరు ఆయనకు ధ్వనిశాస్త్రంపై ఉన్న అవగాహనకు మచ్చుతునక.

''ఆధునికాంధ్ర భాషలో వేలాది పదాల ఉచ్చారణను ప్రభావితం చేసిన పరమ ముఖ్య పరిణామం ప్రాచీనకాలంలోనే మొదలయిన ఒక విలక్షణ విస్త త నియమానికి ఫలితం. దీన్ని అజాకర్షణ సూత్రం అంటారు. బహువచన ప్రత్యయం 'లు' చేరినప్పుడు 'కలిమి' అనే ఏకవచన రూపం ' కలుములు'గా మారుతుంది. ఆ లువర్ణకంలోని అచ్చు ఒక్క మొదటి అచ్చు మినహా తక్కిన వాటన్నిటినీ ఆకర్షించి తనలా మార్చింది. దానిమీద ఊనిక ఉంది కాబట్టి అది మారలేదు. ఈ మార్పును సంప్రదాయ వ్యాకరణం గుర్తించింది కానీ దీనికి ఆధారమైన ధ్వని సూత్రాన్ని పురస్కరించుకొని ఎక్కడా వివరించలేదు. ఈ భాషా సూత్రం తనకు తెలియని పండితుడు ' మఱుదులు' వంటి రూపాలు అదే సూత్రం ప్రకారం ఏర్పడ్డవయినా వాటిని నిషేధిస్తున్నాడు; ప్రాచీన రూపం ' మఱఁదులు' సాధువంటున్నాడు. ప్రాచీన భాషలో రెండో అక్షరంలోని అకారం తరువాత అనునాసిక ధ్వని ఉంది కాబట్టి , ఊనికతో ఉండేది కాబట్టి, దాన్ని స్పష్టంగా ఉచ్చరించవలసి వచ్చింది. ఊనిక మార్పు ఫలితంగా ఆధునిక భాషలో అనునాసికం తొలగిపోయి, ప్రత్యయాచ్చు ప్రభావంవల్ల తేలిపోయి సమీక తమయింది. ఈ విధంగా వేల సంఖ్యలో గల పదాల్లో ఆధునిక భాష అజాకర్షణాను క్రమంలో ఉండవలసి వచ్చింది'' (రాధాక ష్ణ, ఆగస్టు 1991; 38)

## 2. పదనిర్మాణ శాస్త్రం(Morphology)

''మిశ్ర సమాసములు; ఆంధ్ర శబ్దముతో కలిసి సమాసముగా ప్రయోగించడము దోషమని, 'మడి' కట్టుకొన్న 'చాదస్తపు' పండితులు శాసిస్తే, చెల్లదు. ఒకరిని ఒకరు ముట్టుకోకుండా రేల్ బండిలో కూర్చొని ప్రయాణం చేయడము అసాధ్యము కాదా? అట్లే వివిధ భాషలు మాట్లాడే వారితో సహవాసము చేసినప్పుడు భాషా సాంకర్యము తప్పదు. సంస్క తములోనే చేరినవి అనేక శబ్దాలు అన్యభాషలలోనివి. (చూ. అన్యదేశ్యాలు) మేషాది రాసుల పేళ్ళు హోర, ద్రేక్కాణ, కేంద్ర, అనఫా మొ. పారిభాషిక పదాలు గ్రీకుభాషలోనివి; వాటితో

సంస్క త శబ్దాలు చేర్చి సమాసమును కల్పించినారు కారా జ్యోతిశాస్త్ర నిర్మాతలు? అట్లే 'తురకలు' రాజ్యము చేసినప్పుడు 'తురకమాటల'తో తెనుగుమాటలు, సంస్క త శబ్దాలు కలసి సమాసాలు ఏర్పడి లౌకిక భాషలో నెలకొన్నవి ఉన్నవి; ఎవరు తొలగించగలరు? 'గ్రామనాయుడు' వంటిదే 'గ్రామమునసబు' ....అన్ని భాషలలోనూ ఇట్టి సాంకర్యమున్నది. కన్నడములో 'వైరిసమాసము'లనిన్ని ఇంగ్లీషులో హైబ్రిడ్జ్ (Hybrids) అనిన్ని ఇట్టివాటికి పేరు; పారిభాషిక పదముగా భాషానుశాసనము చేసినవారు పెట్టినారు. సమాసముల వ్యుత్పత్తి తెలియజేస్తుంది ఆపేరు. అంతేకాని, అట్టి సమాసములు అసాధువులని సూచన అయినా దానిలో లేదు.''

## 3. మాండలిక శాస్త్రం (Dialectology)

"A Manual of Sora Language" లో సవర భాషలో గ్రామ గ్రామానికీ తేడాలున్నాయనీ, అలాగే, వయస్సునుబట్టి, స్త్రీ, పురుషులనుబట్టి భాషా భేదాలున్నాయనీ సవర భాషలోని మాండలికాలను గుర్తించారు.మాండలికాలవల్లనే భాష అభివ ద్ధి పొందుతుందని అన్నారు. ''దేశాటనము చేసేవారు తమ గ్రంథాలలో అన్యదేశ్యములేకాక **మాండలీయకాలు** కూడా యథేచ్ఛముగా ప్రయోగిస్తున్నారు. అట్టివి భాషలో అంతర్భూతము లవుతూ దానిని ''వ ద్ధి'' పొందిస్తూ ఉంటవి'' (రామమూర్తి, 1938; 13, 14)

''తెలుగు భాష అనేక కోటి ముఖముల ప్రవహిస్తూ ఉన్నప్పుడు తెలుగు వారందరూ నేడు సరిగా ఒక్కలాటి తెలుగే వ్యవహరిస్తున్నారని చెప్పలేము. దేశమునుబట్టి, జాతినిబట్టి, వ త్తిని బట్టి, మతమునుబట్టి, విద్యనుబట్టి, వయస్సునుబట్టి, నాగరకతనుబట్టి, ఎంతో కొంత వ్యత్యాసము ఏర్పడక తప్పదు.'' (రామమూర్తి, 1976; 116) వాడుక భాష ఒక మండలంలో ఒక విధంగానూ, మరొక భాషలో మరోవిధంగానూ ఉంటుంది. అక్కడి మాటలు ఇక్కడివారికీ, ఇక్కడి మాటలు అక్కడివారికీ అర్థంకావు. కాబట్టి వాడుక భాష గ్రంథ రచనకు పనికిరాదనేవారి వాదానికి గిడుగువారు ఈ కిందివిధంగా జవాబిచ్చారు.

''సరే మీరన్నమాట నిజమే. ఒక మండలం వారి వ్యవహారంలో పప్పు, అద్దె, చెక్కలు, ఆనపకాయ అనే మాటలున్నవి. అవి రెండో మండలంవారి వ్యవహారంలో లేవు. ఆ రెండో మండలంవారి వ్యవహారంలో వాటికి సరిగా బేడలు, బాడుగ, వక్కలు, సొరకాయ అనే మాటలున్నవి. ఇవి మొదటి మండలంవారి వ్యవహారంలో లేవు. అయితే ఏమంటారు? తమ మండలములో లేక ఇతర మండలములో ఉన్నమాటలే వాడాలంటారా? ఏ మాటలూ వాడరాదంటారా? ఈ మాటలలో ఏదీ వాడకూడదంటే ఆ విషయం వ్రాయవలసి వచ్చినప్పుడు ఏలాగు వ్రాయడము? ఏ మాట ప్రయోగించము? సొరకాయావద్దు; ఆనపకాయా వద్దూ 'ఆలాబూ' అని

సంస్కృతంమాట వాడమంటారా? అని నేనడిగినప్పుడు నా ప్రతిపక్షులు ఒకరి మొగము ఒకరు చూచుకొని మాటాడలేక ఊరుకున్నారు. మాండలిక శబ్దాలు అన్ని భాషలలోను ఉంటవి. అన్నీ సాధువులే. భాషాలక్షణం చేసేవారు ఈ రూపాలన్నీ సేకరించి అనుశాసిస్తారు. పాణిన్యాదులు అలాగే చేశారు. ప్రాచాం– ఈ రూపము, ఉదీచాం– ఈ రూపము అంటూ అనేకంగా మాండలిక శబ్దాలు అనుశాసించారు. మన తెలుగు కవులు మాండలిక శబ్దాలు వాడుక చేశారు. 'పప్పు' శ్రీనాథుని హరవిలాసంలోను, 'బేడలు' ఆముక్తమాల్యదలోను ప్రయుక్తములయి ఉన్నవి'' అని అన్నారు. (రామమూర్తి, 1958;156,157)

వ్యావహారిక భాష ఉద్యమాన్ని నడిపింది గిడుగు రామమూర్తిగారైనా, వీరికి ఈ ప్రేరణ కలిగించినది స్వామినేని ముద్దు నరసింహ నాయనిగారు కావచ్చు. రామమూర్తిగారు పుట్టక ముందే (1856కు పూర్వమే) స్వామినేనివారు వాడుక భాష ప్రాధాన్యాన్ని గుర్తించారు. రచనల్లో గ్రామ్యపదాలను కూడ ఈయన స్వాగతించారు.

''పద వ్యాపారమునకు ఏర్పరచబడే హద్దులు భాషను రచించడమునకున్ను లిఖించడమునకున్ను సాధ్యమైనంత సులభముగా నుండవలసినది ఆవశ్యకమైయున్నది. ఆంధ్ర భాషయందు కొన్ని పదములలో నొకానొక యక్షరమునకు అర్ధానుస్వారము చేరి యుండడము జరూరైనట్టు లక్షణ గ్రంథములయందు చెప్పబడియున్నది కాని అటువంటి చాలా పదములు ఇప్పట్లో అదా నుస్వారము లేకుండానే సాధారణమైన భాషయందు వాడిక చెయ్యబడుచున్నవి. **పద వ్యాపారమందు హద్దు ఏర్పరచడమునకు దేశము యొక్క వాడికయున్ను నీతియున్ను ఆధారములై యుండవలసినది** గనుకనున్ను వాఁడు, వీఁడు అనే పదములు ఉచ్చారణయందున్ను వాక్యగ్రంథముల లిపియందున్నువాడు, వీడు అని వాడిక చెయ్యబడుచున్నవి గనుకనున్ను ఈ వాడిక ఉచ్చారణకున్ను లిపికిన్ని సులభముగా నున్నది గనుకనున్నుఅటువంటి పదములు **వాడికకు అనుగుణముగానే** యీ పుస్తుకమందు వ్రాయబడుచున్నవి'' (ముద్దు నరసింహనాయని, 1986 ;3, 4)

''గ్రామ్యోక్తి ఆంధ్రభాష తాలూక్ అంశములలో నొకటిగా లక్షణ గ్రంథములయందు చేర్చడము అరుదైయున్నదిగాని వాక్య గ్రంథములయందున్ను భాషయందున్ను వీటి వాడిక తరుచైయున్నది. యిందువల్ల భాషా రచన మిక్కిలి ధారాళముగా నుంచున్నదిగనుక **సాధారణమయిన భాషయందు వాడికలోనున్న గ్రామ్యపదములు చాలామట్టుకు సరసమయిన వాక్య రచనలో నంగీకరించ తగినవిగా నేను ఎంచుకుంటున్నాను**.'' (ముద్దు నరసింహనాయని, 1986 ;5)

## 4. సామాజిక భాషా శాస్త్రం (Socio Linguistics)

**ప్రమాణభాష**-భాషా పదాలు వ్యవహారంలో కాలక్రమంలో ఏయే మార్పులను పొందాయో తెలపాలేగాని మారిన రూపాలు ప్రయోగానర్హాలనడం సబబు కాదని భావించారు. కాబట్టి చారిత్రక వ్యాకరణాలే మంచివనిరామమూర్తిగారి అభిప్రాయం.

ఉదాహరణకు, ''మండపాక పార్వతీశ్వర శాస్త్రులుగారు ''చేయాలె'' అనే శబ్దముStandard కాదు అంటారు. 'చేయవలెను', 'చేయవలె' అయినది. పిమ్మట 'వ' కారము లోపించి, పూర్వాచ్చుకు దీర్ఘము వచ్చినది. ఇట్టి మార్పు తిక్కన కాలములోనే కనబడుతున్నది. 'పోయినవాఁడు' 'పోయినాఁడు', 'మాయలవాడు' 'మాయలాడు' – ఇట్టివి నన్నయ గ్రంథములో లేవుగాని తిక్కన గ్రంథములో ఉన్నవి. ఈ మార్పు క్రమంగా వ్యాపించినందున 'చేయవలె', 'చేయాలె' అయినది. అందరూ వాడుతూ ఉన్న శబ్దము Standard కాదా? Standard అంటే అట్టిదే.'' అని అన్నారు.(రామమూర్తి, 1938; 12)

''ఆంధ్రదేశములో అన్ని మండలముల వారికీ పరస్పర సంబంధం అన్ని విధాలా ఎప్పుడు ఏర్పడుతుందో; ప్రజలకు, నూటికి తొంభయిమంది చొప్పున అయినా, చదువు ఎప్పుడు వస్తుందో అప్పుడు ఆంధ్రభాషకు దానంతట అదే ఏర్పడుతుంది. అద్దైనా కేవలమూ ఏకరూపమున ఉండదు సుమండీ. పరమైకతగల భాష లోకములో ఎక్కడాలేదు. స ష్టిలో ఏ రెండు వస్తువులూ అన్ని విధాలా ఒక్కలాగున ఉండవు. Standard కోసము మనము పరితపించ నక్కరలేదు. పండితుల ప్రయత్నంవల్ల అది ఏర్పడదు'' . (రామమూర్తి, 1938; 8,9)

పరమైకతగల భాష లోకములో ఎక్కడా ఉండదు అనే దానికి నిదర్శనంగా *Britanica-Phonetics అనే గ్రంథం నుంచి ఈ కింది మాటలను ఉదాహరించారు. ఆ మాటలు ఇవి;* "A spoken language is, therefore, necessarily a vague and floating entity. And English is no exception to the rule…*A standard spoken language is, strictly speaking an abstraction*. No two speakers *of standard English pronounce exactly alike"*

నేడు బెంగాళీ సాహిత్యంలో కలకత్తాలోని వాడుక భాషనే రచయితలు వాడుతున్నారని సునీతి కుమార్ ఛటర్జీగారుA Brief Sketch of Bengali Phonetics (1921) అనే గ్రంథంలో చెప్పిన మాటలను సాక్ష్యంగా చూపారు. సునీతి కుమార్ ఛటర్జీగారి మాటలు ఇవి; "The Present day literary Bengali is often nothing but Calcutta colloquial, with only a few archaic inflections of the

verb; it is freely used in literature, especially in poetry, drama and fiction; and there is a strong body of writers who advocate the suppression of the old literary language by this living and vigorous form of spoken Bengali" (రామమూర్తి, 1976; 26) "స్వీట్ పండితుడు చెప్పినట్లు 'వచనములోని భాష మాట్లాడే భాషకు దగ్గరగా ఉంటుంది.'' (The language of prose often approaches very closely to that of ordinary conversation. Henry Sweet's English Grammar Vol.1) అని స్వీట్ పుస్తకంనుంచి ఉట్టంకించారు (రామమూర్తి, 1958;67).

''మన దేశములోని భాషలన్నిటిలో బంగాళీ భాష మిక్కిలి వికాసము పొందడమునకు కారణము దానికి ''పండితులు'' నిర్మించిన గట్లు కొట్టివేయడమే.'' (రామమూర్తి, 1938; 14, 15) ఇట్టి గట్ల వల్ల ఎంత కీడు బంగాళీ భాషకు కలిగినదో శ్రీ రవీంద్రనాథఠాకూరు గారు తెలుపుతూ రాసిన వ్యాసంలోని వాక్యాలను ఉదహరించారు.

## 5. చారిత్రక భాషాశాస్త్రం (Historical Linguistics)

ఇంగ్లీషు భాష మారి పాడైపోతూ ఉన్నదని పూర్వము భాషాతత్వము తెలియని కాలములో, ప్రతీతరమువారు తమ కాలపు భాషను గురించి మొరపెట్టేవారు. జాన్సన్ తన కాలపు భాష మారకుండా కట్టుకట్టి నిఘంటువులో బంధించడానికి ప్రయత్నించినాడు. నిఘంటువు పూర్తిగా రచించేసరికి అతని భ్రమ వదిలిపోయినది. జీవద్భాషను మారకుండా బంధించడం అసాధ్యమని ప్రకటించినాడు. (Thomas R. Lounsbury రాసిన The Standard of Usage in Englishనుంచి ఉదహరించారు.)

''షేక్స్పియరు కాలములో ఇంగ్లీషు భాష అశ్రుతపూర్వంగా విజ భించినట్లు ఈ కాలములో తెలుగు భాష విజ భిస్తున్నది. ఇంగ్లీషు భాషకు అప్పుడు కట్లూ గట్లూ ఉండాలని ఎవ్వరూ అభిలషించలేదు. అప్పుడు కావలసినది స్వేచ్ఛగాని నిర్బంధము కాదు. వెల్లువ వలె భాష ప్రవహించినది. వరదతో బురదా చెత్తా వచ్చిపడ్డది. అది అంతా క్రమంగా అడుగంటినది. స్వచ్ఛమైన భాష తేరినది. అప్పటినుండి ఇప్పటివరకూ ఇంగ్లీషు భాషావాహిని గట్టులేకుండానే 'టేమ్జ్' నదివలె నిర్మలముగా ఉన్నది. ఏటిలోనికి కొత్తనీరు రాకుండా గట్టుకడితే, ఏరు ఎండిపోతుంది; నీరుంటే మురిగిపోతుంది. భాషా స్వభావమును అనుసరించి, భాషలో భావ బోధమునకు కావలసిన మార్పులు కలుగుతూ ఉంటవి.'' (రామమూర్తి, 1958; 148)

''లోక వ్యవహారములో పండిత పామర సామాన్యముగా అందరినోటను నలుగుడు పడుతూ ఉన్న భాష ఎంతో కొంత మార్పు పొందడము భాషకు సహజధర్మమే... భాషాతత్త్వమెరిగిన వారికి భాష మారడము వింతగా కనబడనే కనబడదు. మారకపోవడమే అసంభవము.... భాషా చరిత్రమనగా భాషలో కలిగిన మార్పుల వ త్తాంతమేకదా. ఎప్పుడూ ఒక్కలాగున ఉండే భాషకు చరిత్రమేలేదు. వాడుకలో లేక గ్రంథములందు మాత్రమే నిలిచిఉన్న భాషకు మరి మార్పు ఉండదు; మరి చరిత్రమూ ఉండదు'' (రామమూర్తి, 1958;67,68).

ఆయనే మరో చోట ''జీవంతో ఉన్న ప్రతి వస్తువు మారడం సహజం. అన్ని జీవద్భాషలున్ను మారుతూ వచ్చినవి. మన తెలుగు భాష సైతము జీవద్భాష గనుక మారుతూ ఉంది. 'చేసితివేనిన్', 'చేస్తే' కావడం భాషలో కలిగిన పరిణామాన్ని చూపిస్తుందిగాని నాశనము చూపించదు. నన్నయనాటి భాషే నేటికిన్ని ఏ మార్పూ లేకుండా ఉన్నదనడం అబద్ధం; ఉండాలనుకోవడం అవివేకం. నన్నయనాటి గోదావరే ఈనాడూ ప్రవహిస్తూందిగాని ఆనాటి జలం ఈనాటిది కాదు. అందుచేతనే 'నిత్యప్రవాహినీ దేశ్యా' '' అని అన్నారు.

చారిత్రక క్రమంలో ప్రతి భాషలోనూ అన్యదేశ్య పదాలు చేరడం సహజమనీ, అదేవిధంగా సంస్కృత,ప్రాక త, ఉర్దూ, ఆంగ్ల పదాలు తెలుగులో చేరాయనీ, వాటిని తెలుగునుంచి తీసివేస్తే తెలుగు భాషకు నష్టం వాటిల్లుతుందనీ రామమూర్తిగారు అన్నారు. ఈ సందర్భంలో అన్యదేశ్య పదాల గురించి ఆయన చెప్పిన మాటలు చూద్దాం.

''నార్మను రాజులు ఇంగ్లండును జయించి పాలించిన కాలమందు నార్మన్ ఫ్రెంచి పదములు ఇంగ్లీషులో చేరినట్లే, మన తెలుగులో ఉర్దూ మాటలు చేరి, భాషాభివ ద్ధికి కారణములయినవి. ....వేలకొలదిగా ఉన్న హిందూస్థానీ మాటలు నిత్యవ్యవహారములో ఆంధ్రభారతి శరీరములోని అంగములయినవి. ఛేదిస్తే గాయములు పడక తప్పదు. ....ఇన్నూరేండ్లయి ఇంగ్లీషువారితో మనకు సంబంధ మేర్పడ్డది. నూరేండ్లయి వారి భాష తెలుగువారు నేర్చుకుంటున్నారు. వ్యవహారమందు అనేకమయిన ఇంగ్లీషు మాటలు పామరులు కూడా వాడుతున్నారు; వాటికి మారుగా తెలుగు మాటలు వాడితే సుబోధము కావు. పాశ్చాత్యుల జ్ఞాన విజ్ఞానములు ఇప్పుడు ఇంగ్లీషు భాష ద్వారా మనవారు కొందరు సంపాదిస్తున్నారు. అవి దేశములో వ్యాపించేటట్టు చేయడమునకు దేశ భాషలో ఇంగ్లీషు మాటలు చేర్చవలెను. ఇంగ్లీషు మాటలు, సంస్కృతశబ్దములు, ఉర్దూ పదములు మన భాషలో కలిసిపోయినవన్నీ మన మాటలే. అవి విడిచితే వ్యవహార హాని.'' (రామమూర్తి, 1969; 227–228)

## 6. తులనాత్మక భాషాశాస్త్రం (Comparative Linguistics)

రెవరెండ్ హాఫ్ మాన్ రాసిన ''ఎన్ సైక్లోపీడియా ముండారికా'' లో పదాల ఎంపికలో అవలంబించిన పద్ధతినే తాను కూడా సవర-ఇంగ్లీషు, ఇంగ్లీషు-సవర నిఘంటువుల (1938)కూర్పులో అవలంబించినట్టు చెప్పారు. ఎల్.బి.రామస్వామి అయ్యర్ సలహా ప్రకారం  సవర భాష ఏ భాషా కుటుంబానికి చెందిందో ఆ భాషా కుటుంబంలోని కొన్ని భాషా పదాలతో సవర భాషా పదాలను తులనాత్మకంగా పోల్చి వాటిమధ్య ఉన్న పోలికలను చూపించారు. సవర భాషలోనూ, తక్కిన ఆస్ట్రిక్ భాషా కుటుంబంలోనూ భాషా సామ్యాలు ఎక్కువగా ఉన్నాయనీ, వీటిని పరిశీలించి ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటువంటి భాషా పరిశీలనాలు భాషాశాస్త్ర నిర్మాణానికి ఎంతో ఉపకరిస్తవని రామమూర్తిగారు అభిప్రాయపడ్డారు. (జానకి, మార్చి 1991 ;47)  "A Manual of Sora Language" లో సవర భాషలోని అచ్చులనూ, లింగవ్యవస్థనూ, క్రియానిర్మాణాన్నీ, విశేషణ రూపాల తర తమ భేధాలను తెలిపే విధానాన్నీ తెలుగు, ఇంగ్లీషుల భాషల రూపాలతో తులనాత్మకంగా పోల్చారు.

సవర భాషలోకి ఆదానం చేసుకోబడిన సంస్క త, పాళీ, ఒరియా, తెలుగు పదాలను గుర్తించికూడా, తెలుగు, సంస్కృతం, ఒరియా భాషా లక్షణాలు కొన్ని సవరభాషలో ఉన్నాయని గుర్తించికూడాఈ భాషలతో సవర భాషకు జన్మసంబంధంలేదనీ, ఈ భాష ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబంలోని ముండా భాషా ఉపకుటుంబానికి చెందినదిగా నిర్ణయించారు. 1967 లో విస్కాన్సిన్ యూనివర్సిటీ నుంచి Savara Syntaxఅనే అంశంపై పరిశోధనచేసి పిహెచ్.డి డిగ్రీ పొందిన StanelyStarostaగిడుగు రామమూర్తిగారిని "Pioneer in MundaLinguisics" గా అభివర్ణించారు. అలాగే, రామమూర్తిగారు తన సవరభాషా నిఘంటువుల్లోనూ, వ్యాకరణంలోనూ అనేక సందర్భాల్లో ముండాభాషా ఉపకుటుంబంలోని భాషలనుంచి ఉదాహరణలు ఇవ్వడాన్నిబట్టి ఆయను **ముండా భాషా పండితుల్లో అగ్రశేణి పండితుడిగా** పేర్కొన్నారు. (Starosta, డిసెంబర్ 1986; 213)

''అరవములో పడు-పట్టాన్, ఇడు- ఇట్టాన్, విడు- విట్టాన్ అని నేటికిన్నీ డుకారాంత క్రియలకు డువర్ణము 'ట్టు', 'ట్ట'గా క్రియారూపములలో ఉన్నది. తెలుగులో కనుపడు, కనుపట్టి, చేయబడు, చేయఁబడ్డ-(అరవ. సేయప్పడు, సేయపట్ట) ప్రాచీనాంధ్రమందు 'చూడఁబట్టదే?' అనే ప్రయోగమున్నది. నన్నయ కాలమందే 'విట్టు' 'విడు' అయిపోయినది. నేటి తెలుగులో కొట్టు- కొడతాను, తిట్టు-తిడతాడు; పెట్టి-పెడతావా? అని వాడుతున్నారు'' (రామమూర్తి 1969; 249). అని తెలుగు క్రియలను అరవ భాషలోని క్రియలతో పోల్చిచూపారు.

వ్యావహారిక తెలుగుకూ, గ్రాంథిక తెలుగుకూ ఉన్న సంబంధాన్ని సంస్కృతభాషా భేదాలతో పోల్చి ఈ విధంగా చెప్పారు. ''అయితే మన వ్యావహారిక భాషకున్ను ప్రాచీన కావ్యభాషకున్ను సంబంధమేలేదా అంటే లేకపోలేదు. సంస్క త సారస్వతంలో వైదికభాషకున్ను లౌకిక భాషకున్ను గల సంబంధం వంటి సంబంధం ఉన్నది. మన ప్రాచీన కావ్యభాష వైదికభాష వంటిది. వ్యావహారిక భాష లౌకికభాష వంటిది. లౌకికభాషకు లక్షణం చెప్పిన పాణిని, కాత్యాయనుడు, పతంజలి లోకంలో ఉన్న వాడుకభాష ప్రమాణంగా గ్రహించి సూత్రాలు, వార్తీకాలు, ఇష్టులు రచించారుగాని వాల్మీకి వ్యాసాదులు రచించిన గ్రంథాలలోని భాష ప్రమాణంగా చూపించలేదు'' అని అన్నారు. (రామమూర్తి, 1958;155)

గ్రంథ రచనలో సమకాలంలోని వాడుక మాటలే వాడాలనీ, ప్రాచీన పదాలను వాడకూడదనీ, ఇతర భాషల్లోని రచయితలు వాడుక భాషలోనే రాశారనీ, రాస్తున్నారనీ చెప్తూ ఆంగ్ల రచయితల గురించీ, బెంగాలీ రచయితల గురించీ తెలిపారు. ''డ్రైడెన్, వర్డ్స్ వర్త్ మొదలైన ఇంగ్లీషు కవులు వాడుక మాటలతోనే మనోహరముగా కవితలు కూర్చవచ్చునని చెప్పి, ఆలాగున చక్కని కావ్యాలు రచించి కవులకు మార్గదర్శకు లయినారు'' అనీ, ''షేక్స్పియర్ తన కాలములో అందరూ వాడుకొనే మాటలు ఏలాగున ప్రయోగించినాడో ఆలాగున మన కాలమందు వాడుకలో ఉన్న మాటలు ప్రయోగించవలెను'' అని షెల్లీకవి తన అభిప్రాయము చెప్పినాడు'' అనీ, ''శిష్ట వ్యవహారమందున్న ''ఛలిత్'' భాషలోనే నానా విధమయిన గ్రంథాలు బంగాలీవారు రచిస్తున్నారు. మహాకవి అని పేరు పొందిన రవీంద్రనాథ్ ఠాకూర్ రచించిన కావ్యములు ఇంగ్లీషు మొదలయిన యూరోపియన్ భాషలలోనికి 'తర్జుమా' అయినవి. పాతవడ్డ మాటలు ఆయన వాడరట'' అనీ రామమూర్తిగారు పేర్కొన్నారు (రామమూర్తి 1969; 224–225).

''ఇటలీలోని ప్రాచీన కావ్యభాష అయిన లాటిన్ ఏనాడో చచ్చి ప్రజలకు అర్థంకాకుండా పోయింది. (ప్రాచీన గ్రాంథిక భాష ఇప్పుడు లాటిన్ లాగా ఉంది.) లాటిన్లో నుంచి పుట్టిన ఇటాలియన్ భాష ప్రజలు మాట్లాడుతున్న భాష. (ఆధునిక తెలుగు భాష ఇటాలియన్ లాగుంది.) ఇటలీలోని పండితులు నిర్జీవమైన లాటిన్ భాషా కంకాళంతో సరాగాలాడితే దాంతే యౌవనంలో సజీవంగా ఉన్న ఇటాలియన్ భాషతో క్రీడించాడు. ... వేద సంస్క తం పాతబడి పోయినప్పుడు మన పురాతన మహర్షులు ఆ భాషా వ్యవహారం మానివేసి తమ కాలంలో వాడుకలో ఉన్న భాషను వాడుకలో పెట్టారు. వేద సంస్కృతాన్ని పవిత్రభాషగా తామెంత గౌరవిస్తున్నా ఆ మత భాషను పునరుజ్జీవింప చేయాలని వాళ్ళెన్నడూ అభిలషించలేదు. సంస్కృతవ్యాకరణం నిత్యజీవిత భాష అయిన లౌకిక భాషను వ్యాకరించిందేగాని వేదభాష అయిన ఛందస్సును కాదు. ఇదీ చచ్చి ప్రాక త మాండలికాలు దానిలో నుంచి ఉద్భవించినప్పుడు, వాటినే వాటి స్వచ్ఛరూపంలో ప్రయోగించారు.'' అని రామమూర్తిగారు అన్నారు. (రాధాక ష్ణ, ఆగస్టు 1991; 27)

## 7. నిఘంటు నిర్మాణం (Lexicography)

మహాకవి ప్రయోగం, ప్రయోగ బాహుళ్యం, లోకవ్యవహారం, సోదరభాషల్లో అటువంటి శబ్దాల స్వరూపం అన్న నాలుగంశాలను గ్రహించి వాటిలో యతి ప్రాస స్థానాల్లో కాక తక్కిన చోట్ల కవుల ప్రయోగాలను స్వీకరించాలని, నిఘంటు నిర్మాణాని కుద్దేశించిన పరిధిని విస్తరింపజేసి వేల పదాలకు గతి కల్పించాలని రామమూర్తిగారు ఆశించారు. కొన్ని సంస్కృతపదాలు సంస్కృతంలోని అర్థంలోకాక తెలుగులో అటు సాహిత్యంలోనూ, ఇటు నిత్య వ్యవహారంలోనూ నూతన అర్థాలను సంతరించుకున్నాయి. కొన్ని దేశి పదాలు కూడా కాలక్రమంలో నూతన అర్థాలు పొందాయి.ఇవి భాషను పరిపుష్టం చేస్తాయి. ఇటువంటి నూతన అర్థాలను నిఘంటువుల్లో చేర్చాలని ఆయన అన్నారు. నిఘంటువుల్లో కొన్ని అసాధారణ పదాలకు బహువచన రూపాలను ఇవ్వాలన్నారు. నిఘంటువులో ఆరోప పదాలకు ఇచ్చే అర్థం సమగ్రంగా, విశదంగా ఉండాలని సూచించారు. ఒక పక్షి విశేషము, ఒక మత్స్య విశేషము లాంటి అర్థాలు నిఘంటువు ప్రయోజనాన్ని తగ్గిస్తాయనీ, కాబట్టి అర్థం వివరంగా ఉండాలని ఆయన సూచించారు. తెలుగులో కలిసిపోయిన అన్యదేశ్య పదాలను నిఘంటువుల్లో ఇవ్వాలనీ, వాటి మూల రూపం ఏమిటో, ఏ భాషకు చెందినవో స్పష్టంగా తెల్పాలని అన్నారు. (జేబు– అరబ్బీ పదం)తద్భవాలను నిఘంటువులో ఇచ్చినప్పుడు వాటి మూల రూపాలను కూడా ఇచ్చినట్లయితే నిఘంటువు ప్రయోజనం ఇనుమడిస్తుందని అన్నారు. రూపాంతరాలన్నిటినీ నిఘంటువులో సూచించాలన్నారు. పదాల అర్థాలు స్పష్టంగా తెలియడం కోసం నిఘంటువులో కవి ప్రయోగాలు, వ్యవహార ప్రయోగాలు ఇవ్వాలన్నారు.

## 8. వ్యాకరణం (Grammar)

''ప్రయోగశరణం వ్యాకరణం''; ''ప్రయోగ శరణా వైయాకరణా'' అనే మాటలు గిడుగువారు తమ వ్యావహారిక భాషా వాదానికి అనుకూలంగా వాడుకున్నారు. ఆధునిక భాషాశాస్త్ర గ్రంథాలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. శిష్టానాముక్తౌ సూత్రాణామభావే అనుశాసన కారిణేవ దండనీయా (శిష్టులు వాడిన మాటలకు అనుశాసనం చెయ్యకపోతే, తప్పు అనుశాసనము చేసే వాడిదేగాని వ్యవహర్తలది కాదు.)వ్యాకరణంలో సాధించకపోయినంత మాత్రాన ఏ శబ్దమూ అసాధువుకాదు అని గిడుగువారు సప్రమాణంగా నిరూపించారు. ''లోకములో ఉన్న శబ్దమును కోశములోగాని, వ్యాకరణములోగాని చేర్చుకోకపోతే కోశమున్ను వ్యాకరణమున్ను తప్పులవుతవిగాని శబ్దము తప్పుకాదు''. (రామమూర్తి, 1976; 34) ఏ భాషకైనా వ్యాకరణాలు వర్ణనాత్మకం(Descriptive)గా ఉండాలనీ, నిర్దేశాత్మకం (Prescriptive)గా ఉండకూడదనీ Henry Sweet చెప్పిన మాటలను ''నేటి తెలుగు; నివేదిక''లో రామమూర్తిగారు ఉట్టంకించారు (రాధాకృష్ణ, ఆగస్టు 1991; 55). ఆ మాటలు ఇవి; ''వచన భాష తరుచుగా

సాధారణ సంభాషణకు చాలా దగ్గరగా ఉంటుంది. వ్యాకరణాధ్యయనం ప్రథమ లక్ష్యం భాషకు సంబంధించిన వాస్తవాలు ఎలా **ఉన్నాయో** పరిశీలించి తెలుసుకోవటమేగాని, అవి ఎలా **ఉండాలో**, భాష పూర్వస్థితి ఎలా **ఉండేదో** నేర్చుకోవటం కాదు.''

''సంస్క తమనే భాషకు అనుశాసనము చేసినవారు పాణికి పూర్వము అనేకులున్నారు. వారు చేసిన పని తాను స్వీకరించి కొంతపని పాణిని చేస్తే, కాత్యాయనుడు మొదలయినవారు దానిలో పదివేల ''లోపాలు'',''దోషాలు'' కనిపెట్టి దిద్దినారు. ఇంకా లోపాలుంటే పతంజలి మహర్షి మరికొన్ని సవరణలు చేసినారు. వ్యాకరణములో ధాతుపాఠాలు, గణపాఠాలు ఉన్నవి. ఎన్నో భాష్యాలు, వాటికి టీకలు ఉన్నవి. ఇన్ని ఉన్నా, గొప్ప వైయాకరణులు తగవులాడుతూనే ఉంటారు. సంస్క తము వాడుక భాషగా ఉన్నప్పుడే దానికి అనుశాసనము పుట్టినది. అనుశాసించినవారు ప్రమాణముగా స్వీకరించినది గ్రంథస్థ భాషకాదు. శిష్ట వ్యవహారమందుండిన భాష. ఆ భాషకుపేరు ''లౌకికభాష''; గ్రంథస్థ భాషకు ''వైదిక భాష'' అని పేరు అనుశాసనములో ఉన్నది. ఏ శబ్దము ఏలాగున శిష్టులు ఉచ్చరిస్తారో ఆలాగుననే ఎత్తుకుని ప్రక తి ప్రత్యయ విభాగముచేసి సంస్కరించినారు పాణిన్యాదులు....ఒక పొల్లయినా లోకుల వాడుకలో ఉన్నది తీసివేయకూడదు; లేనిది చేర్చకూడదు. వైవిధ్యము ఎంత ఉన్నా ఉపేక్షింప కూడదు. అది అంతా అనుశాసనములో చేరవలెను. (రామమూర్తి, 1958;144)

వ్యాకర్తలు భాషను నడిపించరు. భాషనే వ్యాకర్తలు అనుసరిస్తారు. గతంలో ప్రజలు ఇలా మాట్లాడారు. ఇప్పుడు మీరు కూడా అలాగే మాట్లాడండి అని చెప్పేవాడు మంచి వ్యాకర్తకాడు. తన కాలంనాటి భాషను చేతనైనంత వ్యాకరించడమే వ్యాకర్త చెయ్యాల్సిన పని అని హెచ్.సి. వైల్డ్ మాటలను ఉట్టంకించారు (రామమూర్తి, 1958; 68) వైల్డ్ మాటలు ఇలా ఉన్నాయి. "Grammarians do not lead speech: they follow it. If a grammarian said, this is the way people used to speak in times past. Therefore this is the way people ought to speak now, he would not be a wise or good grammarian, because a language is not the same all times; and if it has changed well it has changed, for better or for worse, and all that the grammarian has to do is to accept the fact and describe the best usage of his time to the best of his ability" (Wyld) ఒకనాటి వ్యాకరణం మరోనాటి వ్యాకరణం కాదు; ఇంకా ఏ ఒక్క కాలంలోనైనా వకభాష, జాతి, కులం, మాండలికం అనేవాటిని బట్టి విభిన్న వ్యాకరణ ధర్మాలను ప్రదర్శించవచ్చును. భౌతికంగానూ ప్రాంతీయ భేదాలవల్లనూ వ్యాకరణం మారుతుంటుంది. (రామమూర్తి, 1958; 82)

''తెలుగు సమాజం ప్రయోజనాలను ద ష్టిలో పెట్టుకొని ప్రాచీనాంధ్ర వ్యాకరణ ప్రేతాన్ని పురావస్తు గ హాలలో బంధించటం ఎంతో అవసరం. పండితుడికి దాస్యం నుంచి విమోచనం కలిగించి, జీవద్భాషను విధిగా ప్రేమించి గౌరవించేటట్లు చేయడం అవసరం. అప్పుడుగాని ఛాందస ప్రజలూ, బడిపిల్లలూ మాత భాషాధ్యయనం అంటే భయపడటం మానరు. ఆధునికోపాధ్యాయుడు ఆధునికాంధ్ర వ్యాకరణాన్ని బడిపిల్లలకు నిగమన విధానం ప్రకారం బోధించి, వ్యాకరణం అంటే ఏమిటో అది ఎలా ఏర్పడుతుందో చెప్పటానికి సిద్ధంగా ఉన్నాడు. పండితులూ, సాహిత్య పరిషత్తు వాళ్ళు ప్రకటించినట్లు ఆధునికాంధ్ర భాష 'వ్యాకరణ విరుద్ధం' కాదు; 'వ్యాకరణ రహితమూ' కాదు'' (రాధాకృష్ణ, ఆగస్టు 1991; 57) అని ప్రాచీనాంధ్ర వ్యాకరణాల నిష్ప్రయోజకత్వాన్ని రామమూర్తిగారు తెలిపారు.

సాహిత్య భాషకు వ్యవహారభాషే మూలాధారమన్న Henry Sweet మాటలను రామమూర్తిగారు పేర్కొన్నారు(రాధాక ష్ణ, ఆగస్టు 1991; 26). హెన్రీ స్వీట్ మాటలు ఇవి; '' అత్యధిక సంఖ్యాకులైన వ్యాకరణ వేత్తలు సాహిత్యభాషకు భ్రష్టరూపమే వ్యావహారికమని పైకి అనరుగాని విశ్వసిస్తుంటారు. వాస్తవం మాత్రం ఇందుకు కేవలం విరుద్ధం. సాహిత్యభాషకు నిజమైన మూలాధారం వ్యవహారభాష.''

పైన తెలిపిన గిడుగువారి అభిప్రాయాలు చాలావరకు ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలకు అనుగుణంగానే ఉన్నాయి. ఈ అభిప్రాయాల ఆధారంగా, గిడుగువారు ఉట్టంకించిన ఆంగ్ల గ్రంథాల ఆధారంగా వారిని తెలుగువాడైన తొలి భాషాశాస్త్రవేత్తగా చెప్పవచ్చు.

## 9. ఉపయుక్త గ్రంథ సూచి

1. జానకి, వి. మార్చి 1991. ***గిడుగు రామమూర్తి – విమర్శనాత్మక పరిశీలన***. వరంగల్లు; రచయిత్రి

2. ముద్దు నరసింహనాయని, స్వామినేని. 1986. ***హితసూచని***. రాజమహేంద్రి; ఆంధ్రకేసరి యువజన సమితి. (మొ.ము.1862)

3. రాధాక ష్ణ, బూదరాజు. అనువాదకుడు.1991. ***నేటి తెలుగు; నివేదిక.*** హైదరాబాదు; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (ఆంగ్లమూలం. Memorandum on Modern Telugu by GiduguRamamurthi. 1913)

4. రామమూర్తి, గిడుగు. పీఠిక. టేకుమళ్ళ కామేశ్వరరావు. 1938. ***వాడుక భాష; రచనకి కొన్నినియమాలు***. గుంటూరు; నవ్య సాహిత్య పరిషత్తు

5. రామమూర్తి, గిడుగు. 1958 రెండవ ముద్రణ. ***వ్యాసావళి***. విజయవాడ; విశాలాంధ్ర ప్రచురణాలయం. (మొదటి ముద్రణ 1933)

6. రామమూర్తి, గిడుగు. 1969. 3వ ము. ***బాల కవి శరణ్యము.*** విజయవాడ; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (మొ. ము. 1933)

7. రామమూర్తి, గిడుగు. 1976 3వ ము. ***ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం.*** విజయవాడ; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (మొ. ము. 1933)

8. రామారావు, చేకూరి. పి.సి. నరసింహారెడ్డి. 1972. ''భాషాకషి'' ***మహతి***. సంపా. జి.వి. సుబ్రహ్మణ్యం. సికిందరాబాదు; యువభారతి. పుటలు 33–48

9. సత్యనారాయణ, ఎస్వీ. జూలై–సెప్టెంబర్ 2008. ''తొలి తెలుగు భాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తి''. ***వాఙ్మయి.*** సంపా. వై. సుధాకర్. హైదరాబాదు; పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాయలం. పుటలు 11–14

10. SheshagiriRao, B . డిసెంబర్ 1986. "Our Master and the Modern Telugu Movement" ***మరోసారి గిడుగురామమూర్తి***. సంపా. చేకూరి రామారావు. హైదరాబాదు; హైదరాబాదు బుక్ ట్రస్ట్. పుటలు 211–217, 223–234 (This essay is first published in ***A Miscellany of Papers: Presented in honour of G.V. Ramamurthi***. 1933. pp. 1–11. Starosta, Stanley. డిసెంబర్ 1986."Ramamurthi: A Munda Linguist's Appreciation."

# 'గిడుగు' భాషాప్రస్థానం

## 'Gidugu's' Journey of Language

– Dr. K. Krishna Murti,
Lecturer, B. J. R. Govt. Degree College,
Bazarghat, Nampally, Hyderabad.

సామాజిక అవసరాలను తీర్చడానికి భాష ఒక సాధనం. కాలం మారుతున్న కొద్ది సామాజిక అవసరాలు కూడ మారుతాయి. ప్రపంచంలోని దేశాలు ఆధునిక యుగంలోకి మారుతున్నప్పుడు వాటి అవసరాలు కూడా మారుతాయి. ఈ మార్పు ప్రధానంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో కనిపిస్తుంది. ఇప్పుడు ఉన్న ఆలోచనలకు భిన్నంగా కొత్త ఆలోచనలతో రూపుదిద్దుకున్న మార్పే ఆధునికత. సామాజిక, సాంస్కృతిక, రాజకీయాది రంగాలలో జరిగిన మార్పులు భాషపై కూడా ప్రభావితం చూపిస్తాయి. కొత్త వ్యవస్థలో వచ్చిన మార్పులు కొత్తగా ఆలోచింపజేస్తాయి. తదానుగుణంగా వ్యక్తీకరణ మీద అంటే భాష మీద కూడా కొత్త వ్యవస్థ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఆధునిక అవసరాలు తీర్చడానికి భాషా రంగంలో కూడా చాలా మార్పులు సంభవించాయన్నది వాస్తవం. "నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరిని సంతోష పెట్టడానికి వదులుకోను." అని గురజాడ కన్యాశుల్కానికి పీఠిక రాస్తూ అన్నాడు. గ్రాంథిక భాష సంస్కృత పదజాలంతో నిండి సామాన్యుడికి అర్థం కాకుండా పోయిందని గిడుగు అభిప్రాయపడ్డాడు.

అందుకే గిడుగు వేంకటరామమూర్తిగారిని వ్యవహారిక భాషోద్యమ పితామహునిగా భావిస్తాం. వ్యవహారిక భాషోద్యమం అంటే గిడుగు అని, గిడుగు అంటే వ్యవహారిక భాషోద్యమం అని చెప్పుకుంటాం. అత్యాధికులు వ్యవహర్తలుగా ఉన్న భాష వాడుక భాష. అలాంటి భాష కోసం ఉద్యమం చేసిన గిడుగు కావ్యభాషను కాదన్నాడు. జన వ్యవహారంలో ఉన్న భాషకే ప్రాధాన్యం ఉండాలన్నదే గిడుగు పోరాటం. అదే అతని వ్యవహారిక భాషోద్యమ పోరాటం. తన కాలంలోను తరువాత కాలంలోను గ్రాంథిక భాషలో వస్తున్న రచనలను సరళతరం చేసి వ్యవహారిక భాషలోనే రాయలని ఉద్యమించిన వాడు గిడుగు రామమూర్తి. కావున ఈయన జన్మదినమైన ఆగస్టు 29న 'తెలుగు భాషా దినోత్సవం' జరుపుకుంటాం.

"ఆనాడు గిడుగు లేకపోతే ఈనాడు ఆధునిక సాహిత్యం లేదు. పండితులు చిన్నయసూరిని అడ్డం పెట్టుకొని కుళ్ళు సాహిత్యాన్ని ఊరేగించేవారు." అన్న కొడవటిగంటి కుటుంబరావుగారి మాటలు

చిన్నయసూరిని అడ్డం పెట్టుకొని నీతిచంద్రికను ఆదర్శంగా తీసుకొని ఆనాటి పండితులు కావ్యభాషను పునరుద్ధరించడంతో తెలుగు వచనం సామాన్యునికి దూరం అయ్యిందని తెలుస్తుంది. అయితే వ్యాకరణ సూత్రాలు, నిర్బంధాలు భాషా స్రవంతికి ఎల్లకాలం అడ్డు కట్టల్ని వేయలేవని, జీవద్భాష అటువంటి కృత్రిమ పదబంధకాల్ని తెంచుకొని సహజ మార్పుకు లోనవుతుందని అర్థమవుతుంది. ఈ విధంగా పరిణామం చెందినటువంటి వ్యావహారిక భాష పూర్వపరాలను గమనిస్తే తెలుగు భాషా ప్రస్థానం ఎంత గొప్పదో అర్థమవుతుంది. గిడుగువారి వ్యవహారిక భాషోద్యమ పూర్వ రంగాన్ని పరిశీలిస్తేగాని, వ్యావహారిక భాషోద్యమాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేము. ఏ భాషలోనైనా వాడుక భాషకు కావ్యభాషకు తేడా ఉంటుంది. ఐతే తెలుగులో ఈ తేడా ఎక్కువని చెప్పవచ్చు. ఏ భాషలోనైనా కావ్యభాష వాడుక భాషను అనుసరించి ఉంటుంది. ఏ భాషలోనైనా పద్యాలలోని భాషకు వచనంలోని భాషకు తేడా ఉంటుంది. పద్యాలలోని భాష కొంత ప్రాచీన రూపాలతో ఉంటుంది. తెలుగులో ఈ తేడా బాగా గుర్తించవచ్చు. తెలుగు కవులు గ్రంథాలలో ప్రాచీన పదాల్ని వాడి దానిని గొప్ప గౌరవంగాను, గర్వంగాను భావించారు. వీరు వాడే భాష ప్రాచీన రూపాలతోను, సంస్కృత సమాసాలతోను, శబ్దాడంబరాలతోను ఉండేట్టు రాసేవారు. పరవస్తు చిన్నయసూరి ఇటువంటి భాషాడంభారాలతో క్లిష్టమైన తెలుగుభాషలో నీతిచంద్రిక రాశారు. దానినే ఇతరులు పాటిస్తూవచ్చారు. అట్లాంటి భాషతోనే ప్రతిసంవత్సరం పాఠ్యపుస్తకాలని నిర్ణయించి విద్యార్థుల చేత చదివించారు. విద్యార్థులు పరీక్షలో రాయవలిసిన వ్యాసాలూ వాడుకభాషలోకాక కావ్యభాషలోనేరాయాలన్న నియమంఉండేది.

పాఠాలుచెప్పే ఉపాధ్యాయులు, పద్యాలకు అర్థాలుచెబుతూ వాడుక భాష ఉపయోగించేవారు. కాని, విద్యార్థులు పరీక్షలకుమాత్రం కావ్యభాషలోనే సమాధానం రాసేవారు. ఈ వ్యత్యాసంవల్ల విద్యార్థులకు విషయపరిజ్ఞానంతోపాటు భాషాపరిజ్ఞానంకూడా అందవలిసిననంత అందలేదని చెప్పవచ్చు. గిడుగువారి భాషోద్యమానికి ముందుఉన్నటువంటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో వచ్చిన మార్పులు వివేచిస్తే, ఈయన భాషోద్యమానికి అవి ఎట్లా దోహదం చేసాయో తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్నటువంటిమార్పులు, మనదేశంలో కూడా ఆర్థిక, సామాజిక రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. భాషకూడా అందుకుమినహాయింపు కాదు. పారిశ్రామికీకరణవల్ల అందరికి అన్ని అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు అన్నివిషయాలపట్ల అవగాహనపెరిగింది. తమ ఉనికి, అస్తిత్వం గురించి ఆలోచించటం ప్రారంభించారు. అప్పటివరకు ఒకపద్ధతిలో కొనసాగిన జీవన విధానం మార్పుకు గురైంది. వ్యక్తీవ్యక్తిగాకాక వ్యవస్థగా ఆలోచించటం మొదలైంది. తద్వారా, తమకుజరుగుతున్న అన్యాయాన్ని అర్థంచేసుకోవటం న్యాయమైనదాని వైపుపయనించటం ప్రారంభించారు. ఆ క్రమంలోనే, తనసంస్కృతిని, భాషని, వ్యవహారాన్ని కాపాడుకోవాలన్న ఆలోచనమొదలైంది. స్వేచ్ఛా, సమానత్వం

ఫ్రెంచివిప్లవంద్వారాకలిగినభావాలు మనిషినిమనిషిగా గుర్తించాలన్న ఆలోచన మొదలైంది. అత్యధికుల ప్రయోజనమే ప్రయోజనంగా గుర్తించడం మొదలైంది. సామాన్యునికి సంఘంలో సమన్యాయం జరిగే ఆలోచన ఫ్రెంచివిప్లవం అందించిన గొప్పఆలోచన. అలాగే ఇంగ్లీషు విద్యావిధానం భారతీయుల్లో విప్లవాత్మకమైన మార్పుకు దోహదం చేసిందని చెప్పవచ్చు. పరిపాలన నిర్వహణ కొరకు ఇంగ్లీషు వాళ్ళు దేశంలో అనేకచోట్ల బడులు పెట్టి ఆంగ్లవిద్యావ్యాప్తికి పూనుకున్నారు. జనవ్యవహారంలోని భాషలోనే విద్యాబోధన చేయడం సులభంఅని అనుకున్నారు. అందుకోసం వాడుకభాషను ప్రోత్సహించడం ప్రారంభించారు. కావ్యభాషద్వారా వారుఅనుకున్నది నేరవేరదని గుర్తించి వ్యవహారిక భాషనేసరైనదని అందులోనే విద్యాబోధన కొనసాగాలని ఆ మార్గంలోనే భాషాసంస్కరణలు మొదలుపెట్టారు. ఈ సంస్కరణనే వ్యవహారికభాషోద్యమానికి దోహదంచేసిందని చెప్పవచ్చు. అంతేకాక 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటుద్వారా భారతదేశంలో కొన్నిమౌలికమైన మార్పులువచ్చాయి. కంపెనీల అధికారం బ్రిటీషువారి చేతుల్లోకి వెళ్ళింది. తత్ఫలితంగా; విద్యారంగంలో విశ్వవిద్యాలయాలద్వారా విద్యను వ్యాపింపజేసి ప్రజలను చైతన్యంచేయటానికి ఉపయోగించాలన్న ఆలోచన మొదలైంది. విశాలమైనభావాలు అంకురించాయి. విశ్వవిజ్ఞానం విద్యార్థులమనుస్సులను వికసింపజేసింది. దేశంనలుమూలల్లో విద్యార్థులు వివిధ ప్రాంతీయ భాషలను మాట్లాడినప్పటికీ, వివిధ ప్రాంతాలను కలపటానికి విశ్వవిద్యాలయాలు తోడ్పడ్డాయి.

భిన్నప్రాంతాలవారు పరస్పరం కలుసుకోవటానికి, వివిధ విషయాలను చర్చించుకోవటానికి అవకాశం ఏర్పడింది. వీరంతా ఏ ప్రాంతానికి సంబంధించినవారైన స్వదేశీయులమేనన్న భావన వారికి కలిగింది. జాతియోద్యమానికి ఇవేపునాదులు వేసాయని చెప్పవచ్చు. వ్యవహారికభాషోద్యమానికి సి. పి. బ్రౌన్ చేసిన సేవకూడా గుర్తించదగినది. ఈయన ఆంధ్రదేశంలో అన్నిప్రాంతాలను పర్యటించి, ఆయాప్రాంతాలలో వాడుకభాషలో ఉన్నపదాలను సేకరించి, నిఘంటువురూపంలోకి తీసుకురాగలిగారు. ఆ ప్రయత్నంద్వారా, వాడుకభాషలోని అనేక పదాలు వెలుగులోకి వచ్చాయి. తద్వారా, వాడుకభాషపట్ల ఆసక్తికలగటానికి సి. పి. బ్రౌన్ కారణమయ్యాడు. 1906వ సంవత్సరంలో పాఠశాలల తనిఖీఅధికారిగా ఏట్సు నియమితులవడంకూడా, తెలుగువ్యవహారికభాషకు ఒకకారణంగా చెప్పుకోవచ్చు. ఈయన ఆంధ్రదేశంలో అనేకపాఠశాలలను సందర్శించి ఆయాపాఠశాలలో జరుగుతున్న విద్యాబోధనలని పరిశీలించి, వాడుకభాషకు కావ్యభాషకుఉన్న తేడానిగమనించి విద్యావిధానంలో వాడుకభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని భావించాడు.

అదేవిధంగా, తెలుగులో వ్యవహారిక భాషోద్యమం రావటానికి కాంపోజిషన్కమిటి సూచనలు కూడా ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఈ కమిటి వ్యవహారికభాషకు ఏ విధంగా అన్యాయం జరిగిందో పరిశీలించింది. శాస్త్రీయ ఆలోచన విధానంలేని ఛాందస పండితుల కారణంగా వ్యవహారిక భాషకు జరిగిన అన్యాయాన్ని ఈ కమిటి చర్చించింది.

కందుకూరి వీరేశలింగం సంస్కరణోద్యమ పితామహుడు. గద్యతిక్కనగా పేరొందిన వీరేశలింగంపంతులు అత్యంత సంక్లిష్టంగాఉన్న గ్రాంథికభాషాధోరణిని కాదని తనవచనరచనలలో వ్యవహారికభాషను వాడి వ్యవహారిక భాషోద్యమ ప్రచారానికి చేయూత నిచ్చాడు. ఆయనరాసిన ప్రహసనాలలో ఆయాపాత్రలకు ఉచితమైన జనవ్యవహారభాషను ఉపయోగించాడు. తద్వారా, వాడుకభాషకు ప్రాధాన్యతను చేకూర్చాడు. ఈయనతోపాటు, గురజాడఅప్పారావు వ్యవహారిక భాషోద్యమానికి బీజాలువేసాడు. ఆంధ్రదేశంలో వ్యవహారికభాషోద్యమానికి ముందుగానే వాడుకభాషలో కన్యాశుల్కం అనే నాటకాన్ని రాశాడు. వాడుకభాషకు సాహిత్యగౌరవాన్ని కల్పించాడు. ఉద్యమస్ఫూర్తిని కలిగించిన గురజాడఅప్పారావు వ్యవహారికభాషోద్యమానికి కావలిసిన పూర్వరంగాన్ని సమకూర్చినటువంటివారు. వ్యవహారిక భాషోద్యామానికి దారితీసినకొన్ని ముఖ్యసంఘటనలలో కర్జన్ విద్యా నివేదిక ఒకటి. దేశంలోని విద్యాసమస్యల్ని చర్చిస్తూ ఈ నివేదిక వెలువడింది. ఈ నివేదిక దేశభాషల పురోభివృద్ధికి కొంతవరకు దోహదం చేసింది. ఈ నివేదిక ప్రకారం పాఠశాలలలోని విద్యార్థులకు వాడుకభాషలోనే వ్యాసరచన చేయడానికి అవకాశం కల్పించింది. ఇలాంటి అనేకసంఘటనల నేపథ్యంలో వ్యవహారిక భాషాఒకఉద్యమంగా సాగింది.

గురజాడఅప్పారావుమరణించాక(1915) గిడుగురామమూర్తి వ్యవహారిక భాషోద్యమాన్ని తనుముందుండి నడిపాడు. తనజీవితకాలాన్ని పణంగాపెట్టి వ్యవహారికభాషకుగల ప్రాముఖ్యాన్ని గుర్తించేవిధంగా, ఉద్యమాన్ని నిర్వహించాడు. ఆయన తనవాదాన్ని ప్రచారంచేయడంకోసం 1919 'తెలుగు'అనే దినపత్రికను నడిపాడు. బాలకవిశరణ్యం, పండితభిషక్కులభాషాభేషజం వంటి రచనల ద్వారా పండితులు అనబడేవారి గ్రాంథికభాషలోని లోపాల్నివాడుక భాషప్రయోజనాన్ని లోకానికి చాటిచెప్పాడు. భాషాసమాజంలోని అన్నివర్గాలకు ఉపయోగకరంగా ఉండాలనిభావించాడు. ఈయన నిర్వహించిన భాషోద్యమం తెలుగుభాషావికాసానికి దోహదంచేసింది. భాషాకఠినత్వాన్ని కాదని, భాషాసరళంగా ఉండాలనేపద్ధతిలో పాఠ్యపుస్తకాల్ని ముద్రించుకోవాలని తనవాదాన్ని గ్రాంథికవాదులు వ్యతిరేకించినదాన్ని లెక్కచేయకుండా, వ్యవహారిక భాషోద్యమాన్నినడిపించాడు. వాదాన్ని నెగ్గించుకున్నాడు. పండితులంతా ఆయనవాదనలోని శాస్త్రీయతను గుర్తించారు. ఇటాలియన్

ఆఫ్ఈస్ట్గాపేరొందిన భాష గ్రాంథికభాష కాదు. అది వ్యవహారిక తెలుగుభాష. పాశ్చాత్యులుమెచ్చుకున్నది తమవ్యవహారిక తెలుగుభాషనేకాని, పుస్తకాలలోరాసినదానిని చదివికాదు అన్నగిడుగు భాషాప్రస్థానం అనితరసాధ్యం.

# గిడుగు భాషాసేవ: మన కర్తవ్యం

## `Gidugu's' Contribution to Language: Our Responsibility

Dr. Pammi Pavan Kumar,
Asst. Professor, Dept. of Telugu,
University of Hyderabad,
Hyderabad – 500 046.
pavankpammi@gmail.com

## 0. పరిచయం

శతాబ్దులుగా ఆయా వ్యవస్థలలో ఉన్న అవస్థను క్రమబద్ధీకరించి, సమాజ గమనాన్ని వేగవంతంచేస్తున్న సంస్కరణవాదులు అన్ని సమాజాలలోనూ ఉన్నారు. వారి వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా సమాజాలను వారు ప్రభావితం చేస్తుంటారు. కేవలం 'రణం' కోసమే 'సంస్కరణ' అని నినదించేవారు కొందరుంటారు. వీరివల్ల సమాజంలో అవగాహన రాహిత్యం పెరుగుతుంది. అవస్థలు పెరుగుతాయి. సమకాలీనులు గుర్తించలేని అవ్యవస్థ సమాజంలో ఏర్పడుతుంది.

మరికొందరు సంస్కరణవాదులుంటారు – వీరేంచేస్తారంటే– వందల, వేల సంత్సరాలుగా సాగుతూ వస్తున్న సమాజ గమనాన్ని నిశితంగా పరిశీలిస్తారు. చలన సూత్రాలను జాగ్రత్తగా అధ్యయనం చేస్తారు. ఉన్న అవ్యవస్థను గాడిలో పెట్టడానికి కావలసిన అవగాహనను ఏర్పర్చుకొంటారు. అత్యంత ప్రభావవంతమూ, చలన శీలమూ కలిగిన ఆచరణాత్మక పథకాలను తయారుచేసికొని కార్యసాధనలో తాము భాగస్వామ్యం వహిస్తారు. సమాజ ఉపరితల, అంతరంగ నిర్మాణాలలో ఇటువంటి మార్పులను తెచ్చిన మహనీయులెందరో మనకు ఉన్నారు. తెలుగు భాషా రంగంలో– ఆధునిక కాలంలో ఇటువంటి మార్పులకు ఆద్యుడు, తొలితరం భాషాశాస్త్రవేత్త శ్రీ గిడుగు వేంకట రామమూర్తిగారు.

## 1. ఉద్యోగంతో మొదలయిన భాషా పరిశోధన

మెట్రిక్యులేషన్ తరువాత ఉన్నత చదువులు సాగించలేక కలెక్టరు కచేరీలో కొంతకాలం ఉద్యోగం చేసారు రామమూర్తిగారు. బతుకుతెరువుకోసం వృత్తిమారి, ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించే సమయంలో– 'కేవలం ఐదు రూపాయలు ఎక్కువ జీతం' – అటు రామమూర్తిగారి జీవితాన్ని, ఇటు తర తరాల తెలుగు చరిత్రను మలుపు తిప్పింది. చిత్రంగా– విజయనగరం సమీపంలోని కోనాడ పాఠశాల ఉపాధ్యాయుడు కావలసిన రామమూర్తిగారు, పర్లాకిమిడి పాఠశాల ఉపాధ్యాయులుగా చేరిపోయారు. 1880 నుంచి 1936వరకు, అంటే, 56సంవత్సరాలపాటు మన్యప్రాంతంలోని సవరభాషా పరిశీలనతో మొదలుపెట్టి, భాషా వ్యవసాయాన్ని తెలుగుభాషకు విస్తరించారు. ఆ మధ్య కాలంలో ఉన్నత చదువులు సాగించారు.

## 2. 'గిడుగు': ఇతర శాస్త్రాల పరిజ్ఞానం

ఇప్పుడు వాడకానికి పనికివచ్చే భాష, సాహిత్యేతర వ్యవహారభాషనుంచి ఏర్పడాలని ప్రతిపాదించిన మొట్ట మొదటి తెలుగు భాషావేత్త గిడుగు వేంకట రామమూర్తి. మాట్లాడేభాష, రాసేభాషలమధ్య అంతరాన్ని తగ్గించేందుకు విశేషంగా కృషిచేసిన మహనీయుడు ఆయన. ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూ, పర్లాకిమిడి ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఆయన అటు సవర భాష నిర్మాణ విశేషాలను, ఇటు తెలుగు భాషా నిర్మాణ మర్మాలనూ సమంగా అధ్యయనం చేస్తూ వచ్చారు.

తనకాలానికి వృద్ధిచెందిన నృశాస్త్రం (ఆంత్రొపాలజీ), భాషాశాస్త్రం... వంటి శాస్త్రాలను క్షుణ్ణంగా చదువుకొన్నారు. ఆ కాలంలో పాలకులు లేదా విద్యాధికారులుగా ఉన్న జె. ఏ. యేట్సు..వంటి పాశ్చాత్యులతో జరిపిన చర్చలద్వారా ఆయన అనేక విషయాలను అవగాహనలోకి తెచ్చుకొన్నారు. తెలుగు ఉచ్చారణకు, రాతకు మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించి అందుకు అనుగుణమైన మార్పులను రాతలోకి తెచ్చుకోవలసిన అవసరాన్ని తొలితొల్త గుర్తించివారు గిడుగువారే!. తెలుగు ఉచ్చారణలో గుర్తించదగిన మార్పులను డేనియల్‌జోన్సు అనే ధ్వని శాస్త్రజ్ఞుడితో చర్చించి ఆ విశేషాలను మనకు అందించారు. మనం ఇవ్వాళ చర్చిస్తున్న ఉచ్చారణాత్మక భాషా విశేషాలను గిడుగు నాడే గుర్తించారు.

## 3. 'గిడుగు': సవర భాషాకృషి

గిడుగు రామమూర్తిగారు సవర భాషపై విశేషమైన కృషి చేశారు. సర్ జార్జి గ్రియర్‌సన్ ఆధ్వర్యంలో వెలువడిన లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియాలో సవరభాషనుగురించి తెలుగులో వ్యాసాలు రాసి ప్రచురించారు.

గిడుగువారి మాన్యుల్ ఆఫ్ సొర లాంగ్వేజి గురించి స్టాన్లీ స్టరోస్టా అనే పరిశోధకుడు "ఖచ్చితత్వానికి, విషయ విస్తృతి, వాటి ప్రదర్శనలో నిర్దిష్టతకు" ముగ్ధుణ్ణయ్యానని పొంగిపోయారు. 1967లో స్టరోస్టా విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి తన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని సమర్పిస్తూ జి.వి.రామమూర్తిగారి స్మృతికి అంకితమిచ్చాడు. ఆ సందర్భంలో– "ఉపాధ్యాయుడు, మానవతావాది, ముండా భాషాశాస్త్ర శాఖలో అగ్రగణ్యుడు అయిన రావు సాహెబ్ జి. వి. రామమూర్తిగారి స్మృతికి ఈ పరిశోధన అంకితం" అని రాసుకొన్నాడు. 1931–36 సంవత్సరాల మధ్యలో గిడుగు ఇంగ్లీషు–సవర, సవర–ఇంగ్లీషు నిఘంటువులు కూర్చారు. ఆపై సవర భాషకు వ్యాకరణం రాశారు. సవర జనపదాలలోని కథలను సంకలనం చేశారు. దేశంలోనే కాదు, విదేశాలలోనూ, ప్రపంచంలో ఎక్కడైనా సవర భాషపై పరిశోధన కొనసాగించాలనుకొనే భాషాశాస్త్రవేత్తలు రామ్మూర్తిగారి సేవలను స్మరించకుండా ముందుకుపోలేనంతటి పరిశోధన చేశారు.

## 4. గిడుగు: చరిత్ర పరిశోధన

గిడుగువారి సామాజిక స్పృహ, చరిత్ర పరిజ్ఞానం తక్కువది కాదు. ఆయన చరిత్రకారులకు మార్గదర్శనం చేయగల పరిశోధన చేశారు. పర్లాకిమిడి, బరంపురం మొదలైన ప్రాంతాలను ఒరిస్సా రాష్ట్రంలో కలపడానికి అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను చారిత్రక ఆధారాలను చూపుతూ ఆ ప్రయత్నాలను ఎదుర్కొన్నారు. క్రీ.శ. 8–12శతాబ్దుల మధ్య కళింగరాజ్యానికి ముఖలింగం రాజధానిగా ఉండేదని మొదట చెప్పినది గిడుగువారే!. పర్లాకిమిడికి దగ్గర్లోని ముఖలింగేశ్వరాలయం, ఆ ప్రాంత ప్రాముఖ్యత, అక్కడి శాసనాలు... మొదలైన విశేషాలను చరిత్ర పరిశోధకులకు మొట్టమొదట అందించినదీ గిడుగువారే!. విన్సెంట్‌స్మిత్ తన భారతదేశ చరిత్రలో ఈ వివరాలను ఉపయోగించుకొన్న తరువాత ఈ విషయం మన పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. నాటి సామాజిక ఉద్యమానికి ఆధారభూతమైన నిజాలనెన్నిటినో చరిత్ర సాయంతో వెలుగులోకి తెచ్చారు. ఈ రెండు ప్రాంతాలనూ కలుపుకొని1936లో 'ఒరిస్సా' రాష్ట్రంగా అవతరించడం వేరే విషయం. – అప్పటి రాజకీయ చమత్కారం! – ఇప్పుడు మనమంతా దీన్ని బాగా అర్థం చేసికోగలం – .

## 5. గిడుగువారి భాషా(శాస్త్రా)వగాహన

భాషాధ్యయనంలో అవశ్యంగా గుర్తుంచుకోవలసిన అనేక విషయాలను గిడుగు తన వ్యాసాలలో, పరిశోధనలలో, ప్రసంగాలలో పేర్కొన్నారు. వీటిలో చాలావరకు మనకు నేడు గ్రంథరూపంలో అందుబాటులో ఉన్నాయి. – భాష పొందే పరిణామాలను శాస్త్రీయమైన అవగాహనతో గుర్తించాలి తప్ప, నిర్దేశిత వ్యాకరణాలు(prescriptive grammars) సూచించిన భాషను, పూర్వ కవులు వాడిన భాషను శాసనాలుగా

భ్రమించకూడదని అనేక సందర్భాలలో స్పష్టపరిచారు. కొత్తపాతల మేలుకలయికగా ఏర్పడిన భాషా వికాసాన్ని సంప్రదాయ సాహిత్యంనుంచే ఉదాహరణపూర్వకంగా చూపించారు. పూర్వ వ్యాకరణాలరీత్యా, అసాధువులైన తరువాతి కాలపు కవుల రచనలలోంచి ఉదాహరణలను చూపుతూ బాలకవిశరణ్యం అనే గ్రంథాన్ని రచించారు.

గిడుగువారి భాషా చర్చలు, విసుగూ–విరామంలేని వారి అధ్యయన తత్పరతను గుర్తించడానికి, మనలాంటివాళ్ళందరం స్ఫూర్తి పొందడానికి ఒక సంఘటనను మీ ముందు ఉంచాలనుకొంటున్నాను. ఈ సంఘటన– 'గిడుగు రామమూర్తి పంతులుగారు–నా అనుభవాలు' అంటూ శ్రీనివాస శిరోమణిగారు చెప్పినది. ఒకరోజు గిడుగు వేంకటరామమూర్తిగారు, శ్రీనివాస శిరోమణిగారు రైలులో ప్రయాణం చేస్తున్నారట. అప్పుడు– "... పంతులవారు ఏదో ప్రబంధము తీసుకొని పచ్చ పెన్సిలుతో గుర్తులు పెడుతున్నారు. నేను ఆ రైలు పెట్టెలో ఒక మూల కూర్చొని ఆయనకు కనబడకుండా సిగరెట్టు కాల్చుకొంటున్నాను. ఇంతలో నన్ను పిల్చినారు. ఏమిరా భగవంతుడా, ఏదో వ్యాకరణ సూత్రముతోనో, ఏదో శబ్దము, ఏదో మారిపోయింది అనో చెప్పి విసిగిస్తారు కాబోలు ననుకొంటూ సిగరెట్టు పారవేసి ఆయన దగ్గరకు పోవలెననుకొన్నాను. నన్ను చూచి చిరునవ్వుతో 'ఎబ్బే! సిగరెట్టు మాత్రము పారవేయకండి, ఒక్క శబ్ద రూపము మాత్రమే ఎలా మారిందో చెబుతాను' అన్నారు . . . . " – ఇలా ఉండేవి గిడుగువారి భాషా చర్చలు. ఏ అవస్థలో ఉన్నాం అన్నది ఆయనకు అప్రస్తుతం. భాషా వ్యవస్థను గాడిలో పెట్టడానికి ఎన్నిరకాలుగా శ్రమించవచ్చో– అంత శ్రమనూ వేంకట రామమూర్తిగారు చేశారు. మనమూ, తరువాతివారూ చేయడానికి తగిన ప్రేరణను అందించారు.

## 6. 'గిడుగు' పొందిన గౌరవాలు, పురస్కారాలు

గిడుగువారి అసామాన్యమైన భాషాసేవకు గౌరవపురస్సరంగా అప్పటి ప్రభుత్వం రావు సాహెబ్, కైజర్–ఇ–హింద్ వంటి బిరుదులతో సమ్మానించింది. – నిజానికి, ఇవన్నీ ఒక ఎత్తు. తెలుగు, సవర వ్యవహార ప్రాంతాలలోని ప్రజల గుండెల్లో ఆయన ఏర్పర్చుకొన్న శాశ్వతమైన స్థానం ఒక ఎత్తు.

## 7. 'గిడుగు' కోరిక– మన కర్తవ్యం

ఇప్పుడు వాడకానికి పనికివచ్చే భాష, సాహిత్యేతర వ్యవహారభాషనుంచి ఏర్పడాలని ప్రతిపాదించిన మొట్ట మొదటి తెలుగు భాషావేత్త గిడుగు వేంకట రామమూర్తి. పాఠ్యపుస్తకాల తయారీకి కందుకూరి వీరేశలింగం ప్రతిపాదించిన సులభగ్రాంథికాన్ని తిరస్కరించారు.

నేడు, గిడుగు మన మధ్య లేరు. కానీ, వారందించిన స్ఫూర్తి ఉంది. ప్రతి తెలుగు వ్యవహర్తా పూనుకొంటేగాని తరగనంత పని ఉంది. తెలుగుభాషకు ఉన్న వేల సంవత్సరాల చరిత్ర, వేలసంఖ్యలో వెలువడ్డ రచనలు...మొదలైన ఆధారాలతో రచనా వైవిధ్యాన్ని, కాలక్రమానుగుణమైన భాషా ప్రయోగ వికాసాన్ని పరిశోధకులు ఇప్పటికే కొంత నిరూపించారు. వెలువడిన తెలుగు రచనలు, వాటి స్వరూప, స్వభావాలను గూర్చి చేసిన విశేషచర్చ మనకు అందుబాటులో ఉంది. సంప్రదాయ రచనల గుణగణ వివేచనం ఒకవైపు జరుగుతుండగా, కాలక్రమంలో ఆ సమాచార నిధులకు మరెంతో సమాచారం చేరుతూ వస్తోంది. ఇది కావ్యాలు, శాస్త్ర గ్రంథాలు.... తదితర రచనల రూపంలో ఉంది. ఇదంతా తెలుగువారి, తెలుగుభాషా సమాజంయొక్క సాంస్కృతిక వారసత్వం. తెలుగువారి సొత్తు.

వ్యక్తిగతంగానూ, వ్యవస్థాపరంగానూ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో ప్రయత్నం జరిగిందన్నది నిర్వివాదాంశం. అయితే, ఇక్కడ గుర్తించవలసిన ప్రధాన విషయం, భాషావసరాలు నానాటికీ పెరుగుతుండడం. సమాజాల వృద్ధి, భాషల వృద్ధిపై ఆధారపడి ఉంటుందన్నది చారిత్రక సత్యం. సమాజాలు పెద్దవికావడం, భాషలో పదసంపద పెరగడం అన్న ప్రధాన కారణాలు రెంటినీ జాగ్రత్తగా గమనించవలసిఉంది.

భాషాభివృద్ధికి ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ఉండడం అన్నది ప్రతి భాషా సమాజానికి ఒక తప్పనిసరి అవసరం. ఏ భాషా సమాజంలోనైనా– వివిధ కాలాలలో వెలువడిన కావ్యాలు, గ్రంథాలు, వివిధాంశాలపై వెలువరించిన రచనలు.... మొదలైనవి ఆ భాషాభివృద్ధి, వికాసాలను సూచించే గీటురాళ్ళుగా నిలుస్తాయి. అయితే; నానాటికీ పెరుగుతూపోయే సమాజ భాషావసరాలను దృష్టిలో ఉంచుకొని వీటిని పునర్మూల్యాంకనం చేయడం భాషాభివృద్ధి ప్రణాళికలో ఒక కీలకమైన అంశం. ఈ అవసరం గడచిన కాలంతో పోల్చితే ఇప్పుడు చాలాఎక్కువ అని మనం తేలికగా గుర్తించగలం. అత్యంత కీలకమూ, ప్రభావవంతమూ అయిన ఈ అవసరాలన్నిటినీ తీర్చడంలో మానవవనరులకు నేటి సాంకేతిక వనరుల అనువర్తనలను జోడించుకొనే పనిని మనం వేగిరపరచుకోవలసి ఉంది. అప్పుడే ఆ భాషా, ఆ సమాజమూ సమంగా వృద్ధి సాధించగలుగుతాయి. గిడుగు వంటివారు మనకిచ్చిన సాహిత్య, భాషా వారసత్వాలను తరువాతి తరాలకు అందించడంలో మనం అంటుకట్టదగిన మరొక కీలకమైన శాఖగా సంగణక అనువర్తనలను మనం అనుసంధించుకోవాలి.

## 8. సిద్ధాంతం, ఆచరణలమధ్య సంబంధం

ఒక శుద్ధ విజ్ఞాన శాస్త్రాన్ని (pure science) అన్యభాషలో చదువుకొన్న విద్యార్థి తన మాతృభాషలో ఆ విషయాలను బాగా నివేదించగలుగుతుంటే ఆ సమాజంలోనివారి మాతృభాష బాగా అభివృద్ధి చెందినట్టు లెక్క. ఏ శాస్త్రమైనా, అది ఏ భాషలో నేర్చుకొన్నదైనా, తన భాషలో ఒక వ్యక్తి ఆవిష్కరించగలగాలి. నిజానికి, జ్ఞానాభివృద్ధి జరిగిన సమాజంలో మాట్లాడే భాషా, దానిని వ్యక్తంచేసే భాషా ఒక్కటే అయినపుడు ఆ సమాచార నివేదనలో స్పష్టత ఉంటుంది. ఇటువంటి స్పష్టతను అనువదించుకొన్న సందర్భాలలో కూడా మనం సంభావించగలిగినపుడే మన భాషలు అభివృద్ధి చెందినట్టు లెక్క. కానీ, మన నిత్య వ్యవహారంలో జరుగుతున్నదేమంటే, మన సమాజానికి కొత్తదైన భావాన్ని, కొత్త పదజాలంతో ఎదుటివారికి నివేదించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇటువంటి సందర్భాలలో వినిపించే, కనిపించే మిశ్రభాష ఎవరికీ మాతృభాష కాదు. ఆశ్చర్యకరంగా– మన దైనందిన వ్యవహారాలన్నీ ఈ మిశ్రభాషతోనే ముడిపడి ఉంటున్నాయి. ఇటువంటి భాషణంద్వారా – వ్యవహర్త చెప్పినది విని శ్రోత అర్థం చేసుకొన్నదీ లేదా చదివి అర్థం చేసుకొన్నది ఏమిటి? ఈ రెంటి మధ్య ఎటువంటి అర్థసంబంధం ఉంది? అన్నది పరిశోధించి చూస్తే మన భాషా వ్యవహార సామర్థ్యం, మన సమాజాల భాషావ్యవహారానికి సంబంధించిన తీరుతెన్నులు తెలుస్తాయి. దురదృష్టవశాత్తూ, ఇటువంటి పరిశోధనలు ఇక్కడ జరిగిన దాఖలాలు తక్కువ.

## 9. ప్రపంచీకరణ యుగానికి అనుగుణంగా తెలుగును చూడడం ఎలా?

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో తెలుగు బోధన, పరిశోధన, అభివృద్ధులను సమగ్రతా దృష్టి కోణంనుంచి చూడాల్సి ఉంది. తెలుగు బోధన అన్న అంశాన్ని కేవలం తెలుగు సాహిత్య, భాషా బోధన అన్న సంకుచిత అర్థంలో గ్రహించడంవల్ల అనర్థాలే ఎక్కువ. తెలుగు వ్యవహార ప్రాంతంలో వివిధ శాస్త్రాల అభివృద్ధి జరగడానికి అత్యంత ఆవశ్యకమైన సమగ్ర భాషాభివృద్ధి వ్యూహాలవైపు మన పరిశోధనలదారి మళ్ళించవలసిన అవసరం ఉంది. ఈ మౌలికసూత్రాన్ని దృష్టిలో ఉంచుకోకుండా జరిపే పరిశోధనలు, ఆచరణకు అలవికానివిగా మిగిలిపోతాయి. 2013 మార్చి చివరినాటికి తెలుగు భాష, సాహిత్యాలలో విశ్వవిద్యాలయాలలో వెలువడిన పరిశోధన, సిద్ధాంత గ్రంథాల సంఖ్య 5225. ఇవన్నీ మన రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల తెలుగుశాఖలలోనూ, తులనాత్మక అధ్యయన శాఖలలోనూ ఎంఫిల్, పిహెచ్.డి. పట్టాలు పొందిన గ్రంథాలు. వీటిలో చర్చించిన అంశాలలో ఎన్ని ఆచరణకు పనికివచ్చేవో లెక్కించడం మొదలు పెట్టడం సాహసమే అవుతుంది. తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం... చందంగా వెలువడుతున్న ఇటువంటి పరిశోధనల విలువల మదింపుకు పునఃశోధన మొదలు పెట్టవలసిందే!

మిశ్ర భాషలో భావావిష్కరణ, భావ గ్రహణం చాలా కష్టం. కాబట్టి వ్యవహర్తలు తమ మొదటి భాషను నిరంతరం నవీకరించుకొంటుండాలి. ఇందుకు వ్యవహర్తలకు కావలసిన పరిజ్ఞానాన్ని సమీకృత భాషా వ్యవస్థలు అందించగలగాలి. ఇటువంటి సంస్కరణలు మొదట విద్యారంగం నుంచి ఆరంభమవ్వాలి. ప్రస్తుతం అమలులో ఉన్న వివిధ స్థాయుల తెలుగు వాచకాలను గమనించండి. అనేక శాస్త్రాలకు సంబంధించిన అంశాలు పాఠాలరూపంలో కనిపిస్తాయి. ఆయా శాస్త్రాల బోధనలో భాగం చేయదగ్గ పాఠాలెన్నో తెలుగు వాచకాలలో దర్శనమిస్తాయి. మాతృభాషలో ఆయా విషయాలను నేర్పించాలనే ఆశయం మంచిదే కాని, ఇలా అమలు చేయడానికి కావలసిన భాషావనరుల అభివృద్ధికి తగిన కార్యాచరణ రూపొందించుకోకపోడం మాత్రం సరికాదు. అందువల్ల, ఒక స్థాయివరకూ, విధిగా, అన్ని విషయాలనూ వారివారి మొదటి భాషలలోనే నేర్పగలిగే విధంగా ఆయా వ్యవస్థలు తక్షణం నవీకరింపబడాలి. ఇందుకు– స్థాయులకు అనుగుణంగా విషయాలను అనుసరించి పదపట్టికలు, నిఘంటు వనరులు...తదితరాలను తయారుచేయడం అన్నది ఒక నిరంతర కార్యక్రమంగా సాగాలి.

ప్రస్తుతం ఉన్న సాంకేతిక వనరులు, గ్రంథ వనరులు... మొదలైన అనేక కారణాలవల్ల మన భాషా వ్యవస్థను పటిష్ట పరచుకోడానికి ఇది మంచి తరుణంగా తెలుగువారంతా భావించాలి. ఈ ఫలితాలనుసాధించగలిగే ఏకైక లక్ష్యంతో పనిచేసే సమీకృత భాషాభివృద్ధి వ్యవస్థ నేటి అవసరం. దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే సర్వ వ్యవస్థలలోనూ భాష అవసరం ఉండితీరుతుంది. సర్వ విషయాలనూ మోసుకువచ్చేది భాషే. మౌఖిక, లిఖిత రూపాలలో భాష అందించగలిగే ప్రయోజనాలను బాగా వినియోగించుకోడానికి తగిన అవసరాలన్నిటినీ ఒక్కచోటే తీర్చగలిగే వెసులుబాటు ఇప్పటికిప్పుడు మనకు లేదు. కానీ, ఏ కొద్ది రంగాలతోనో ఈ పనిని ప్రారంభించవచ్చు. ఆపై అన్నిటినీ కలుపుతూ ఒక సమగ్ర భాషా వ్యవస్థను ఏర్పర్చుకోవచ్చు. భాషా వ్యవస్థలో మనం ఏర్పర్చుకొనే సమగ్ర వ్యవస్థలు రాజకీయ, సామాజిక రంగాలలోని కేంద్రీకృత వ్యవస్థ లక్షణాలను కలిగిఉండవు. భాషా సమాజంలోని ప్రతి వ్యవహర్త భాషావసరాలను తీర్చగలిగే వనరులతో సర్వం సమగ్రమైన భాషా వ్యవస్థలు పనిచేస్తాయి. ఇటువంటి సమగ్ర, కేంద్రీకృత వ్యవస్థలు, సమగ్ర భాషాభివృద్ధిసూచులు లేని సమాజాలు, దేశాలు ఎప్పుడూ వెనుకబడే ఉంటాయి.

## 10. భాషా ప్రయోగంపై పరిశోధనలు జరగాలి

మన ఘన వారసత్వాన్ని భవిష్యత్తరాలకు అందించడానికి వాహికగా మన భాషా వ్యవహారం సంస్కరింపబడాలి. ఈ కృషిని విద్యారంగంతో ప్రారంభించి, పాలనారంగం, మాధ్యమరంగాలకు విస్తరించాలి. ఈ రంగాలకు సంబంధించిన భాష వాడుక, భాషావనరుల వృద్ధి ఏ స్థాయిలో ఉన్నాయి? వాటి

గమనమెటుపోతున్నది? అన్న విషయాలను నిరంతరాయంగా పరిశీలించగలిగే ఏర్పాట్లను తక్షణం మొదలుపెట్టాలి. అంతర్విభజనకు అమితంగా అవకాశం ఉన్న పై రంగాలకుతోడు, అంతర్జాతీయ కోణంనుంచి భాషాయోజనలో మార్పులు చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో మార్పులకు ఉద్దేశించిన 'ప్రపంచీకరణ' అన్న అభివృద్ధి సూత్రం ఆర్థిక రంగాలను ప్రభావితం చేసే అంశంగా ఎదిగి, ప్రపంచ ముఖ చిత్రాన్ని మార్చివేయడమన్నది ఆశ్చర్యకరమైన నిజం. ఆదాన, ప్రదానాలకు భాషా శాస్త్రవేత్తలు ఇచ్చిన కారణాలను అధిగమించి భాషల వాడుకలో మార్పులు కలుగుతుండడం ఇక్కడ గమనించవలసిన విషయం. ఆవశ్యకతాపూరణం అన్న ఒక్క లక్షణాన్ని వర్తింపజేసుకొని విద్యారంగం మొత్తంలో అనేక మార్పులు వస్తున్నాయి. ఫలితంగా– ప్రపంచంలోని ప్రజారంజక భాషే (popular language) బోధనాభాషగా స్థిరపడుతోంది. భాషా జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, సాంఘిక శాస్త్రాల జ్ఞానాన్ని అందించే బోధనాంశాలు, విజ్ఞాన/సాంకేతిక శాస్త్రాల జ్ఞానాన్నిఅందించే బోధనాంశాలు... అన్నిటా ఈ ప్రజారంజక భాషే వేళ్ళూనుకొంటున్నది.

ప్రజారంజక భాష (popular language) విషయంలో గుర్తించవలసిన విషయం ఏమంటే– సజాతీయ భాషా కుటుంబంలోని భాషల మధ్య 'వినిమయం' చెదిరిపోవడం. పొరుగు భాషలతో సంగమం ఎక్కువ కావడం. స్థల, కాల అవధులను అధిగమించి తయారవుతున్న ఈ ప్రజారంజక భాషద్వారా వ్యక్తమవుతున్న సమ్మిశ్ర భాషా లక్షణాలను భాషా శాస్త్ర దృక్పథంతో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఆయా భాషలలో కలుగుతున్న ఈ మార్పులను అధ్యయనంచేసి, వాటి వాడకంలో వస్తున్న నూతన పద్ధతులను క్రమబద్ధం చేయగలిగే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోకపోతే, భవిష్యత్తులో – భాషా కుటుంబ విభజన సూత్రాలను పునస్సమీక్షించుకోవలసిన అవసరం కలగవచ్చు. సమాజ ఉపరితల నిర్మాణంలోనూ, అంతరంగ నిర్మాణంలోనూ భాషలకు ఉన్న ఇటువంటి ఘనిష్ఠమైన సంబంధాన్ని, ఈ నేపథ్యాల నుంచి చర్చించి, అభివృద్ధి యోజనను మనం రూపొందించుకోవలసి ఉంది. సమాజంలోని సభ్యుల భాషావసరాలను, భాషా ప్రయోగంలోని మార్పులను నిరంతరం పరిశోధించడంద్వారా ఇటువంటి ప్రజారంజక భాషలో మార్పులు చేసికొని ప్రజామోద భాషను నిర్మించుకోవచ్చు. ఇటువంటి స్ఫూర్తిని సమృద్ధిగా మనకు కలిగించిన వారిలో గిడుగు మొదటి వరుసలో నిలుస్తారు.

స్ఫూర్తి పొందడం అంటే అర్థం, అటువంటి స్ఫూర్తిని ఇవ్వగల పనిని ఆరంభించడం. దానిని కొనసాగించడం. తరువాతి తరాలకు ఆ ఫలాలను అందించే మహత్కార్యాన్ని తలకెత్తుకోడం. ఇందుకు విషయంపై సరైన అవగాహన అవసరం. దానికి శాస్త్రీయమైన బలంకూడా తోడైతే తెలుగువారికి సాధ్యం

కానిదేమీలేదు. గిడుగు 150వ జయంతి సందర్భంలో తెలుగువారందరం భాషాభివృద్ధికి పునరంకితమవుతూ ప్రతిన పూనుదాం!

గిడుగు తన చివరి పాత్రికేయ సమావేశంలో "... నా శ్రమ వృథా కాలేదు. మొట్టమొదట నలుగురయిదుగురు మాత్రమే ఆమోదించినా, నా వాదము వేలకొలది విద్యాధికులు, విద్యార్థులు, కవులు, రచయితలు ఆమోదించారు. ఏవో ఒకటి రెండు తప్ప తక్కిన పత్రికలన్నీ తమ సంపాదకీయ వ్యాసములూ, తక్కిన వ్యాసములూ వ్యావహారిక భాషలోనే ప్రకటిస్తున్నవి. ఇంతవరకు నేను కృతార్థుడను. ... యూనివర్శిటీలున్నూ, ప్రభుత్వ విద్యాశాఖవారున్నూ మాత్రం ఇంకా అనుగ్రహించలేదు" – అంటూ సెలవు తీసుకొన్నారు. ఈ స్ఫూర్తిని మనం కొనసాగించాలి. అప్పుడే– ఈ చదువులకు, ఇటువంటి సదస్సులకు సార్థకత.

## 11. ఉపయుక్త గ్రంథసూచి:


11.1 రామారావు, చేకూరి. 1986. మరోసారి గిడుగు రామమూర్తి, హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

11.2 వేంకట రామమూర్తి, గిడుగు.1933. బాలకవిశరణ్యం గుంటూరు: తెలికిచర్ల వేంకటరత్నం.


>>><<<<